అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 17-2-2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 50 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 14 + 16 పేజీలు వెల : 5.00

అశ్లీల వెబ్‌సైట్లను నిషేధించండి

భర్త వేధింపులతో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మహిళ

న్యూఢిల్లీ : 'అశ్లీల వెబ్‌సైట్లు వైవాహిక జీవితాలను కూల్చేస్తున్నాయి. వెబ్‌సైట్లను కట్టడి చేయకపోతే మరింత ప్రమాదకర పరిస్థితులు తలెత్తే అవకాశమున్నది. వెంటనే వాటిని నిషేధించండి' అంటూ ముంబయికి చెందిన ఓ మహిళ.. భారత సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పోర్నోగ్రఫిక్ సైట్లకు బానిసైన తన భర్త(35) నుంచి అనేక ఇబ్బందులు ఎదురౌతున్నాయని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అశ్లీల వెబ్‌సైట్లకు బానిసై.. రోజువారీ పనులను సైతం విస్మరిస్తున్నాడని తెలిపారు. ఆ వీడియోలు చూసేందుకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నాడని, కుటుంబ బాగోగులు పట్టించుకోవడం లేదని వాపోయారు. పైగా వెబ్‌సైట్లలో మాదిరిగా నిజ జీవితంలో కూడా ఉండాలని భావిస్తూ వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో పోర్న్ వీడియోలు విచ్చలవిడిగా లభ్యమవుతున్నాయని, లైంగికదాడులు, వైవాహిక పరమైన వివాదాలు పెరగడానికి ఇదే కారణమని చెప్పారు. పోర్న్ వెబ్‌సైట్లను కట్టడి చేయక పోతే.. పిల్లలు, యువత పెడదోవ పట్టే అవకాశముందని, మానవతా విలువలు మంటగలుస్తాయని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

'అమ్మకు సమయమివ్వండి'



న్యూఢిల్లీ: ప్రసవ సమయంలో సహజ ప్రసవం అయ్యే వరకూ వేచి వుండాలని, వైద్య చికిత్సల జోక్యాన్ని తగ్గించాలని డబ్ల్యూహెచ్‌వో సూచించింది. పిల్లల జనన ప్రక్రియల్లో అనేక మార్పులను సిఫార్సు చేసింది. 'సాధారణ ప్రసవం అయ్యేవిధంగా, ఆ మహిళ, శిశువు ఆరోగ్య స్థితిలో ఉంటే.. ప్రసవాన్ని వేగవంతం చేసేందుకు అదనపు జోక్యాలు అవసరం లేదు' అని డబ్ల్యూహెచ్ఓ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నెతెంబ సిమెలీల చెప్పారు. ప్రసవం సమయం మొదటి దశలో కొందరు మహిళల్లో గర్భాశయ విస్తరణ గంటకు ఒక సెంటీమీటరు ఉంటుందన్న గత ప్రమాణాలను డబ్ల్యూహెచ్ఓ తోసిపుచ్చింది. పురుటి నెప్పుల సమయం మొదటి దశలో ఒక మహిళకు, మరో మహిళలకు తేడా ఉంటుందనీ.. గర్భాశయ విస్తరణ అందరికీ ఒకేలా ఉండదనీ తెలిపింది. సుఖ ప్రసవం అయ్యే సందర్భాల్లో కూడా చికిత్సలు చేస్తుండటంపట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ.. ప్రమాదాలు నివారించడానికీ, సమస్యలను ఎదుర్కొన్నప్పుడు మాత్రమే చికిత్సలు చేయాలని స్పష్టం చేసింది. గర్భిణులకు తొలి దశ నుంచి మంచి సంరక్షణను అందించాలని తెలిపింది. ఆ మహిళ, ఆరోగ్య సంస్థ మధ్య మంచి కమ్యూనికేషన్ ఉండాలనీ, పురుటి నొప్పులు, జన్మస్థానాలు, బిడ్డ పురోగతిపై వారిలో అవగాహన పెంచాలని సూచించింది. సహజమైన ప్రసవం గురించి నిర్ణయాలు తీసుకునేలా డబ్ల్యూహెచ్ఓ యొక్క సిఫార్సులు ఉన్నాయి.

సర్పంచ్‌ను హత్య చేసిన ఇసుక మాఫియా

జైపూర్: తమ కార్యకలాపాలపై తనిఖీలు నిర్వహించేందుకు ప్రయత్నించిన సర్పంచ్‌ను ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ముఠా సభ్యులు తీవ్రంగా కొట్టి చంపారు. రాజస్థాన్‌లోని సవాయ్‌మధోపూర్ జిల్లా హత్రోలి గ్రామ సర్పంచ్ రఘువీర్ మీనాపై బుధవారం రాత్రి ఇసుక మాఫియా కర్రలు, రాళ్లతో దాడిచేసింది. ఎస్పీ మమన్ సింగ్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. సవాయ్ మధోపూర్‌కు సమీపంలో ఉన్న హింద్‌పురా గ్రామంలో ఇసుక మాఫియాను అడ్డుకునేందుకు పోలీసు, మైనింగ్ అధికారులతో కలిసి సర్పంచ్ రఘువీర్ మీనా వెళ్లారు. ఇది గమనించి కొంతమంది రాళ్లతో వీరిపై దాడికి పాల్పడ్డారు.

ట్రావెల్ బ్యాన్ ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధం

అమెరికా కోర్టులో ట్రంప్ సర్కార్‌కు చుక్కెదురు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆరు ముస్లిం దేశాలకు చెందిన వలసదారులను అమెరికాలో నిషేధిస్తున్నట్టు ట్రావెల్ బ్యాన్ పేరిట ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ట్రంప్ జారీ చేసిన ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధమని రిచ్‌మండ్‌లోని నాలుగో యూఎస్ సర్క్యూట్ కోర్టు ఆఫ్ అప్పీల్స్ శుక్రవారం తీర్పు వెలువరించింది. ట్రావెల్ బ్యాన్‌పై ట్రంప్, ఇతర అధికారులు జారీ చేసిన ప్రకటనలను నిశితంగా పరిశీలించిన అనంతరం కోర్టు 9-4 ఓట్ల తేడాతో ఇది రాజ్యాంగ విరుద్ధమని తేల్చి చెప్పింది.

యూఎస్ ఎగువ సభలో కీలక బిల్లులు తిరస్కరణ

అమెరికా వలస విధానంలో కీలక సంస్కరణలకు ఉద్దేశించిన బిల్లులను ఆ దేశ ఎగువ సభ తిరస్కరించగా.. ప్రవాస భారతీయులకు లబ్ధి చేకూర్చే చర్యల అమలుకు అడ్డుకట్ట పడింది. లక్షలాది మంది డ్రీమర్ల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. బాల్యంలోనే అగ్రరాజ్యంలోకి అక్రమంగా ప్రవేశించిన వారి హక్కుల పరిరక్షణకు ఒబామా హయాం నాటి ఢాకా కార్యక్రమాన్ని గతేడాది సెప్టెంబర్‌లో రద్దు చేసిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. సమస్య పరిష్కారానికి కాంగ్రెస్‌కు ఆరునెలల గడువు ఇచ్చారు. విస్తృత చర్చల అనంతరం అధికార విపక్షాలు ఏకతాటిపై వచ్చి ఓ బిల్లును రూపొందించాయి. 18 లక్షలమంది డ్రీమర్లకు పౌరసత్వం కల్పించేందుకు ప్రభుత్వం అంగీకరించగా.. మెక్సికో సరిహద్దు వెంట గోడ నిర్మాణానికి 2.5 వేల కోట్ల డాలర్ల ఖర్చు చేసేందుకు విపక్షం ఒప్పుకుంది. అయితే ఈ బిల్లు ఎగువ సభలో 39-60 ఓట్ల తేడాతో వీగిపోయింది. ఫలితంగా లక్షలాదిమంది డ్రీమర్లను మార్చి 5 తర్వాత స్వదేశానికి బలవంతంగా పంపే ముప్పు పొంచి ఉంది.

యూఎస్ మహిళా మేయర్ అభ్యర్థికి బెదిరింపులు



రెగీనా ముస్తాఫా

వాషింగ్టన్ : అమెరికా మేయర్ పదవి కోసం పోటీ చేస్తున్న తనను చంపేస్తామంటూ బెదిరింపు కాల్స్ వస్తున్నాయని రెగీనా ముస్తాఫా తెలిపారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఎన్నికల్లో పోటీ చేస్తే చంపేస్తామంటూ ఆగంతకుల నుంచి కాల్స్ వస్తున్నాయి. ట్విట్టర్ ఖాతాలోనూ కొందరు బెదిరింపులకు పాల్పడ్డారు' అని రెగీనా అన్నారు. సమాజానికి తన వంతు సేవ చేయాలని భావిస్తున్నానని అన్నారు. అయితే, ఇలాంటి చౌకబారు బెదిరింపులకు తాను భయపడనని అన్నారు. ఎన్నికల్లో తాను పోటీచేయకుండా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న ఆగంతకులను గుర్తించి శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. రెగీనాకు వచ్చిన బెదిరింపు కాల్స్‌పై సమగ్ర విచారణ చేపట్టాలని కౌన్సిల్ ఆన్ ఇస్లామిక్ రిలేషన్ సంస్థ డిమాండ్ చేసింది.

సౌర కుటుంబం బయట మరో వంద గ్రహాలు!

హూస్టన్ : మన సౌరకుటుంబం బయట ఇప్పటికే మనలాంటి ఎన్నో గ్రహాలను శాస్త్రవేత్తలు కనిపెట్టారు. తాజాగా మరో 100 గ్రహాలు ఉన్నట్టు సైంటిస్టులు గుర్తించారు. దీంతో, నాసాకు చెందిన కే2 మిషన్‌లో భాగంగా కనుగొన్న మొత్తం గ్రహాల సంఖ్య 300కు చేరింది. ' 275 గ్రహాలపై పరిశోధనలు జరిపాం. అందులో 149 నిజమైన ఎక్సోప్లానెట్స్‌గా గుర్తించాం. వాటిలో 95 కొత్తగా కనిపెట్టినవే' అని డెన్మార్క్‌లోని టెక్నికల్ యూనివర్సిటీ స్టూడెంట్ ఆండ్రూ మేయో తెలిపారు. 2014లో తొలి కే2 డేటా విడుదలైనప్పటి నుంచీ దీనిపై పరిశోధనలు జరుగుతున్నట్టు మేయో చెప్పారు. ఈ కొత్తగా కనిపెట్టిన గ్రహాల్లో మన భూమి సైజు నుంచి సౌర కుటుంబంలో అతిపెద్దదైన గురు గ్రహం సైజు వరకూ గ్రహాలను గుర్తించినట్టు ఆయన తెలిపారు. వీటిలో ఒక గ్రహం ఎంతో ప్రకాశవంతమైన నక్షత్రం చుట్టూ తిరుగుతున్నట్టు మేయో చెప్పారు. 2009లో ఈ కెప్లర్ స్పేస్‌క్రాఫ్ట్‌ను లాంచ్ చేశారు. కొత్త గ్రహాల అన్వేషణ కోసం వెళ్లిన ఈ స్పేస్‌క్రాఫ్ట్‌లో 2013లో సాంకేతిక సమస్యలు వచ్చినా.. శాస్త్రవేత్తలు దానిని సరిచేయగలిగారు. ఆ తర్వాత కే2 మిషన్‌ను లాంచ్ చేశారు. ఇది ఇంకా కొత్త గ్రహాల వేట కొనసాగిస్తున్నది.

భారత్‌లో అగ్రకులాల మహిళలకన్నా..

దళితుల ఆయురార్ధం 14.6 ఏండ్లు తక్కువ



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాధారణ లింగ వివక్షకు తోడు భారత్‌లోని కుల వివక్ష వల్ల దళిత మహిళల సగటు ఆయుర్దాయం అతి తక్కువగా నమోదవుతున్నట్టు ఐక్యరాజ్యసమితి(ఐరాస) తాజా నివేదిక వెల్లడించింది. భారత్‌లోని అగ్రకులాల మహిళల సగటు ఆయుర్దాయం 54.1 ఏండ్లు కాగా, దళిత మహిళల విషయంలో 39.5గా నమోదైంది. అంటే అగ్రకులాలవారితో పోలిస్తే దళిత మహిళలు 14.6 ఏండ్లు తక్కువ ఆయుర్దాయం కలిగి ఉన్నారు. దీనికంతటికీ వారు నివాసముండే ప్రాంతాలు మురికివాడలు కావడం లేదా పారిశుధ్య నిర్వహణ సరీగ్గా లేకపోవడం, రక్షిత తాగునీరు అందుబాటులో లేకపోవడం, పౌష్టికాహార లోపం కారణాలుగా ఐరాస నివేదిక వివరించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ దళిత్ స్టడీస్ సర్వే ఆధారంగా ఐరాస తన నివేదికను వెల్లడించింది. 2030 వరకల్లా లింగ సమానత్వాన్ని సాధించడం లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టిన రెండున్నరేండ్ల తర్వాత 89 దేశాలపై ఐరాస తన నివేదికను వెల్లడించింది. లింగ వివక్షకు సంబంధించి 17 అంశాల్లో సవాళ్లను ఎదుర్కొని సమానత్వం దిశగా పురోగతి సాధించాలనేది ఐరాస లక్ష్యాలుగా నిర్ణయించింది. సామాజిక హోదా, పారిశుధ్యం, రక్షిత తాగునీరు ఒకే విధంగా ఉన్న సందర్భాల్లోనూ అగ్రకుల మహిళలకన్నా దళిత మహిళల సగటు ఆయుర్దాయం 11.07 ఏండ్లు తక్కువగా నమోదైనట్టు ఐరాస నివేదిక పేర్కొన్నది. 89 దేశాల్లో మొత్తం 33 కోట్లమంది మహిళలు, బాలికలు పేదరికంలో మగ్గుతున్నట్టు ఐరాస నివేదిక తెలిపింది.



ఆర్థిక మోసం అసలు కథ ఏంటి?

- కొద్ది మంది బ్యాంక్ అధికారులతో రూ.11 వేల కోట్లు రుణాలు అందుతాయా?
- ఆర్థిక మోసగాళ్లను పట్టుకునే బాధ్యత మోడీ సర్కార్‌కు లేదా ?
- ఆర్థిక శాఖ, ఆర్‌బీఐ...నిఘా ఏమైంది ?
- మొండి బకాయిల జాబితాలో 'నీరవ్ మోడీ' రుణాల్ని చేర్చుతారా ?

"బ్యాంకుల్లో డబ్బు ఉందా? అక్కడ నీరవ్ మోడీలాంటి వారున్నారు, జాగ్రత్త ! ఇంట్లో డబ్బు దాచుకుంటున్నావా జాగ్రత్త...అక్కడ నరేంద్ర మోడీ (నోట్లరద్దు, జీఎస్టీ) ఉన్నారు"

- గత రెండు రోజులుగా సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతున్న సందేశం

జనవరి మొదటివారంలో ముంబయి, బ్రేడీ హౌస్ పంజాబ్ నేషనల్ (పీఎన్‌బీ) బ్యాంక్ బ్రాంచ్‌కు వచ్చిన ఓ దొంగ (నిరవ్ మోడీ కంపెనీ ఎగ్జిక్యూటివ్)...'లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్' వసతి 'రెన్యూవల్' చేయరూ...అని అడిగాడు. వచ్చిన వాడ్ని కూర్చోబెట్టి...నువ్వెవరు ? నీ సంగతేంది ? ఇంతకు ముందు తీసుకున్న 'ఎల్ఓయూ'లు ఏంటి ? అన్నది ఆరా తీసాక పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఉన్నతాధికారుల గుండె గుభేల్‌మంది. ఆ శాఖ స్కేల్-1 అధికారి గోకుల్‌నాథ్ శెట్టి, మరికొంత మంది బ్యాంక్ ఉద్యోగులు కుమ్మక్కై వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీకి రూ11 వేల కోట్లు రుణాలుగా అందజేశారన్నది బయటపడ్డది. 2011 నుంచి 2018 వరకూ ఎల్ఓయూ రూపంలో రూ.11,400 కోట్ల రూపాయలు రుణాలుగా అందాయి. వేలకోట్ల రుణాల వ్యవహారం వెనుక బ్యాంక్ స్కేల్ 1 అధికారి, మరికొంత మంది ఉన్నారని పీఎన్‌బీ చెప్పటం నమ్మశక్యంగా లేదని ఆర్థిక విశ్లేషకుల వాదన.

గోకుల్‌నాథ్ శెట్టి గత ఏడాది వేసవిలోనే పదవీవిరమణ చేశాడు. శెట్టి, మరికొంత మంది అధికారుల ప్రమేయంతో ఈ అవినీతి అంతా జరిగిందని పీఎన్‌బీ మేనేజింగ్ డైరెక్టర్, సీఇఓ సునీల్ మెహతా మీడియాకు చెబుతున్నారు. ఇటు కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ కూడా నరేంద్ర మోడీ సర్కార్‌కు ఏమీ సంబంధమేమీ లేదని 'మీడియా'కు కథ చెప్పారు. నిజానికి సాధ్యమైనన్ని రోజులు 'నీరవ్ మోడీ' వ్యవహారాన్ని దాచాలని పీఎన్‌బీ చూసింది. ఇందుకు ఆర్థిక శాఖ అండదండలు ఉండొచ్చు. కానీ ఆర్థిక మోసాన్ని ఎంతోకాలం దాచలేని పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే పీఎన్‌బీ అధికారులందరూ 'నీరవ్ మోడీ' వ్యవహారంపై నోరు మూసుకోరు కదా ! కాబట్టి పక్కా ప్రణాళిక ప్రకారమే, కేంద్ర ఆర్థిక శాఖ, పీఎన్‌బీ ఉన్నత అధికార నాయకత్వం ఈ ఆర్థిక మోసాన్ని మీడియా ముందు ఉంచాయన్నది రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయం.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం వెనుక అనుమానాలెన్నో



రుణాలు ఇచ్చిన బ్యాంకులు ఎలా ఊరుకున్నాయి ?

నీరవ్ మోడీ తెచ్చిన ఎల్ఓయూలపై రుణాలు ఇచ్చిన బ్యాంకులకు అనుమానాలు ఎందుకు రాలేదన్నది పెద్ద మిస్టరీగా ఉంది. నీరవ్ మోడీ ఇచ్చింది అసలు ఎల్ఓయూ కాకపోతే...రుణాలు ఇచ్చిన బ్యాంకులు తాము మోసపోయామని ఎందుకు బహిర్గతం కాలేదు. భూమి తనఖా పెట్టిన రైతు రుణాన్ని మరో సంవత్సరం రెన్యూవల్ చేయడానికి ఎంతో ఆలోచించే బ్యాంకులు, నీరవ్ మోడీ రుణాలపై ఏడు సంవత్సరాలపాటు ఎలా వేచి చూశాయి. అతడు మధ్య మధ్యలో చెల్లింపులు చేశాడా ? చేస్తే 11 వేల కోట్ల రుణాలు ఎలా పోగయ్యాయి ? అన్న సందేహాలు వస్తున్నాయి. ఆర్థిక శాఖ, ఆర్‌బీఐ తీరుపై ఢిల్లీ వర్గాలే అనుమానం వ్యక్తం చేస్తున్నాయి.

రుణాలు ఇచ్చిన...యూనియన్ బ్యాంక్ (రూ.2,300 కోట్లు), యాక్సిస్ బ్యాంక్ (రూ.2,200కోట్లు), అలహాబాద్ బ్యాంక్ (రూ.2 వేల కోట్లు), కెనరాబ్యాంక్ (వెయ్యి కోట్లు), బ్యాంక్ ఆఫ్ ఇండియా (వెయ్యి కోట్లు) గత ఏడేండ్లుగా ఏం చేస్తున్నాయి. రుణాలకు హామీదారు పంజాబ్ నేషనల్ బ్యాంకు. అలాంటిప్పుడు రుణాలు ఇచ్చిన బ్యాంకులు పీఎన్‌బీ ఉన్నతాధికారుల, ఆర్‌బీఐ దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదు ?

దీనికి సమాధానం...బహుశా ఈ ఆర్థిక బాగోతం ఎప్పుడో తెలిసుండాలి. ఒక్కసారిగా కాకుండా మెల్ల మెల్లగా పీఎన్‌బీ పలు విషయాల్ని బయటకు పెడుతోంది. ఇందుకు ఆర్థిక శాఖ, కేంద్రంలోని రాజకీయ శక్తుల అండదండలు ఉండొచ్చు! ఇంత పెద్ద కుంభకోణం జరిగితే...కేంద్ర ఆర్థిక శాఖ, పీఎంఓ, ప్రధాని మోడీ ఒక్కమాటా మాట్లాడలేదు. "మీ హయాంలో జరిగింది, కాదు మీ హయాంలోనే జరిగింది.."అంటూ అవినీతి కుంభకోణంపై అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకులు ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటున్నారు. చివరికి కొన్నాండ్లు పోయాక విషయం చల్లబడుతుంది. కార్పొరేట్ రుణాల జాబితాలో 'నీరవ్ మోడీ' రుణాలు చేర్చుతారు. దీంతో కథ కంచికి చేరుతుంది.

పట్టుకునే సత్తా లేదా?లేనట్టు నటిస్తున్నాయా ?

పొదుపు ఖాతాలకు ఆధార్ అనుసంధానం లేదని సామాన్యుల్ని ముప్పతిప్పలు పెడుతున్నారు. ఖాతా మూసేస్తామని వందల సందేశాలు మొబైల్ ఫోన్‌కు వస్తుంటాయి. కనీస నిల్వ లేదని వేల కోట్ల రూపాయలు ప్రజల ముక్కు పిండి బ్యాంకులు వసూలు చేశాయి. వేలకోట్లు ఎత్తుకెళ్లే దొంగల్ని మాత్రం పట్టుకునే సత్తా మన బ్యాంకులకు, ప్రభుత్వాలకు లేదా ? లేనట్టు నటిస్తున్నాయా ? ఎఫ్ఐఆర్ దాఖలు, ఆర్‌బీఐ విచారణ తేలేప్పటికి...ఆర్థిక మోసగాళ్లు దేశాన్ని దాటి పోతున్నారు, ప్రధాని మోడీతో ఎంచక్కా ఫోటోలు దిగి బిజినెస్ మాట్లాడుకుంటున్నారు. దేశం యావత్తు 'పంజాబ్ నేషనల్ బ్యాంక్' కుంభకోణంపై తీవ్ర ఆగ్రహంతో ఉంది. 2001లో కేతన్ పరేఖ్ పాల్పడిన బ్యాంక్ కుంభకోణానికి, నేటి నీరవ్ మోడీ తాజా కుంభకోణానికి పెద్ద తేడా ఏమీలేదు. కేతన్ పరేఖ్ బాగోతం నుంచి ఆర్‌బీఐ, బ్యాంకులు, ప్రభుత్వ అధికార యంత్రాంగం ఏం నేర్చుకున్నాయి ? అప్పట్లో పే ఆర్డరు (డిమాండ్ డ్రాఫ్ట్ తరహా)ను కేతన్ పరేఖ్ వాడుకుంటే, నేడు నీరవ్‌మోడీ 'లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్(ఎల్ఓయూ)ను వినియోగించుకున్నాడు.

గుర్తించినా.. గమ్మనున్నారు..

వజ్రాల వ్యాపారానికి సహజంగా 90 రోజుల గడువుతో ఎల్ఓయూ అందజేస్తారు. కానీ పీఎన్‌బీ అధికారులు ఎలాంటి తనిఖీలు నిర్వహించకుండా, కనీసం అనుమానం సైతం వ్యక్తం చేయకుండా 365 రోజులపాటు చెల్లుబాటు అయ్యే 'ఎల్ఓయూ'లు నీరవ్ మోడీ, సహచరులు, కుటుంబ సభ్యుల పేర్లతో ఉన్న బినామీ కంపెనీలకు జారీ చేశారు. బ్యాంక్ అంతర్గత ఆడిటింగ్‌లోగానీ, ఆర్‌బీఐ నిఘాలోగానీ 'ఎల్ఓయూ'ల తతంగాన్ని పట్టుకోలేకపోయారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్, ముంబయి శాఖ ఎల్ఓయూ జారీలకు సంబంధించి మోసం జరిగిందని జనవరి నెల ఆరంభంలోనే బ్యాంక్ ఉన్నతాధికారులు అధికారికంగా గుర్తించారు. జనవరి 6న దేశం దాటివెళ్లిన నీరవ్ మోడీ, దావోస్‌లో ప్రధాని మోడీతో కలిసి ఎంచక్కా గ్రూప్ ఫొటో దిగాడు.

పాలకులు సరిగ్గా ఉంటే..

నీరవ్ మోడీ వ్యవహారం బ్యాంకింగ్ రంగంలో ఉన్న లోపాల్ని బయటపెట్టింది. ప్రభుత్వాలు, పాలకులు సరిగ్గా ఉంటే...విజయ్ మాల్యా, కేతన్ పరేఖ్, నీరవ్ మోడీ...ఆటలెలా సాగుతాయి. కేవలం కొంతమంది బ్యాంక్ ఉన్నతాధికారులు వేల కోట్ల రుణాల బాగోతానికి కారణమవుతారా ? ఇది కేవలం ఆర్థిక నేరం, కుట్ర మాత్రం కాదు ? అధికారంలో ఉన్న బడా రాజకీయ నాయకుల ప్రమేయం కచ్చితంగా ఉంటుంది. కొన్నాండ్లు పోయాక కార్పొరేట్ రుణాల్ని బ్యాంకులు నిరర్ధక ఆస్తుల జాబితాలో చేరుస్తూ చేతులు దులిపేసుకుంటాయి. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన డబ్బుల్ని మూలధన సమీకరణ పేరుతో బ్యాంకులకు అందజేస్తారు. ఈ మొత్తం కథలో మోసపోయింది ప్రజలా ? బ్యాంకులా ? పాలకులా?

తమిళనాడుకు తగ్గిన 'కావేరీ' వాటా

- 177.25 టీఎంసీలు కేటాయిస్తూ సుప్రీంకోర్టు తీర్పు
- నదీ జలాలపై ఏ రాష్ట్రానికీ పూర్తి హక్కు లేదని వెల్లడి

న్యూఢిల్లీ: కావేరీ నదీ జలాల విషయమై కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కావేరీ నదీ జలాలపై ఏ రాష్ట్రానికి పూర్తి హక్కులు లేవని స్పష్టం చేసింది. తమిళనాడుకు 177.25 టీఎంసీల నీటిని విడుదల చేయాలంటూ కర్నాటక ప్రభుత్వానికి చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. తాజా ఆదేశాల ప్రకారం.. తమిళనాడుకు నీటి వాటాలో గతంలో కంటే 14.75 టీఎంసీలు కోత పడింది. కోత పడిన జలాలను కర్నాటకకు కేటాయించింది. వీటిలో బెంగళూరు వాసులకు త్రాగు నీటి కోసం ప్రత్యేకంగా 4.75 టీఎంసీలు కేటాయించింది. కావేరీ జలాలను కేరళ(30 టీఎంసీలు), పుదుచ్చేరి(7 టీఎంసీలు) పంచుకుంటుండగా.. ఆ రెండు రాష్ట్రాలకు సంబంధించిన కేటాయింపుల్లో ధర్మాసనం ఎలాంటి మార్పులూ చేయలేదు. కావేరీ నదీ జలాలను తమిళనాడుకు 419, కర్నాటకకు 270, కేరళకు 30, పుదుచ్చేరికి 7 టీఎంసీల చొప్పున కేటాయిస్తూ కావేరీ జల వివాద పరిష్కార ట్రిబ్యునల్ 2007లో తీర్పు వెలువరించింది. కాగా.. దీన్ని వ్యతిరేకిస్తూ కర్నాటక, తమిళనాడు, కేరళ.. సుప్రీంకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశాయి. అయితే.. ఇదివరకే తమిళనాడుకు 227 టీఎంసీల నీటిని కర్నాటక విడుదల చేసింది. మిగిలిన 192 టీఎంసీలను కూడా విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో కర్నాటక ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేసింది. అయితే.. భూగర్భ జలాలు, నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని కర్నాటకకు వాటా పెంచినట్టు ధర్మాసనం వెల్లడించింది. కావేరీ బేసిన్‌లోని 20 టీఎంసీల భూగర్భ జలాల నుంచి 10 టీఎంసీలు తమిళనాడు వాడుకోవచ్చని స్పష్టం చేసింది. ఈ తీర్పు 15 ఏండ్ల వరకు అమల్లో ఉంటుందని ధర్మాసనం తేల్చి చెప్పింది. తీర్పు వెలువడిన నేపథ్యంలో తమిళనాడులో పోలీసు ఉన్నతాధికారులు భద్రతను పెంచారు. ప్రత్యేకంగా కర్నాటకకు చెందిన విద్యా సంస్థలు, ఇతర కార్యాలయాల వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

ప్రతి పిల్లవాడు పుట్టుకతో రాజకీయవేత్త

'పరీక్షా పే చర్చా' లో ప్రధాని నరేంద్రమోడీ

న్యూఢిల్లీ: మొన్న 'ఛాయ్ పే చర్చ'.. నిన్న 'లంచ్ పే చర్చ'.. నేడు 'పరీక్షా పే చర్చ'. ప్రధాని మోడీ తన 'చర్చ'ల పరంపరను కొనసాగిస్తున్నారు. ఇప్పుడు తన దృష్టిని విద్యార్థుల వైపు మళ్లించారు. వార్షిక పరీక్షలకు సిద్ధం కాబోయే విద్యార్థులు.. పరీక్షల ఒత్తిడిని అధిగమించడానికి తాజాగా 'పరీక్ష పే చర్చా' ద్వారా ప్రధాని మోడీ ముందుకొచ్చారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఢిల్లీలోని తల్కతోరా మైదానం వేదికైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు.. ప్రధాని మోడీని పరీక్షల ఒత్తిడికి సంబంధించి పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థుల ప్రశ్నలకు ప్రధాని సమాధానాలిస్తూ పలు సూచనలు చేశారు. ప్రతి పిల్లవాడు పుట్టుకతో రాజకీయవేత్త అని ప్రధాని మోడీ అన్నారు. ఆత్మవిశ్వాసం చాలా ముఖ్యమని, ప్రతిరోజూ దాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఇతరులతో పోటీ పడవద్దని, పిల్లల పై తల్లిదండ్రులు ఒత్తిడి పెంచవద్దని ఆయన సూచించారు.

త్రిపురలో రేపే పోలింగ్

స్వచ్ఛమైన పాలనతో సీపీఐ(ఎం) దూకుడు

25 ఏండ్లుగా ఖాతా తెరవని బీజేపీ



నవతెలంగాణ-జనరల్ డెస్క్

ఈశాన్య రాష్ట్రం త్రిపురలో ఆదివారం జరిగే అసెంబ్లీ ఎన్నికలకుగాను సర్వం సిద్ధమైంది. మేఘాలయ, నాగాలాండ్‌లో ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి. ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీ మొదటిసారి అధికార, ధన బలంతో పోటీకి దిగింది. అందువల్ల ఈ రాష్ట్రాల్లోని పాలక పార్టీలు బీజేపీ నుంచి నేరుగా సవాలును ఎదుర్కొంటున్నాయి. త్రిపురలో బీజేపీ తరపున 25 మందికిపైగా మంత్రులు, సీఎంలు ప్రచార బాధ్యతలు భుజాన కెత్తుకున్నారు. ప్రధాని నరేంద్రమోడీ కూడా ప్రచారాల్లో పాల్గొని అక్కడి పాలకప్రభుత్వాలపై విమర్శలు చేశారు.

ప్రచారాల్లో పాతికమందికి పైగా బీజేపీ మంత్రులు, వంద మంది ఎంపీ, ఎమ్మెల్యేలు

త్రిపురలో గెలవడానికి బీజేపీ తొక్కని అడ్డదార్లంటూ లేవని లెఫ్ట్ నాయకత్వం ఆరోపిస్తున్నది. వేర్పాటువాద పార్టీతో అనైతిక పొత్తుపై విపక్షాలు మండిపడుతున్నాయి. 25 ఏండ్లుగా అసెంబ్లీలో సింగిల్ డిజిట్ లేని బీజేపీ సర్వశక్తులూ ఉపయోగించి ప్రచారం చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా సహ కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, సీనియర్ నాయకులు 25 మంది, 100 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆ రాష్ట్రంలో పాగావేశారు. నాథ్ యోగా కమ్యూనిటీకి చెందిన బెంగాలీ, ఇతరులు 70 శాతం మంది ఉన్నారు. అగర్తలలో నాథ్ దేవాలయం కూడా ఉంది. వారిని ఆకట్టుకునేందుకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను బీజేపీ రంగంలోకి దింపింది.

2013 ఎన్నికల్లో బీజేపీ 50 స్థానాల్లో పోటీ చేసింది. 49 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతయ్యాయి. కాగా, ఒక్క స్థానంలో కూడా విజయం సాధించలేకపోయింది.

బీజేపీ -ఐపీఎఫ్‌టీ పొత్తు

వేర్పాటువాద ప్రాంతీయ పార్టీ ఐపీఎఫ్‌టీతో బీజేపీ పొత్తు పెట్టుకుంది. మొత్తం అసెంబ్లీ 60 అసెంబ్లీ స్థానాలకుగాను బీజేపీ 51, ఐపీఎఫ్‌టీ 9 నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నాయి. గిరిజన ప్రాబల్యం ఉన్న ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలని ఐపీఎఫ్‌టీ దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నది. అందుకోసం హింసాత్మక చర్యలకు సైతం పాల్పడుతున్నది.

మాణిక్ సర్కార్ క్లీన్ ఇమేజ్

రాష్ట్రంలో 25 ఏండ్లుగా సీపీఐ(ఎం) అధికారంలో ఉంది. ఎర్ర కోటలో ప్రజాదరణ ప్రభుత్వానికి ఎలాంటి డోకా లేదన్న పూర్తి విశ్వాసంతో ఉంది. మాణిక్ సర్కార్ క్లీన్ ఇమేజ్, ఆయన వ్యక్తిత్వం ముందు బీజేపీ ఎత్తులు పారవని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

బీజేపీ సీఎం అభ్యర్థిని ప్రకటించకుండానే ఎన్నికల్లో ముందుకు సాగుతున్నది. గత అయిదు అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్‌ను సీపీఐ(ఎం) ఎదుర్కోగా.. ఈసారి అవి అట్టడుగు స్థాయిలో ఉన్నాయి. ఎన్నికలకు ముందు ఆరుగురు తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడం గమనార్హం.

బలమైన కార్యకర్తలే.. సీపీఐ(ఎం)ఆస్తి

ఈశాన్యంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. త్రిపుర రాజకీయాలు భిన్నమైనవి. మాణిక్ సర్కార్ స్వచ్ఛమైన పాలనతో ప్రభుత్వ పథకాలు అన్ని పంచాయితీలకు చేరాయి. అలాగే సీపీఐ(ఎం) క్యాడర్ ప్రతీ గ్రామానికీ విస్తరించి ఉన్నది. పంచాయితీ స్థాయి అధికారులు ప్రభుత్వ పథకాల నాణ్యతను తనిఖీ చేస్తారు. ప్రతీ నెలా ప్రణాళికలను సమీక్షిస్తారు. పేదల జాబితా కూడా ఇక్కడే సిద్ధమవుతుంది.

పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువ

గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహిళా ఓటర్లదే అగ్రస్థానం. రాష్ట్రంలో పురుషుల కంటే మహిళా ఓటింగ్ ఎక్కువ. 2013లో 91.82 శాతం పోలింగ్ జరిగింది. కాగా అందులో మహిళా ఓటింగ్ 92.94 శాతం కాగా, పురుషుల ఓట్లు 90.73 శాతం పోలయ్యాయి. 2008లో 91.22శాతం పోలింగ్ జరిగితే, అందులో పురుషులు 90.74 శాతం, మహిళా ఓట్లు 91.72 శాతం పోలయ్యాయి.

30 శాతం మంది గిరిజనులుండగా, మిగిలిన 70 శాతం బెంగాలీలు, ఇతరులు రాష్ట్రంలో ఉన్నారు.

త్రిపుర దేశంలో మూడవ అతి చిన్న రాష్ట్రం. 20 అసెంబ్లీ స్థానాల్లో గిరిజనులదే నిర్ణయాత్మక పాత్ర.

మొత్తం 60 స్థానాల్లో 10 ఎస్సీ, 20 ఎస్టీకి రిజర్వు చేయబడ్డాయి.

ఏ పార్టీకి ఎన్ని స్థానాలు

సంవత్సరం	సీపీఐ(ఎం)	కాంగ్రెస్	బీజేపీ	ఇతరులు
2013	49	10	00	01
2008	46	10	00	04
2003	38	13	00	09
1998	38	13	00	09
1993	44	10	00	06

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 17-2-2018 సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 4 సంచిక : 50 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 14 + 16 పేజీలు వెల : 5.00

పరేషాన్

సిగ్నల్ రాదు... ముద్ర పడదు

- చెట్లు, పుట్ట, మేడ ఏదెక్కినా రాదే..
- సిగ్నల్ కోసం ఈపాస్ యంత్రాలతో డీలర్ల పరుగులు
- 15 దాటితే సరుకులు బంద్
- గ్రామాల్లో రేషన్ పరేషన్
- ఎట్టయినా నష్టపోయేది లబ్దిదారులే


సిగ్నల్స్ కోసం డీలర్ల పాట్లు

ఆదిలాబాద్ జిల్లా తిమ్మాపురంలో.. వేలి ముద్రల కోసం డాబాపై కష్టాలు

రేషన్.. పేదలను పరేషాన్ చేస్తోంది. ప్రభుత్వ కొత్త నిబంధనలు కొర్రీలా మారాయి.. ఈపాస్ సిగ్నల్ రాదు.. వేలి ముద్ర పడదు.. సరుకులు చేతికి అందవు.. దీని కోసం లబ్దిదారులు రోజుల తరబడి పనులు మానుకుని పడిగాపులు కాస్తున్నారు. వేలి ముద్ర, 15వ తేదీ దాటితే సరుకులు బంద్ అనే నిబంధనలతో ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రజలకు దూరం చేస్తోంది. సిగ్నల్స్ కోసం ఈపాస్ యంత్రాలను పట్టుకుని డీలర్లు ఊరి చివర, మేడలపైకి, నీళ్ల ట్యాంకులు ఎక్కుతున్నారు. వారి వెంటే తిరుగుతూ లబ్దిదారులు నానాపాట్లు పడుతున్నారు. చెరువు గట్టుపైకి ఈపాస్ మిషన్లు తీసుకెళ్లి.. అక్కడ వేలి ముద్రలు తీసుకున్నాక మళ్లీ గ్రామానికొచ్చి బియ్యం పంపిణీ చేస్తున్నారు. దాంతో రోజుకు ఒక్కో దుకాణంలో 20 కార్డులకు కూడా సరుకులు ఇవ్వని పరిస్థితి.

నవతెలంగాణ- యంత్రాంగం

నిత్యం పనులు చేసే గ్రామీణుల వేలి ముద్రలు పడక ఇప్పటికే చాలా మందికి నెలల తరబడి బియ్యం పంపిణీ జరగడం లేదు. దీనికి తోడు 15వ తేదీ వరకే సరుకులు ఇస్తామన్న లిటిగేషన్‌తో ఫిబ్రవరిలో మూడొంతుల మందికి కూడా సరుకులు అందలేదు. వీటన్నిటి వెనుక ప్రభుత్వ మతలబు చెప్పకనే చెబుతోంది. ఆధార్ అనుసంధానంతో, కొత్త కొత్త నిబంధనలతో నగదు బదిలీ వైపు అడుగులు వేస్తోంది. తాను ప్రత్యక్షంగా చెప్పకుండా.. పరోక్షంగా లబ్దిదారులకు విసుగు పుట్టించేలా చేస్తూ.. "ఈ పాట్లు పడలేం.. సరుకుల డబ్బులే బ్యాంకుల్లో వేయండి.." అనేంత వరకు తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతున్నది.

15లో వారమే..

15వ తేదీలోపే ముగించాలన్న నిబంధన నేపథ్యంలో మధ్యలో వచ్చే సెలవులు, ఇటీవల తీసుకొచ్చిన బయోమెట్రిక్ కష్టాలతో సరిగ్గా వారం కంటే ఎక్కువ రోజులు పంపిణీ చేసే అవకాశాలు ఉండటం లేదు. మరోవైపు తమకు ఎక్కడ వేతనం ఇవ్వాల్సి వస్తుందోననే సర్కారు ఈ సంస్కరణలు చేపట్టిందని కరీంనగర్‌లో రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలోని రెండో రేషన్ దుకాణం పరిధిలో 540 మంది లబ్దిదారుల్లో 320 మందికి మాత్రమే గత నెల బియ్యం పంపిణీ చేశారు. 13 క్వింటాళ్ల బియ్యం వెనక్కి పోతున్నట్టు డీలర్ తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకే సరుకులు ఇవ్వడంతో ఇంకా ఎక్కువ మంది సరుకులు తీసుకోలేదు.

ఊరి చివర.. చెట్ల కిందే బయోమెట్రిక్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీలోని గిరిజన గూడేలు మండల కేంద్రాలకు దూరంగా ఉండటం వల్ల పనులు వదులుకుని 5 నుంచి 8 కిలోమీటర్లు నడిచి రేషన్ దుకాణాలకు వస్తున్నారు. తీరా అక్కడికి వెళ్లాక సిగ్నల్ లేక తిరగాల్సి 9లో

విరాళాలతో కమల వికాసం

గతేడాది 5 రాష్ట్రాల ఎన్నికల కోసం.. పార్టీలు సేకరించిన విరాళాలు రూ.1500 కోట్లు

- బీజేపీ వాటా 92.4 శాతం, రూ.1214 కోట్లు




న్యూఢిల్లీ: గతేడాది జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా జాతీయ, ప్రాంతీయ పార్టీలు వసూలు చేసిన విరాళాల మొత్తం రూ.1500 కోట్లుగా అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) లెక్క తేల్చింది. అయితే,ఖర్చు చేసింది మాత్రం రూ.494 కోట్లేనని ఏడీఆర్ తెలిపింది. ఇందులో ఐదు జాతీయ పార్టీలు సేకరించిన మొత్తం రూ.1314.29 కోట్లు, ఖర్చు చేసింది రూ.328.66 కోట్లు కాగా,16 ప్రాంతీయ పార్టీల విరాళాల మొత్తం రూ.189 కోట్లు, ఖర్చు చేసింది రూ.166 కోట్లు. 2017లో జరిగిన ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన వివరాలను ఏడీఆర్ వెల్లడించింది. విరాళాల వసూళ్లలో బీజేపీదే అత్యధిక వాటా 92.4 శాతం. ఆ పార్టీ సేకరించిన మొత్తం రూ.1214.46 కోట్లు కాగా, ఇందులో జాతీయ విభాగం రూ.1194.21 కోట్లు సేకరించగా మిగతా మొత్తాన్ని రాష్ట్ర విభాగాలు సేకరించాయి. ఆ పార్టీకి చెందిన గోవా విభాగం అత్యధికంగా రూ.17 కోట్లు సేకరించింది. మరోవైపు కాంగ్రెస్, ఎన్‌సీపీ, సీపీఐ(ఎం)కు చెందిన జాతీయ విభాగాలకన్నా ఆ పార్టీల రాష్ట్ర విభాగాలే అత్యధిక విరాళాలు సేకరించినట్టు ఏడీఆర్ తెలిపింది. కాంగ్రెస్ రాష్ట్ర విభాగాలు రూ.62.09 కోట్లు సేకరించగా, ఎన్‌సీపీ రాష్ట్ర విభాగాలు రూ.0.61 కోట్లు, సీపీఐ(ఎం) రాష్ట్ర విభాగాలు రూ.0.46 కోట్లు సేకరించాయి. శివసేన రూ.116 కోట్లు, ఆమ్‌ఆద్మీ పార్టీ రూ.37.35 కోట్లు సేకరించగా, బీఎస్‌పీ విరాళాలేమీ సేకరించలేదని తెలిపింది.



కాంగ్రెస్.. బీజేపీలతో రాజకీయం భ్రష్టు

రాహుల్.. అమిత్‌షాలను తెలంగాణలో తిరగనివ్వం

- సహనం ఆగ్రహంగా మారకముందే నిర్ణయం తీసుకోవాలి : మంద కృష్ణ


మాట్లాడుతున్న మందకృష్ణ

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

దేశ రాజకీయాలను బీజేపీ, కాంగ్రెస్‌లు భ్రష్టు పట్టిస్తున్నాయని ఎమార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. తెలంగాణలో ఆ పార్టీ అధినేతలు అమిత్‌షా, రాహుల్ గాంధీలను తిరగనివ్వమని హెచ్చరించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఈ రెండు 9లో

సుబాబుల్, జామాయిల్ పంటలకు

గిట్టుబాటు ధర ఇవ్వాల్సిందే


మాట్లాడుతున్న రేణుకా చౌదరి, సున్నం రాజయ్య


చట్టసభల్లో ప్రభుత్వాలను నిలదీస్తాం : ఐటీసీ ముట్టడిలో రేణుకాచౌదరి, సున్నం వివరాలు 9లో

- ఐటీసీలో భారీ కుంభకోణం :పోతినేని
- పోలీసులు అడ్డుకున్నా.. తరలొచ్చిన రైతులు




కాంగ్రెస్‌లో కిరికిరి..!

నేతల మధ్య యాత్రల లొల్లి





- 26 నుంచి బస్సుయాత్ర.. రూట్‌మ్యాప్ సిద్ధం వివరాలు 9లో
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం వరకు....
- ఆ తర్వాత బ్రేక్...జూన్ వరకు కొనసాగింపు...ముగింపుసభకు రాహుల్



మింగిన మ్యాన్‌హోల్

- ఏపీలో సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేస్తూ ఏడుగురు కూలీలు మృతి
- విషవాయులు పీల్చడం వల్లే ప్రమాదం


వివరాలు 9లో



కాళేశ్వరం కేసు కొట్టేయండి

ఎన్జీటీలో తెలంగాణ అభ్యర్థన

- కొన్ని అనుమతులపై అభ్యంతరాలు : పిటిషనర్

వివరాలు 6లో




త్రిపుర

సంపాదకీయం

త్రిపుర.. దేశంలోనే అతి చిన్న రాష్ట్రం. కానీ అక్కడ చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలు నేడు దేశం దృష్టిని పెద్ద ఎత్తున ఆకర్షిస్తున్నాయి. త్రిపుర అనగానే సహజంగా అందరికీ రెండు విషయాలు గుర్తుకొస్తాయి. ఒకటి స్వచ్ఛతకు, త్యాగనిరతికి, సుపరిపాలనకు మారుపేరైన వామపక్ష ప్రభుత్వం. రెండూ నిజాయితీకీ నిరాడంబరతకూ నిలువెత్తు రూపమైన నిరుపేద ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్. అటువంటి చోట అధికారం కోసం బీజేపీ కనీ వినీ ఎరుగని రీతిలో కుయుక్తులు పన్నుతోంది. అనైతిక, అవకాశవాద చర్యలకు పూనుకొంటున్నది. తమ పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా మొదలు అగ్రనేతలందరినీ త్రిపురకు పరుగులు పెట్టిస్తోంది. ప్రధాని మోడీ తన మంత్రాంగణంతో పాటు స్వయంగా ఎన్నికల సమీకరణల్లో ప్రత్యక్ష జోక్యం చేసుకుంటున్నారు విలువలకు తిలోదకాలిస్తూ.. 60 అసెంబ్లీ స్థానాలు, 2 పార్లమెంటు స్థానాలు మాత్రమే ఉన్న అతి చిన్న రాష్ట్రాన్ని కైవసం చేసుకోవడానికి బీజేపీ కేంద్రీకరించడానికి కారణమేమిటి..!? ఇది యావత్ దేశాన్ని ఆలోచింపజేస్తున్న ప్రశ్న..!

> **లెఫ్ట్ పాలన వల్లే రాష్ట్రం వెనుకబడిందనీ, మాణిక్యాన్ని మార్చి మరో వజ్రాన్ని ఎంచుకోవాలని తన స్థాయిని మరిచి చవకబారు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్న ప్రధాని మోడీ, గడిచిన రెండేండ్లుగా త్రిపురకు నిధులెందుకు నిలిపేశారో చెప్పగలరా..?**

నలభై ఏండ్ల క్రితం త్రిపురలో శాంతిభద్రతలు పెద్ద సమస్య. విద్య, వైద్యం అక్కడి ప్రజలకు చాలా అరుదైన విషయాలు. పేదరికం, నిరుద్యోగానికి తోడు తీవ్రమైన హింస అక్కడ అభివృద్ధికి అవరోధాలు.. అటువంటి రాష్ట్రం నేడు దేశంలో ఒక ఆదర్శమైన ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థను నిర్మించుకోగలిగిందంటే, స్వచ్ఛమైన పరిపాలనతో దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిందంటే అది ముమ్మాటికీ అక్కడి వామపక్ష ప్రభుత్వం సాధించిన విషయమేనన్నది ఎవరూ కాదనలేని సత్యం. నేడు దేశంలో ఏ అవినీతి మరక అంటని ప్రభుత్వమేదైనా ఉందంటే అది త్రిపుర వామపక్ష ప్రభుత్వమేననడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. కనుకనే రెండున్నర దశాబ్దాలుగా తిరుగులేని ప్రజాభిమానంతో వామపక్ష ప్రభుత్వం అప్రతిహత విజయాలతో కొనసాగుతోంది. ఇదే కాషాయ కూటమికి కంటగింపుగా ఉంది.



ఒక రాజకీయ పార్టీగా త్రిపుర ఎన్నికల్లో పాల్గొనే బీజేపీ హక్కును ఎవరూ కాదనలేరు. అది ఎన్నికల్లో గెలవాలనుకోవడమూ తప్పుకాదు. అందుకు అనైతిక, అవకాశవాద, అడ్డదారులను ఎంచుకోవడమే విచారకరం. అసాంఘిక శక్తులతో సైతం చేతులు కలపడం విషాదకరం. కేంద్రంలో అధికారంలో ఉన్న ఓ జాతీయపార్టీ, దేశ ఐక్యతకు, సమగ్రతకు తాము చాంపియన్లమని ప్రచారం చేసుకుంటున్న పార్టీ, పలు తీవ్రవాద సంస్థలతో సంబంధాలున్న ఒక వేర్పాటువాద సంస్థతో పొత్తు పెట్టుకోవడం అనైతికం, అవకాశవాదం కాక మరేమిటి..!? బీజేపీ పొత్తు పెట్టుకున్న "ఇండిజెనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ)" ఎన్ఎల్ఎఫ్‌టీ అనే ఒక తీవ్రవాద సంస్థ ద్వారా స్థాపించబడింది. దేశ సరిహద్దు వెలుపల కూడా ఈ సంస్థకు శిబిరాలున్నాయి. ఐఎస్ఐ, సీఐఏలతో కూడా సంబంధాలున్నాయి. అది త్రిపుర విభజనకు హింసాకాండకు పాల్పడుతున్నది. ఇవన్నీ కేంద్రానికి తెలియని విషయాలని అనుకోలేం. అటువంటి సంస్థతో బీజేపీ ఎన్నికల పొత్తు కుదుర్చుకోవడం దేశ భద్రతకు ముప్పుకాదా..? బీజేపీ మార్కు దేశభక్తికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి..!?

ఇక బీజేపీ అభ్యర్థుల్లో ఎక్కువ భాగం మిలియనీర్లు, పలు క్రిమినల్ కేసుల్లో నేరస్తులు. ఇది గెలుపు కోసం ఏ అడ్డదారులు తొక్కడానికైనా వెనుకాడని బీజేపీ తీరుకు మరో నిదర్శనం. ఇంతటి నీచానికి ఒడిగడుతూ తిరిగి వామపక్షాలపై అసత్య ప్రచారానికి, అడ్డగోలు విమర్శలకు దిగడం వీరికే చెల్లింది. సరిగ్గా మూడునెలల క్రితమే ప్రతికూలతలను సైతం సవాలుగా తీసుకుని పురోగమిస్తున్నదని త్రిపుర ప్రభుత్వాన్ని ప్రశంసించిన కేంద్రం... నేడు తీరా ఎన్నికల ముందు వామపక్షాల సారథ్యంలో త్రిపుర తీవ్ర వెనుకబాటుకు గురైందని విమర్శించడం అవకాశవాదం. ఒకరకంగా ఖాళీ ఖజానాతో త్రిపురలో తన ప్రస్థానాన్ని ప్రారంభించింది మాణిక్‌సర్కార్ ప్రభుత్వం. అనేక పరిమితులను, ప్రతికూలతలను అధిగమించి పురోగమించింది. కానీ అది కాంగ్రెస్ అయినా, బీజేపీ అయినా కేంద్రంలో ఎవరున్నా త్రిపురకు చేసింది సహాయ నిరాకరణే..! కనీసం అన్ని రాష్ట్రాలతో సమానంగా చూసినా త్రిపుర మరింత పురోగతి సాధించి ఉండేది. కానీ ఈ విషయాన్ని మరుగున పెట్టి లెఫ్ట్ పాలన వల్లే రాష్ట్రం వెనుకబడిందనీ, మాణిక్యాన్ని మార్చి మరో వజ్రాన్ని ఎంచుకోవాలని తన స్థాయిని మరిచి చవకబారు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్న ప్రధాని మోడీ, గడిచిన రెండేండ్లుగా త్రిపురకు నిధులెందుకు నిలిపేశారో చెప్పగలరా..? రాజకీయ విధాన ప్రాతిపదికను వదిలేసి, వ్యక్తిగత విమర్శలకు దిగడం ద్వారా ప్రధాని ప్రజలముందు తనను తాను బలహీన పరుచుకోగా, ఇది వ్యక్తుల మధ్య యుద్ధం కాదనీ, ప్రధాని వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేసి వారిని రాజకీయంగానే ఎదుర్కొంటామని చెప్పడం ద్వారా మాణిక్ సర్కార్ ప్రజల ముందు మరింత ఉన్నతంగా నిలిచారు. సాధారణ ప్రజలకు వ్యతిరేకమైన ఏ ఒక్క చర్యకూ పాల్పడని తమ ప్రభుత్వానికి ఆ ప్రజాబలమే మరోసారి విజయాన్నిస్తుందని లెఫ్ట్ భావిస్తుండగా, దానిని రాజకీయంగా ఎదుర్కోలేక అడ్డదారుల్లోనైనా అధికారాన్ని కైవసం చేసుకుని తీరాలని తద్వారా ఓ ప్రత్యామ్నాయాన్ని రూపుమాపాలని కాషాయకూటమి పన్నాగం.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఎందుకు పోరాడాలి?



పుతుంబాక అశోక్‌బాబు

ఖాయిలా పడిన, పడబోతున్న ప్రభుత్వరంగ సంస్థల పునరుద్ధరణ పేరుతో డీపీఈ, 29.11.2015న ఒక సర్క్యులర్ జారీ చేసింది. గైడ్‌లైన్స్ ప్రకారం వరుసగా మూడేండ్లు నష్టాలలో ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను ఇన్సిపియంట్ సిక్ (ఖాయిలా పడబోతున్న) కంపెనీలుగా ప్రకటిస్తారు. వాటి పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. బీఎస్ఎన్ఎల్ 2009-10 నుండి నష్టాలతో కొనసాగుతున్నది. కాబట్టి డీపీఈ గైడ్‌లైన్స్ ప్రకారం బీఎస్ఎన్ఎల్‌ను జబ్బు ప్రారంభం కాబోతున్న కంపెనీగా ప్రకటించామని, పునరుద్ధరణకు ప్రణాళిక రూపొందిస్తున్నామని గత డిసెంబర్ 27న లోక్‌సభలో కమ్యూనికేషన్స్ మంత్రి మనోజ్ సిన్హా అన్నారు.

డీపీఈ గైడ్‌లైన్స్ ప్రకారం ఖాయిలా పడబోయే కంపెనీల పునరుద్ధరణకు సంబంధిత మంత్రిత్వ శాఖ ఒక కన్సల్టెంటుని నియమించి, అది ఇచ్చే సిఫార్సుల ఆధారంగా ఒక ప్రణాళిక రూపొందిస్తుంది. ఈ ప్రణాళికలో వుండాల్సిన

> **ప్రభుత్వాలు స్వదేశీ, విదేశీ కార్పొరేట్ల ప్రభుత్వాలుగా వున్నంత వరకు ఇది జరగదు. కాబట్టి కార్పొరేట్ల ప్రభుత్వాలు కాకుండా నిజమైన ప్రజా ప్రభుత్వాలు రావాలి. అంటే మన పోరాటం కేవలం ఆర్థిక పోరాటం మాత్రమే కాదు. దేశ విధానాలను మార్చే రాజకీయ పోరాటం కూడా మన పోరాటంలో అంతర్భాగంగా వుండాలి.**

అంశాలు: 1. సిక్/ఇన్సిపియంట్ సిక్ కంపెనీలలో దేశ వ్యూహాత్మక/రక్షణ అవసరాలను నెరవేర్చే వాటిని ఉన్నత ప్రాధాన్యత/ప్రాధాన్యత గల సంస్థలుగా పరిగణిస్తారు. మిగతావి ప్రాధాన్యత లేనివిగా గుర్తిస్తారు. 2. మానవ వనరులను హేతుబద్ధం చేస్తారు. అంటే వీఆర్ఎస్ లేదా రిటైర్మెంట్ వయసు తగ్గింపు అమలు చేస్తారు. 3. ఉన్నత ప్రాధాన్యత/ప్రాధాన్యత గలవిగా గుర్తించిన వాటికి దేశ వ్యూహాత్మక, రక్షణ అవసరాలను నెరవేరుస్తున్నందుకుగాను జరిగే నష్టానికి పరిహారంగా "వయబిలిటీ గ్యాప్ ఫండింగ్" ప్రభుత్వం సమకూరుస్తుంది. పెట్టుబడుల సమీకరణలో భాగంగా డిజిన్వెస్ట్‌మెంటు/జాయింటు భాగస్వామ్యం చేయొచ్చు. ప్రాధాన్యతలేని వాటిని ప్రభుత్వ సహకారం లేకుండా మార్కెట్ సూత్రాల ప్రకారం పునరుద్ధరించవచ్చు. డిజిన్వెస్ట్మెంటు, ప్రయివేటు భాగస్వామ్యం, ప్రయివేటీకరణ చేయొచ్చు. దేశ వ్యూహాత్మక అవసరాల రీత్యా ప్రాధాన్యత గల ప్రభుత్వరంగ సంస్థలుగా 14వ ఫైనాన్సు కమిషన్ గుర్తించిన జాబితాలో బీఎస్ఎన్ఎల్ కూడా ఉంది. కాబట్టి బీఎస్ఎన్ఎల్ పునరుద్ధరణకు రూపొందించే ప్రణాళికలో వీఆర్ఎస్, 58కి రిటైర్మెంట్, పాక్షిక డిజిన్వెస్ట్మెంట్, దేశ వ్యూహాత్మక అవసరాలను నెరవేర్చేందుకు చేస్తున్న పనులకు "వయబిలిటీ గ్యాప్ ఫండింగ్", కొన్ని పనుల ఆపుదల, జాయింట్ వెంచర్స్ తదితరాలు ఉండొచ్చు.

పార్లమెంటు సభ్యుడు, ఎంటీఎన్ఎల్ ఉద్యోగుల నాయకుడైన అరవింద సావంత్ లేఖకు జవాబుగా కమ్యూనికేషన్స్ మంత్రి మనోజ్ సింహా రాసిన లేఖాంశాలు.

2016-17లో ఎంటీఎన్ఎల్‌కు సర్వీసులపై వచ్చిన ఆదాయం రూ.3070 కోట్లు. ఖర్చు రూ.6498 కోట్లు. నికర నష్టం రూ.2941 కోట్లు. నికర విలువ మైనస్ 3366 కోట్లు. ఎంటీఎన్ఎల్‌ను టెలికాం డిపార్టుమెంటు ఇన్సిపియంట్ సిక్ కంపెనీగా ప్రకటించింది. పునరుద్ధరణకు ఏమి చేయాలో సిఫార్సుకు ఎంటీఎన్ఎల్ మేనేజిమెంటు "డిలయిట్" కన్సల్టెంటు సంస్థను నియమించింది. ఈ సంస్థ సిఫార్సుల ప్రకారం ఎంటీఎన్ఎల్‌కు ఇప్పటి ఆదాయం పడి పోకుండా చూడాలి, మరింత ఆదాయాన్ని సంపాదించాలి. నెట్ వర్క్ విస్తరణకు పెట్టుబడులు పెట్టాలి. కొన్ని ఆస్తులు అమ్మి నిధులు సమకూర్చుకోవాలి. ఉద్యోగుల తగ్గింపునకు 58కి రిటైర్మెంట్, వీఆర్ఎస్ అమలు చేయాలి. ఇన్ఫ్రాస్ట్రక్చర్ అద్దెకివ్వాలి. అప్పు బకాయిలను రీస్ట్రక్చర్ చేయాలి. 2జీ స్పెక్ట్రమ్ కాల పరిమితి పెంచాలి. 900 మెగా హెర్ట్జ్ స్పెక్ట్రామ్‌ను సరళీకరించాలి (అంటే ఈ బ్యాండ్ స్పెక్ట్రమ్‌తో 2జీ మాత్రమే గాక 3జీ, 4జీ సేవలందించేందుకు ఎంటీఎన్ఎల్‌ను అనుమతించాలి.) ఎంటీఎన్ఎల్, బీఎస్ఎన్ఎల్ తమ ఆపరేషన్లలో సమన్వయాన్ని (సినర్జీ) సాధించాలి. ఈ సిఫార్సులను పరిశీలించేందుకు, ఫైనాన్షియల్, కార్పొరేట్ రిస్ట్రక్చర్ ఎలా చేయాలి పరిశీలించేందుకు డీఓటీ ఒక ఇంటర్నల్ కమిటీని నియమించింది. ఫైనాన్షియల్ అండ్ కార్పొరేట్ రీస్ట్రక్చర్ అనే దాని అర్థం డిజిన్వెస్ట్మెంటు, జాయింట్ వెంచర్, ప్రయివేటీకరణ తదితరాలుంటాయనీ...

పెన్షన్ రివిజన్

బీఎస్ఎన్ఎల్‌లో విలీనమైన డీఓటీ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వోద్యోగులకు వర్తించే సీసీఎస్(పెన్షన్) రూల్సు ప్రకారం పెన్షన్ చెల్లించబడుతుంది. పెన్షన్ చెల్లించేది బీఎస్ఎన్ఎల్ కాదు. డీఓటీయే పెన్షన్ చెల్లిస్తుంది. కాబట్టి బీఎస్ఎన్ఎల్ లాభనష్టాలకు, పెన్షన్ చెల్లింపునకు సంబంధం లేదు. సీసీఎస్ (పెన్షన్) రూల్సు ప్రకారం పెన్షన్ తీసుకునే కేంద్ర ప్రభుత్వ రిటైరీస్‌కు పెన్షన్ రివిజన్ చేసి అదే రూల్సు ప్రకారం పెన్షన్ తీసుకుంటున్న బీఎస్ఎన్ఎల్ రిటైరీస్‌కు పెన్షన్ రివిజన్ నిరాకరించటం సాధ్యమా? అందువలన రివిజన్ జరుగుతుందా లేదా అనే దానితో సంబంధం లేకుండా పెన్షన్ రివిజన్ చేయాలి. కానీ ఇది సాధ్యమా? పెన్షన్ రివిజన్ 1.1.2017కి ముందు రిటైరైన వారికి వర్తిస్తుంది. కానీ 1.1.2017 తరువాత రిటైరైన వారికి పే రివిజన్ జరిగితేనే తదనుగుణంగా పెన్షన్ రివిజన్ జరుగుతుంది. 1.1.2017కి ముందు రిటైరైన వారికి పెన్షన్ రివిజన్ చేసి తరువాత రిటైరైన వారికి పే రివిజన్, పెన్షన్ రివిజన్ చేయక పోతే వివక్ష అవుతుంది. కాబట్టి పే రివిజన్‌తో సంబంధం లేకుండా పెన్షన్ రివిజన్ సాధ్యం కాదు. ఈ వైరుధ్యాన్ని పరిష్కరించాలంటే పే రివిజన్ చేయాల్సిందే.

టవర్ కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా 2017 డిసెంబరు 12,13 తేదీల్లో బీఎస్ఎన్ఎల్ ఎగ్జిక్యూటివ్లు, నాన్ ఎగ్జిక్యూటివ్లు సమ్మె చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా టవర్ కంపెనీ ఏర్పాటు చేస్తోంది. ఈ టవర్ కంపెనీ బీఎస్ఎన్ఎల్‌కి ఉపసంస్థగా ఏర్పడినట్టు ప్రభుత్వం ప్రకటించింది. కానీ బీఎస్ఎన్ఎల్ యాజమాన్యాన్ని సంప్రదించకుండానే ఈ టవర్ కంపెనీకి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లను నియమించింది. డీఓటీలో జాయింట్ సెక్రెటరీగా వున్న ఐఏఎస్ అధికారి అమిత్ యాదవ్‌ను సీఎండీగా నియమించింది. బీఎస్ఎన్ఎల్ ఎండీ అనుపమ్ శ్రీవాస్తవను బోర్డ్ డైరెక్టరుగా నియమించింది! పేరుకు బీఎస్ఎన్ఎల్ ఉప సంస్థ అయినప్పటికీ దాని ప్రమేయం లేకుండానే టవర్ కంపెనీ వ్యవహారాలను ప్రభుత్వమే నేరుగా నడుపుతున్నది. టవర్ కంపెనీ ఏర్పాటు ప్రయివేటీకరణకేనని ఇది రుజువు చేస్తోంది.


వేతన సవరణ కోసం చేసే పోరాటం బీఎస్ఎన్ఎల్ ప్రజాహితాన్ని, దేశ వ్యూహాత్మక అవసరాలను రక్షణావసరాలను నెరవేరుస్తూ అదే సందర్భంలో లాభాలు సంపాదించే ప్రభుత్వరంగ సంస్థగా పునరుద్ధరించటం పై ఆధారపడి వుంది. టెలికాం రంగంలో అతి వేగంగా అనేక మార్పులు జరుగుతున్నాయి. చిన్న కంపెనీలు పెద్ద కంపెనీలతో విలీనమవుతున్నాయి. రెండూ లేదా అంతకన్నా



పెద్ద కంపెనీలు విలీనమై మెగా కంపెనీలుగా మారుతున్నాయి. 2018 జూన్ లేదా జులై నాటికి ప్రయివేటు టెలికాం కంపెనీలలో మిగిలేవీ ఎయిర్టెల్, రిలయన్స్ జియో, వోడాఫోన్-ఐడియాలు విలీనమై ఏర్పడే భారీ స్థాయి మెగా కంపెనీలు ఈ మూడే. డేటాకి వసూలు చేసి వాయిస్‌ను ఉచితంగా ఇవ్వటం విస్తారమైంది. ఇందుకు 4జీ స్పెక్ట్రమ్ అవసరం. కానీ ఇదీ చాలదు. త్వరలో ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్), ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) రాబోతున్నాయి. పరికరాలను ఆన్, ఆఫ్ స్విచ్ ద్వారా ఇంటర్నెట్‌కు అనుసంధానించటమే "ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్". దీని వలన మనుషులకు-మనుషులకు, మనుషులకు-పరికరాలకు, పరికరాలకు-పరికరాలకు మధ్య ఇంటర్నెట్ ద్వారా అనుసంధానం జరుగుతుంది. సెల్ ఫోన్, కాఫీ మేకర్, వాషింగ్ మెషిన్స్, హెడ్ ఫోన్స్, ధరించే పరికరాలు, ఇంకా ప్రతీ దానిని ఈ విధంగా అనుసంధానించ వచ్చు. ఉదాహరణకి మీరు ఒక సమావేశానికి కారులో వెళుతున్నారనుకోండి. ట్రాఫిక్ వలన అక్కడికి వెళ్ళటం ఆలస్యం అయ్యే పరిస్థితి ఉంటే మీ కారుకు గనుక కేలండర్‌కు రూట్సుకు ఐఓటీ కలిగి వుంటే మీరు లేటుగా వస్తున్నట్టు సమావేశం నిర్వాహకులకు సందేశం టెక్స్ రూపంలో వెళుంది. మీ అలారం క్లాక్‌ని మీరు 6 గంటలకు నిద్ర లేస్తామని సెట్ చేసి వుంటే, 6 గంటలకి మిమ్మల్ని నిద్ర లేపటంతో పాటు కాఫీని తయారు చేయమని మీ కాఫీ మేకర్‌కు సందేశాన్ని పంపిస్తుంది. మీ ఆఫీసు ఎక్విప్మెంటుకి ఐఓటీ వుంటే సప్లైలు తక్కువ అయినప్పుడు వెంటనే అది కావాల్సిన సప్లైలకు ఆర్డర్సు ఇస్తుంది. పని చేసే స్థలంలో మీరు ధరించే పరికరాలు మీరు ఎప్పుడు ఎక్కడ బాగా పని చేశారో ఉత్పాదకతని పెంచారో తెలియజేయటంతో పాటు ఇతర పరికరాలకు ఆ సమాచారాన్ని పంపిస్తుంది.

మనం చేసే పని, మన జీవన శైలి నాణ్యతని పెంచటానికి ఐఓటీ సహకరిస్తుంది. వాయిస్, డేటా పై ఆదాయం తగ్గుతున్న పరిస్థితిలో టెలికాం కంపెనీల ఆదాయం పెరగాలంటే అవి ఐఓటీ సేవలని అందించాలి. ఐఓటీ సేవలను అందించే టెలికాం కంపెనీల ఆదాయం 15 నుండి 20శాతం పెరుగుతుందని అంచనా. వాయిస్ ఆదాయం పడి పోయి డేటా ఆదాయం పెరుగుతున్నది. త్వరలోనే సాధారణ డేటా ఆదాయం కూడా పడి పోతుంది. ఐఓటీని అందిస్తేనే మనుగడ అనే పరిస్థితి ఏర్పడుతుంది. మరో నూతన సాంకేతిక ప్రక్రియ ఏఐ (ఆటోమేటిక్ ఇంటెలిజన్స్) అవసరం పెరుగుతుంది. ఏఐ వలన టెలికాం నెట్ వర్క్ ఆప్టిమైజేషన్ ఆటోమేటిక్‌గా జరుగుతుంది. వినియోగదారుల అభిరుచుల్ని విశ్లేషించి అందుకు తగిన్ ప్లాన్‌లను అందించటానికి ఏఐ అవసరం. కాబట్టి ఏఐ వున్న నెట్వర్క్‌ు అవసరం వున్నది. ఇందుకు భారీ పెట్టుబడులు అవసరం. వీటన్నింటికి 4జీ చాలదు. 5జీ కావాలి. ఇందుకు భారీ పెట్టుబడులు కావాలి. కానీ మన ప్రభుత్వం మాత్రం బీఎస్ఎన్ఎల్‌కు 4జీ స్పెక్ట్రమ్ ఇచ్చే విషయం పరిశీలిస్తున్నానని అంటున్నది. వాళ్ళు పరిశీలించి తేల్చే నాటికి 4జీకి కాలం చెల్లి 5జీ వస్తుంది. ఏఐ వస్తుంది. కాబట్టి సత్వరమే బీఎస్ఎన్ఎల్‌కు 4జీ స్పెక్ట్రమ్ ఇచ్చి 4జీ సేవలు అందచేయడానికి వీలుగా నెట్ వర్క్ అప్ గ్రేడేషన్‌కు అవసరమైన పెట్టుబడులు సమకూర్చాలి. 5జీ, ఐఓటీ, ఏఐ సేవలందించే అత్యాధునిక ప్రభుత్వరంగ సంస్థగా బీఎస్ఎన్ఎల్‌ను తీర్చి దిద్దాలి. ఇదంతా జరగాలంటే ప్రభుత్వానికి ప్రయివేటు కంపెనీల పట్ల మమకారం పోయి ప్రభుత్వ రంగం పట్ల మమకారం పెరగాలి. ఇందుకు సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను విరమించాలి. కానీ ప్రభుత్వాలు స్వదేశీ, విదేశీ కార్పొరేట్ల ప్రభుత్వాలుగా వున్నంత వరకు ఇది జరగదు. కాబట్టి కార్పొరేట్ల ప్రభుత్వాలు కాకుండా నిజమైన ప్రజా ప్రభుత్వాలు రావాలి. అంటే మన పోరాటం కేవలం ఆర్థిక పోరాటం మాత్రమే కాదు. దేశ విధానాలను మార్చే రాజకీయ పోరాటం కూడా మన పోరాటంలో అంతర్భాగంగా వుండాలి. ■

ఔను... శూర్పణఖలమే..!



ఎస్. పుణ్యవతి

ఫిబ్రవరి 6వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ రాజ్యసభలో ప్రసంగిస్తూ, ఆధార్ కార్డుకు బీజాలు అద్వానీ హయాంలోనే పడ్డాయన్నారు. రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి ఎద్దేవా చేస్తూ గట్టిగా నవ్వారు. సభాధ్యక్ష స్థానంలో ఉన్న వెంకయ్యానాయుడు తీవ్రంగా స్పందిస్తూ ఆరోగ్య సమస్యలేమైనా ఉంటే వైద్యులను సంప్రదించండంటూ హెచ్చరించారు. ఆ సమయంలో ప్రధాని జోక్యం చేసుకొని, రామాయణం సీరియల్ తరువాత అలాంటి నవ్వు వినే భాగ్యం ఈ రోజే లభించిందన్నారు. తరువాత రోజు కేంద్ర మంత్రి కిరేన్ రిజిజు 1980లలో వచ్చిన రామాయణం సీరియల్‌లోని శూర్పణఖ క్యారెక్టర్ ఉన్న క్లిప్పింగులు పంపించారు. ఇందుకు రేణుకాచౌదరి తన తీవ్ర వ్యతిరేకతను తెలియజేస్తూ సభాహక్కుల తీర్మానం పెడతానన్నారు. ఈ ఘటన పై మంత్రి స్మృతి ఇరానీ స్పందిస్తూ స్త్రీలపై వివక్ష అంశాన్ని ముందుకు తేవడాన్ని ఖండించారు. ఈ విషయాలన్నీ పత్రికల్లో వచ్చినవే.

ఔను శూర్పణఖలమే! ఎందుకంత ద్వేషం! ఎందుకంత అభద్రత! మీ అభిజాత్యం మీద దెబ్బ తగిలిందనా! మీ ఆధిపత్యాన్ని ఎద్దేవా చేసిందనా! మీ ఊకదంపుడు ఉపన్యాసాల్ని పరిహసించిందనా! మీ మనువాదపు పురుషాధిపత్యానికి సవాలు విసిరిందనా! మీ సింహాసనం పునాదులు కదులుతున్నాయని బెదురు పట్టుకున్నదా! లేక జబ్బలు చరుచుకోడాలు, రంకెలు వేయడాలు, తొడగొట్టి సవాలు చేయడాలు, బల్లలు విరగ్గొట్టడాలు, మీసాలు మెలేయటాలు మీ సొత్తంటారా! పురుషాధిపత్యంతో సొంత కులంలోని స్త్రీలనయినా సరే 'హద్దు మీరనివ్వం' అని లక్ష్మణ రేఖలు గీయదలుచుకున్నారా?

ఆడదాని నవ్వు చిరునవ్వులొలకాలే తప్ప, శృంగారాన్ని ఒలకబోయాలి తప్ప, రాజ్యాధినేతల్ని, వారి వికృత చేష్టల్ని అవహేళన చెయ్యడానికి ఎంత ధైర్యం?

అవురా! ధిక్కారముల్ సహింతునా! అంటూ హూంకరిస్తున్నారు వెంకయ్య గారు! కాకుంటే ఇంత రాజకీయ పరిణతి ఉన్న ఆయన 'నీకేదో రోగమున్నట్టుంది! డాక్టరుకు చూపించుకో" అని ఎలా అనగలి గారు! ఇదేనా ఒక మహిళా పార్లమెంటేరియన్ పట్ల చూపించే గౌరవం? అవును మరి. రాణీ పద్మావతి, అంతఃపుర స్త్రీలు అగ్నికి ఆహుతి కావడాన్ని ఆహా! అంటూ కీర్తించి గౌరవించే 'మీ సంఘ్' సేనలకు ఒక స్త్రీ నవ్వు కంపరం పుట్టించక మానునా!

బడ్జెట్టులో డొల్లతనం. మీ పరిపాలనలో డొల్లతనం. పది కోట్ల కుటుంబాలకు ఆరోగ్య రక్ష నిజమా? అంతో ఇంతో పేద బిడ్డలకు, తల్లులకు 'రక్ష'గా నిలబడ్డ అంగన్‌వాడీ పిండి బడిని కాదని పోస్టాఫీసుల్లో పిండి పొట్లాలు పంచుతామంటున్నారు! ఇది దయ్యాలు వేదాలు వల్లించడం కాదా! పది కోట్ల కుటుంబాల ఆరోగ్యానికి ఎన్ని కోట్లు కేటాయించారు? ఎవరి కోసం ఈ పథకాలు? కార్పొరేటు ఆస్పత్రుల కోసం, ప్రయివేటు ఇన్సూరెన్సు కంపెనీల కోసం కాదా!

ఔరా! నవ్వుతాం! నవ్వుకుంటాం! శూర్పణఖలమే! తాటకి, లంకిణి- అనండి. తిట్టండి! అఘాయిత్యాలు చేయండి? జైల్లో పెట్టండి! అయినా! ఆ కాలం నుండి-రామాయణ కాలం నుండి భూమి కోసం, అడవి కోసం, సముద్ర తీరం కోసం, నానా జాతులు, దళితులు, ఆదిమ జాతులు ఎదురు నిలిచి తిరగబడ్డాయి. మీ రాజ్యకాంక్షలు, మీ అగ్రవర్ణ బ్రాహ్మణ్యాధిపత్య భావజాల విస్తరణ కాంక్షలు చెల్లవుగాక చెల్లవు-అని ఎదురొడ్డి పోరాడుతున్నారు. సముద్ర తీర భూమి కోసం, పర్యావరణ రక్షణ కోసం, 60 రోజులు జైల్లో మగ్గిన సత్యవతి మా శూర్పణఖ జాతే! ఒక వర్నిక కుందు, ఒక గుర్మెహర్ కౌర్, ఒక గౌరీ లంకేశ్, ఒక బెనారస్ విశ్వవిద్యాలయం ఆడపిల్లలు- ఇప్పుడు పార్లమెంటే వేదికయ్యింది. పెద్దల సభ పెద్దరికం హూంకరిస్తోంది. దేనిమీద? ప్రజాస్వామ్యం మీద. సమానత్వం మీద. సమతా ధర్మం మీద.

అరణ్యాల్లో ఏం అవసరం వచ్చిందని రామ లక్ష్మణుల చేత విల్లు, బాణాలు పట్టించాడు విశ్వామిత్రుడు? ఆదిమ జాతుల్ని అణచడానికి కాదా! రాజ్యకాంక్ష కోసం కాదా! ఆయుధాలు పట్టిన రామలక్ష్మణులనే దేవుళ్లుగా కొలవలేదా!

నిండు గర్భిణీని అడవులకు పంపిన రామరాజ్యమా మీ రాజ్యం? 'శీలం, పాతివ్రత్యం' అనే ఒక అగ్ని గుండాన్ని సృష్టించి స్త్రీని, ఆమె వ్యక్తిత్వాన్ని, ఆమె జీవితాన్ని, కడకు స్త్రీ జాతిని పురుషుని పాదాక్రాంతం చేసే కుట్ర కాదా! కడకు సీతమ్మ అయినా. నిండు గర్భవతిని క్రూర జంతువులకు నెలవైన కీకారణ్యంలో వదిలినా వ్యక్తిత్వమున్న ఆడది గనక 'ఓ రామా! ఇక సెలవ్! గుడ్ బై!' అని చెప్పి తల్లి భూమాత ఒడిని చేరింది. తుదకు పిల్లలకు పాఠాలు చెప్తూ బతుకుతున్న 'యశోదాబెన్' కూడా మా స్త్రీ జాతి రత్నమే! రాజుల్ని, దేవుళ్లను చేసి ఎంత మభ్యపెట్టి మాయ చేసినా మీ మంత్రాలు, మంత్రాంగాలు చెల్లవ్. కాశీ విశ్వేశ్వరుని సమక్షంలోనే విద్యార్థినులు తిరగబడ్డారు. లాఠీ దెబ్బలయినా తిన్నారు గాని... స్వేచ్ఛ వదులుకోలేదు.

ఓ సోదరీ స్మృతీ ఇరానీ! వేముల రోహిత్‌ను కోల్పోయిన రాధికమ్మ కడుపు కోతే నీకు అర్థం కాలేదే? రేణుకమ్మ నవ్వు ఎప్పటికి అర్థం కావాలి? అంతఃపురం ఓ అంపశయ్య అని సీతమ్మ తల్లి చెప్పలేదా! కండ్లు తెరూ! కన్న తల్లి రేణుకనే గొడ్డలి వేటుతో తెగనరికిన పరశురాముని వారసులు రాజ్యాన్ని వెనకుండి నడుపుతున్నారని తెలుసుకో!

అయ్యా! మోడీ మీరు గద్దెనెక్కి నాలుగేండ్లు కావస్తోందే! మరి మహిళా రిజర్వేషన్ బిల్లు ఏమైంది? దాన్ని పార్లమెంటు ముందుకు తెచ్చే ధైర్యం లేకపోయిందేం మీకు? ఏ మొఖం పెట్టుకుని రేణుకమ్మను ఎగతాళి చేశారు?


అధినేతలారా! ఇకనైనా మీ హూంకారాలు, ఘీంకారాలు కట్టి పెట్టండి. రేణుకమ్మ రాజకీయ అభిప్రాయాలతో విభేదం ఉండొచ్చు గాక! కాని మీ వాగాడంబరాలు, మీ బడ్జెట్టు ప్రసంగాలు ఎవరికి నవ్వు పుట్టించవు గాక! ఆమె పట్ల మీ అప్రజాస్వామిక ధోరణిని సహించం గాక సహించం!

మరొక్కమాట. శూర్పణఖ నవ్విందో లేదో తెలియదుగాక, ద్రౌపది నవ్వుకు వ్యాకులపడి తెగ దుఃఖపడి పోయాడు దుర్యోధనుడు. పాచికలు ప్రయోగించాడు. చివరికి విధ్వంసం. సర్వ నాశనం. కురువంశ నాశనం. అందరికీ తెలిసిన పురాణమే కదా!

మేం స్వేచ్ఛను కోరే వాళ్లం! మా స్వేచ్ఛను వదులుకోం! మా సమానత్వాన్నీ వదులుకోం! మా జీవితాలనూ వదులుకోం. భూమాత బిడ్డలం మేం. మా భూమిని వదులుకోం! శూర్పణఖ మా సోదరి!

నవ్వుతాం! పకపకా నవ్వుతాం! విరగబడి నవ్వుతాం! భారత మహిళలం! పువ్వులం కాదు! నిప్పు రవ్వలం! ■


కర్ణాటక ఎన్నికల రణతంత్రం



పతకమూరు దామోదర్ ప్రసాద్

కర్ణాటక శాసనసభ 224 స్థానాలకు వచ్చే ఏప్రిల్ - మే నెలల్లో జరుగనున్న ఎన్నికలకు ప్రధాన రాజకీయ పక్షాలు అప్పుడే 'రణశంఖం' పూరించాయి. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షాలు బీజేపీ, మాజీ ప్రధాని దేవగౌడ నేతృత్వంలోని జనతాదళ్ (సెక్యులర్) ప్రచారయాత్రలతో, వ్యూహ ప్రతివ్యూహాలతో కదన సన్నాహాలు సాగిస్తున్నాయి. అయితే రాజస్థాన్‌లో 2 లోక్‌సభ, 1 అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో కమలం పార్టీ ఘోర పరాజయం దృష్ట్యా మోడీ సహా కమలనేతల "కలలు" అంత సులువుగా నెరవేరేపరిస్థితి కనిపించడం లేదు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో రాజస్థాన్‌లోని మొత్తం 25 స్థానాల్లో బీజేపీ గెలుపొందింది. అయితే కేంద్రంలో రాజస్థాన్‌లో కమలదళం దుష్పరిపాలన వల్ల ఇప్పుడు ఆపార్టీకి "ఎదురుగాలి" వీస్తోందన్నది స్పష్టం. సంస్థాగత వైఫల్యాల వల్ల కాంగ్రెస్ గుజరాత్‌లో వెనుకబడింది. వ్యాపార వర్గాలను, నగరవాసులను మచ్చిక చేసుకున్నా, మోడీ-అమిత్‌షా ఎన్నో ప్రలోభాలు పెట్టినా బీజేపీ కేవలం 7 స్థానాల మెజారిటీతో గుజరాత్‌లో గట్టెక్కింది. రాజస్థాన్ అల్వార్‌స్థానంలో 2014లో 2.84 లక్షల మెజారిటీతో బీజేపీ గెలవగా, ఇటీవల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ 1.95 లక్షల భారీ మెజారిటీతో గెలిచింది. అజ్మీర్ స్థానంలో 2014లో బీజేపీ 1.8 లక్షల మెజారిటీ సాధించగా, ఈసారి కాంగ్రెస్ 80వేల మెజారిటీతో గెలిచింది. రెండు పార్లమెంటు స్థానాల్లోని 16 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ ఆధిక్యత సాధించడం, మండల్‌గర్ శాసనసభా స్థానాన్నీ చేజిక్కించుకోవడం చూస్తే వసుంధరా రాజే - మోడీ ప్రభుత్వాలపై "జనాగ్రహం" పెల్లుబుకుతోందనడానికి నిదర్శనం.

ధనపతులకు లక్షలకోట్లు కట్టబెట్టే కార్పొరేట్ అనుకూల విధానాలు కొనసాగిస్తే "పుట్టి మునగడం" ఖాయమని గ్రహించి మోడీ ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో "పల్లెబాట" పట్టింది. అయితే తీవ్ర దుస్థితిలో ఉన్న సేద్యం - గ్రామీణ రంగాలను పునరుత్తేజితం చేయడమనేది కేంద్రం అమలు చేసే సానుకూల విధానాలపై ఆధారపడి ఉంది. కర్ణాటకలో తొలిసారి 2008 అసెంబ్లీ ఎన్నికల్లో బి.ఎస్. యడ్యూరప్ప సీఎంగా బీజేపీ ప్రభుత్వం కొలువు దీరింది. స్వతంత్ర శాసనసభ్యులను ధనం, పదవీ ప్రలోభాలతో దరిజేర్చుకుని, గనుల"ధని" గాలి సోదరుల అండతో అధికారంలోకొచ్చిన యడ్యూరప్ప ప్రభుత్వం అనతికాలంలోనే అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం తదితర ఆరోపణలతో ప్రతిష్ట కోల్పోయింది. అవినీతి కేసులో శిక్షకు గురైన యడ్యూరప్ప సీఎం పదవికి రాజీనామా చేసారు. ఆ తర్వాత సదానందగౌడ్ కర్ణాటక ముఖ్యమంత్రి అయినా అసమ్మతి కారణంగా వైదొలిగారు. 2013 ఎన్నికలకు ఏడాది ముందు జగదీశ్ శెట్టర్ కమలం పార్టీ 3వ ముఖ్యమంత్రిగా గద్దెనెక్కినా పట్టు సాధించలేకపోయారు. బీజేపీ అధిష్టానం తనను అవమానించిందనే ఆగ్రహంతో ఊగిపోయిన యడ్యూరప్ప 'కర్ణాటక జనతాపార్టీ (కేజేపీ) పేరిట వేరుకుంపటి పెట్టి 2013 ఎన్నికల్లో పోటీ చేసి కేవలం 6 సీట్లు దాదాపు 10శాతం ఓట్లు సాధించగా, గాలి జనార్ధనరెడ్డి అనుచరుడు బళ్ళారి శ్రీరాములు బడుగర, శ్రామిక, రైతు (బిఎస్ఆర్) కాంగ్రెస్‌ను స్థాపించి, 4 సీట్లు 1.79శాతం ఓట్లు సాధించారు. అవినీతి, అంతఃకలహాలతో కమలం కన్నడ కోటలు ఈ విధంగా "ఛిద్రం" కాగా రోసిపోయిన జనం మళ్లీ కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. అప్పటివరకు జేడీ(ఎస్)లో ఉన్న సిద్ధరామయ్య దళితులు, బీసీలకు రాజ్యాధికారం నినాదంతో కాంగ్రెస్‌లో చేరి ముఖ్యమంత్రి అయ్యారు. 223 స్థానాలకు పోటీ చేసిన కాంగ్రెస్ 36.6 శాతం ఓట్లు, 122 సీట్లు సాధించి అధికారం "హస్తగతం" చేసుకుంది. బీజేపీ, జేడీఎస్ చేరి 222 స్థానాలకు పోటీ చేసి, సమానంగా 40 వంతున సీట్లు దాదాపు 20శాతం తెచ్చుకుని ప్రతిపక్ష స్థానానికి పోటీపడ్డాయి. కర్ణాటక జనాభాలో 17శాతంగా ఉన్న



వీరశైవలింగాయతుల ప్రాబల్యం అధికం. ముంబయి కర్ణాటక సహా అనేక గ్రామసీమల్లో వారిపట్టు అధికం. అందుకే మోడీ అమిత్‌షా ద్వయం లింగాయవతులను ఆకట్టుకోవడానికి యడ్యూరప్పను రాష్ట్రపార్టీ అధ్యక్షునిగా నియమించి బీజేపీ గెలిస్తే సీఎం ఆయనేనని ప్రకటించారు. యడ్యూరప్ప నేతృత్వంలో బీజేపీ బృందం గత 3 నెలలుగా 'పరివర్తన' యాత్ర పేరిట కర్ణాటక అంతటా కలియదిరిగి సిద్ధ రామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ అవినీతి అక్రమాలను ఎండగట్టింది. అంతేగాక బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, ఇతర కేంద్ర మంత్రులు కర్ణాటకపై కేంద్రీకరించి కమల శ్రేణులను బూత్‌స్థాయిలో ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు.

బీజేపీ ప్రధానంగా హిందుత్వ, మోడీ జనాకర్షణ, అభివృద్ధి సుపరిపాలన నినాదాలతో కర్ణాటకలో అధికారంలోకి రావాలనే వ్యూహంతో ఉంది. బీసీలు, దళితులను మచ్చిక చేసుకోవడానికి తాజాగా యడ్యూరప్ప తదితర నేతలు మురికివాడలు, దళితపేటల్లో నిద్రచేసి అక్కడే సహపంక్తి భోజనం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కాగా మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ నేతృత్వంలోని జనతాదళ్(ఎస్) ఇటీవల మాయావతి నేతృత్వంలోని బహుజన సమాజ్ పార్టీతో ఎన్నికల పొత్తు కుదుర్చుకుంది. బీఎస్పీ కర్ణాటకలో దళ్-మిత్ర పక్షాల మద్దతుతో 20 శాసనసభా స్థానాలకు పోటీ చేయనుంది. సీపీఐ, సీపీఐ(ఎం), ఇతర అభ్యుదయ శక్తులతో కర్ణాటకలో 3వ ప్రత్యామ్నాయ నిర్మాణానికి దేవెగౌడ ఆయన కుమారుడు సీఎం అభ్యర్థి హెచ్‌డి కుమారస్వామి ప్రయత్నాలు సాగిస్తున్నారు. జనతాదళ్(ఎస్)తో కలిసి పోటీచేస్తామని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి ప్రకటించారు. బీజేపీ ఓటమే ప్రధాన లక్ష్యంగా 3వ కూటమిని బలపరుస్తామని మాజీ ఎంఎల్‌ఏ, సీపీఐఎం కర్ణాటక రాష్ట్ర కార్యదర్శి జి.వి. శ్రీరామ్‌రెడ్డి వెల్లడించారు.

జనతాదళ్(ఎస్) బీఎస్పీ, సీపీఐ, సీపీఐ(ఎం)లతో కలిసి మూడవ ప్రత్యామ్నాయంగా ముందుకొస్తే బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలి గెలుపు ఓటములను ప్రభావితం చేస్తుందని కాంగ్రెస్ నేతలు ఆందోళన చెందుతున్నారు. అలాంటి ప్రమాదమేదీ లేదని మళ్లీ కాంగ్రెస్ గెలుపు ఖాయమని సీఎం సిద్ధ రామయ్య భావిన్నారు.

సిద్ధరామయ్య నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పనికి 10శాతం కమిషన్ గుంజి, అవినీతి, దుష్టపరిపాలన సాగిస్తోందని, రాష్ట్రంలో శాంతిభద్రతలు ఘోరంగా దెబ్బతిని, హత్యలు పెరిగాయని, ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని ప్రధాని నరేంద్రమోడీ బెంగుళూరు సభలో తీవ్ర విమర్శలు గుప్పించారు. కోటికి పైగా జనాభాగల బెంగుళూరు మహానగరంలో శివారు రైలు మార్గాల నిర్మాణానికి రూ.17వేల కోట్లిస్తామని, మౌలిక, పౌర సౌకర్యాలను మెరుగు పరుస్తామని మెట్రో మిగతా మార్గాలను పూర్తిచేస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. ప్రధాని ఆవాస్‌యోజన కింద కర్ణాటకకు3.36 లక్షల ఇండ్లు ఇస్తే కేవలం 38వేల ఇండ్లు మాత్రమే నిర్మించారని, బెంగుళూరులో స్వచ్ఛ భారత్‌కు రూ.246 కోట్లిస్తే రూ.70 కోట్లు ఖర్చుచేయలేదని, ఆకర్షణీయ నగరాల నిర్మాణానికి రూ.836 కోట్లిస్తే, కేవలం రూ.143 కోట్లు కూడా ఖర్చు చేయలేని సీఎం సిద్ధరామయ్య అనీ, ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని ప్రధాని మోడీ ధ్వజమెత్తడం గమనార్హం.

దళిత బంధంతో అధికారంలోకి రావడానికి దళితనేతకు మరీస్వామి, లింగాయతులు కొన్ని బీసీ వర్గాల దన్నుతో సీఎం కావాలని యడ్యూరప్ప, మళ్ళీ సీఎం అయితే బీసీలు అధికారాన్ని, కాంగ్రెస్ ప్రాభవాన్ని పెంచాలని సిద్ధరామయ్య అనేక వ్యూహాలతో ముందుకొస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు లింగాయత వర్గంలో కనీసం 5శాతం ఓట్లు చీల్చి బీసీల మద్దతుతో అధికారంలోకి రావాలనేది కాంగ్రెస్ యత్నం. పేదలు అల్ప సంఖ్యాకులు, దళితులు సంక్షేమానికి తాము ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే కాంగ్రెసును మళ్ళీ అధికారంలోకి తెస్తాయని సిద్ధ రామయ్య ధీమా. ఆయనకు రాహుల్ అండ, మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ కన్నడిగులు ఎవరిని గద్దెనెక్కిస్తారో వేచిచూద్దాం.

సీనియర్ జర్నలిస్టు, సెల్: 9440990381

వ్యక్త పరచడమెలా !



రెండు నుంచి ఐదేండ్ల వయసులో ఉన్న చిన్నారులకు మంచి అలవాట్లను ఎలా నేర్పించాలి.. వారితో ఏం మాట్లాడాలి... ఎలా మాట్లాడాలి... అనే ప్రశ్నలు చాలామంది తల్లిదండ్రులకు వస్తాయి. ఆ వయసులోనే పిల్లలు చాలా ఎక్కువగా నేర్చుకుంటారు. కాబట్టి మంచి అలవాట్లను నేర్పించాలని నిపుణులు సూచిస్తున్నారు. వారి సూచనల్లో ..కొన్ని మీ చిన్నారుల కోసం...

- రెండు నుంచి ఐదు సంవత్సరాల చిన్నారులు ఎక్కువగా చూడటం ద్వారా, ముఖకవళికల ద్వారా, హావభావాల ద్వారా ఎన్నో విషయాలను నేర్చుకుంటారు. అలాంటి కొన్ని హావభావాలను చూద్దాం... బాగా ఆకలిగా ఉంటే చిన్నారులు ఏడుస్తారు. అలా ఏడిస్తే విషయం తల్లిదండ్రులకు అర్థం కాదు కాబట్టి బాగా ఆకలిగా ఉందని చెప్పడానికి నోట్లోకి చేయి పెట్టి చూపించండి. ఆ అలవాటే చిన్నారులు కూడా నేర్చుకుంటారు.
- బాగా దాహంగా ఉన్నప్పుడు బొటనవేలును నోట్లోకి పెట్టి చూపిస్తే చాలు వాళ్లు అదే అలవాటును స్కూల్లో కూడా కొనసాగిస్తారు.
- ఏదైన ఎక్కువగా తినాలనిపిస్తే... ఇంకా ఏదో అడగాలని అనుకుంటే రెండు చేతులను దగ్గరకు పెట్టి చూపిస్తే సరి! ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నరని అర్థం చేసుకోవచ్చు.
- ఇతరుల నుంచి ఏదైన సహాయం కొరితే వెంటేనే ప్లీజ్ అనడం లేదా దయచేసి ఇది ఇవ్వండి లేదా చేసి పెట్టడండని చెప్పడం నేర్పించాలి. ఇది కృతజ్ఞాత భావనకు గుర్తు. దయచేసి అనే పదం వాడేటప్పుడు ఎడమ చేతిని ఎద మీద పెట్టుకోవాలి.
- స్నేహితులు, బంధువులు ఏమైన గిఫ్ట్స్ ఇచ్చినప్పుడు, సహాయం చేసినప్పుడు ధన్యవాదాలు లేదా థ్యాంక్స్ చెప్పడం నేర్పించండి. థ్యాంక్స్ చెప్పడానికి కుడి చేతి వేళ్లను నోటి దగ్గర పెట్టుకొని తల కొద్దిగా వంచితే సరిపోతుంది.
- ఏదైన తప్పు చేసినప్పుడు సారీ లేదా క్షమించండని చెప్పడానికి కుడి చేతిని ఎద మీద పెట్టుకొని తల కొద్దిగా కిందకు దించితే సరిపోతుంది. ఈ హావభావాలు చిన్నతనం నుంచే నేర్పించడం వల్ల పిల్లలు ఎన్నో విషయాలను నేర్చుకుంటారు. భవిష్యత్‌లో చిన్నారులకు ఎంతగానో తోడ్పడతాయి. ❄

వాడి చూడండి!



చుండ్రు సమస్యతో ఇబ్బందిపడే వారు ఎన్నో రకాల షాంపూలను ఉపయోగిస్తారు. ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్ తీసుకుంటారు. అయితే అలా చేయడం వల్ల ఎన్నో సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. అందుకే చుండ్రు నివారణకు సహజ సిద్ధంగా ఉండే నిమ్మనూనె, తులసి నూనె, టీ ట్రీ నూనె వంటివి ఉపయోగించటం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని చెబుతున్నారు నిపుణులు.

నిమ్మకాయ నూనె: నిమ్మలో ఔషధ గుణాలు చాలా ఉంటాయి. జిడ్డును, అంటువ్యాధులను నివారిస్తుంది. అలాగే నిమ్మ నూనె జుట్టును అందంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. చుండ్రు సమస్య ఎక్కువగా ఉన్న వారు వారానికి మూడు సార్లు నిమ్మకాయ నూనెను తలకు పట్టిస్తే చుండ్రు సమస్య క్రమంగా తగ్గుతుంది.

టీ ట్రీ నూనె: ఇది ప్రకృతి సహజ లక్షణాలను కలిగి ఉంటుంది. అలాగే యాంటీ బ్యాక్టీరియల్‌గా పని చేస్తుంది. దురదను, చుండ్రును తొలగించటంలో దీని పాత్ర కీలకం. టీ ట్రీ నూనెలో జోజోబా, ఆలివ్ నూనెలను కలిపి తలకు పట్టించినా మంచి ఫలితం ఉంటుంది.

తులసి నూనె: చుండ్రును నివారించటంతో పాటు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. అలాగే జుట్టు ఊడిపోకుండా కాపాడుతుంది. చర్మ సంరక్షణకు, జుట్టు పెరగటానికి తులసి నూనె చాలా ఉపయోగపడుతుంది. ❄

'ఈ రాత్రి తెల్లవారకపోతే బాగుండు' అని ఎన్నిసార్లు అనుకుందో కావ్య. కానీ అన్ని రాత్రులకంటే ఈ రాత్రే ఎందుకో త్వరగా తెల్లారిపోయింది. 'మరికాసేపట్లో సురేంద్ర వస్తాడు. తన కడుపులో సరిగ్గా ఊపిరి కూడా పోసుకోని పసి గుడ్డు ప్రాణం తీయిస్తాడు' అని తలచుకుంటే ఆమె గుండెలు జారిపోతున్నాయి. కండ్ల నుంచి నీరు ప్రవహిస్తున్నది. కానీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి.



ఐద్వా అదాలత్
సెల్: 9490098024

అతని ప్రేమ ఓ నాటకం

సురేంద్ర రాత్రి ఇంటికి వచ్చినప్పుడు ఎన్ని మాటలు చెప్పాడో. బుజ్జగించాడు ఆమె వినలేదు. నచ్చజెప్పాడు.. ఒప్పుకోలేదు. చివరకు సెంటిమెంట్‌గా బ్లాక్‌మెయిల్ మొదలుపెట్టాడు. ఇక తప్పదనుకుంది. ఇప్పటికే ఓసారి అబార్షన్ చేయించుకుంది. ఇప్పుడు రెండో సారి. పుట్టకముందే బిడ్డల్ని హత్య చేస్తుంటే ఆ తల్లి గుండె తల్లడిల్లిపోతున్నది. కానీ ఏం చేయగలదు? ఏమీ చేయలేదు. ఆమెకు ధైర్యం చెప్పేవారే లేరా? కాదు.. ఎవరి తోడూ లేకుండా తనే ప్రపంచం అన్నట్లు తయారు చేశాడు సురేంద్ర ఆమెను.

పదేండ్ల కిందట సురేంద్ర పరిచయమైనప్పుడు ఎంత సంతోషించిందో. చిన్నతనంలోనే తల్లిని పోగొట్టుకున్న తనకు ఓ తోడు దొరకబోతుందని మురిసిపోయింది. అన్న, అక్క ఉన్నా పెండ్లిళ్లు అయిన తర్వాత ఎవరి సంసారాలు వారివే. చిన్న ఉద్యోగం చేసుకుంటూ, మంచాన పడ్డ తండ్రిని చూసుకుంటూ బతుకుతున్నది కావ్య.

ఆమె ఇంటి దగ్గర్లోనే ఉండేవాడు సురేంద్ర. చూడటానికి ఎంత అందగాడో అంతే అందంగా మాట్లాడతాడు. ఆడపిల్లలంటే ఎక్కడ లేని అభిమానం చూపిస్తాడు. కష్టాల్లో ఉన్న వారిని ఓదార్చుతాడు. తండ్రితో బతుకుతున్న కావ్య ఒంటరి తనాన్ని గమనించాడు. ఆమెను ఏం చేసినా మాట్లాడేవారు లేరని తెలుసుకున్నాడు. మెల్లగా మాటలు కలిపి ప్రేమలో పడేశాడు.

మంచిగా కబుర్లు చెబుతూ కావ్యను పెండ్లి చేసుకుని మంచి జీవితాన్ని చూపిస్తానని ఆమె తండ్రిని నమ్మించాడు. మంచంలో కదలలేని స్థితిలో ఉన్న ఆయన అంతకంటే ఏం చేయగలడు. మరోమాట మాట్లాడలేకపోయాడు. సొంత మేనమామ కొడుకునని చెప్పి వాళ్ళిద్దరినీ వేరే ఇంట్లో అద్దెకు దించాడు.

ఆఫీస్‌కు వెళ్ళేటప్పుడు, మళ్ళీ సాయంత్రం ఆఫీస్ నుంచి వస్తున్నప్పుడు... బండిపై తీసుకు వెళ్లేవాడు. రోజూ ఇంటికి వచ్చిపోతూ ఉండేవాడు. ఎటూ పెండ్లి చేసుకోబోతున్న వాళ్ళమే కదా అని తొందరపడ్డారు. తాళికట్టకపోయినా సురేంద్ర ఆమెకు భర్తగా మారిపోయాడు. దాంతో గర్భవతి అయింది. పెండ్లికాకుండా బాగుండదని ఏవో కబుర్లు చెప్పి అబార్షన్ చేయించాడు. ఆ తర్వాత వీరి మధ్య బంధం మరింత బలపడింది. తాగి అప్పుడప్పుడు ఇంటికి రావడం మొదలుపెట్టాడు. ఆఫీస్‌లో ఆలస్యమైతే కావ్య ఎప్పుడైనా తెలిసిన వారి బండిపై ఇంటికి వచ్చేది. అది చూసిన సురేంద్ర ఆమెతో గొడవపెట్టుకునేవాడు. అనుమానించేవాడు.

ఆమె ఏదైనా గట్టిగా మాట్లాడితే కొట్టేవాడు. ఇలాంటి పరిస్థితుల్లోనే ఇప్పుడు ఆమె మళ్ళీ గర్భవతి అయింది. సురేంద్ర ఇంట్లో ఈ విషయాలేమీ తెలియదు. 'మా అన్నకు ఇంకా పెండ్లి కాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు పుడితే మంచిది కాదని మళ్ళీ కావ్యకు నచ్చజెప్పి కాదు బెదిరించి చివరకు అబార్షన్‌కు ఒప్పించాడు. రాత్రి చెప్పిన సమయానికి రానే వచ్చాడు. కావ్యను తీసుకెళ్ళి అబార్షన్ చేయించాడు.

రెండోసారి కూడా అబార్షన్ చేయించడం, ఆమెను కొట్టడం ఇవన్నీ కావ్యలో అనుమానాన్ని పెంచాయి. అదే సమయంలో సురేంద్ర అన్న పెండ్లి కూడా జరిగింది. కావ్య తండ్రి ఆరోగ్యం పూర్తిగా పాడై చనిపోయాడు. దాంతో తనని వెంటనే పెండ్లి చేసుకోవాలని కావ్య, సురేంద్రను ఒత్తిడి చేసింది. ఎప్పుడైతే కావ్య పెండ్లి గురించి ఒత్తిడి చేయడం మొదలుపెట్టిందో అప్పటి నుంచి అతని నిజ స్వరూపం బయటపడింది.

'నాకు బయట పది లక్షలు కట్నం ఇస్తామంటున్నారు. మీ అన్న, అక్కను అడిగి అంత కట్నం తెస్తేనే చేసుకుంటా' అన్నాడు. కావ్య గొడవపెట్టుకుంది. అప్పటి నుంచి వారిద్దరి మధ్య యుద్ధం మొదలైంది.

ఆమె ఏదైనా గట్టిగా మాట్లాడితే కొట్టేవాడు. ఇలాంటి పరిస్థితుల్లోనే ఇప్పుడు ఆమె మళ్ళీ గర్భవతి అయింది. సురేంద్ర ఇంట్లో ఈ విషయాలేమీ తెలియదు. 'మా అన్నకు ఇంకా పెండ్లి కాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు పుడితే మంచిది కాదని మళ్ళీ కావ్యకు నచ్చజెప్పి కాదు బెదిరించి చివరకు అబార్షన్‌కు ఒప్పించాడు. రాత్రి చెప్పిన సమయానికి రానే వచ్చాడు. కావ్యను తీసుకెళ్ళి అబార్షన్ చేయించాడు.

ఓ పక్క సురేంద్ర ఇంట్లో అతనికి పెండ్లి సంబంధం చూశారు. నిశితార్థం కూడా చేశారు. మరికొన్ని రోజుల్లో అతను పెండ్లి చేసుకోబోతున్నాడు. మరోపక్క కావ్య పెండ్లి గురించి సురేంద్రను అడుగుతూనే ఉంది. అతను తాగి ఫోన్లో ఆమెను బూతులు తిట్టేవాడు. ఇదంతా గమనించిన సురేంద్ర తల్లి కావ్య గురించి తెలుసుకుంది.

ఫోన్ చేసి 'నా కొడుకు మంచి వాడు కాదు. వాడిని మర్చిపో. లేదంటే నీ జీవితం నాశనమైపోతుంది' అంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియక బాధపడుతుంటే తెలిసిన వారు ఐద్వా లీగల్‌సెల్‌కు వెళ్ళమని సలహా ఇచ్చారు. దాంతో ఆమె వచ్చి తన సమస్య చెప్పుకుని, సురేంద్రతో ఎలాగైన తాళి కట్టించమంటూ ఏడ్చేసింది.

కావ్య కష్టాన్ని విన్న సభ్యులు 'ఇన్నేండ్లు అతను నిన్ను మోసం చేశాడు. నిన్ను ఏంచేసినా అడిగే వాళ్ళు లేరని, నీ పరిస్థితిని తెలుసుకుని ఇలా చేశాడు. నువ్వు కూడా అమాయకంగా అతని మాయలో పడ్డావు. పైగా రెండు సార్లు అబార్షన్ చేయించుకున్నావు. ఆడపిల్లలు ఇంత అమాయకంగా ఉండబట్టే అబ్బాయిలు మోసం చేస్తున్నారు. పైగా తాగొచ్చి కొట్టడం, బూతులు తిట్టడం ఇదంతా ఇన్నాళ్ళు ఎలా భరించావు.

మంచిగా ఉద్యోగం చేసుకుంటున్నావు. నీ కాళ్ళపై నువ్వు నిలబడగలవు. అలాంటి వ్యక్తిని నమ్మి మోసపోయావు. ఇప్పటికి కూడా అతనితో తాళి కట్టించమని అడుగుతున్నావు. పెండ్లికి ముందే అతని వల్ల ఎన్నో కష్టాలు పడ్డావు. నువ్వు పెండ్లి గురించి నిలదీసేసరికి తప్పించుకు తిరుగుతున్నాడు. అలాంటి వాడితో తాళి కట్టించుకుంటే సుఖంగా ఉండగలవా. నీకు మంచి భవిష్యత్ ఉంది. అనవసరంగా నీ జీవితాన్ని చేతులారా నాశనం చేసుకోవద్దు' అన్నారు.

'మరి ఏం చేయమంటారు మేడమ్, అతన్నే నేను పెండ్లి చేసుకుంటానని మా ఆఫీస్‌లో, బంధువుల్లో, ఇంటి చుట్టుపక్కల వారందరికీ తెలిసిపోయింది. ఇప్పుడు నేను అతన్ని పెండ్లి చేసుకోకపోతే మళ్ళీ నన్ను ఎవరు పెండ్లి చేసుకుంటారు. వాడితో జీవితాంతం కాపురం చేయాలని నాకూ లేదు. ఒకవేళ నేను ఎవరినైనా పెండ్లి చేసుకుంటే, తర్వాత ఈ విషయం తెలిస్తే మళ్ళీ నా పరిస్థితి ఏమిటి. అందుకే ఇతన్నే పెండ్లి చేసుకోవాలనుకుంటున్నాను' అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది.

'ఎందరికి తెలిసినా సమస్యేమీ లేదు. రేపు నీకు కష్టాలు వస్తే వాళ్ళందరూ వచ్చి ఆదుకోరు. నిన్ను నువ్వే కాపాడుకోవాలి. ఎవరో ఏదో అనుకుంటారని ఇప్పుడు తొందరపడి నిర్ణయం తీసుకోవద్దు. అయినా ఇతరులకు వేరే పనులేమీ ఉండవా?. ఎప్పుడూ నీ గురించే ఆలోచిస్తుంటారా? మహా అయితే ఆరునెలలు, ఏడాది. తర్వాత అన్నీ మర్చిపోతారు. నీగురించి పట్టించుకునే వాళ్ళే ఉండరు. ఇక వేరే వాళ్ళను పెండ్లి చేసుకుంటే అతనికి నీ పాత విషయాలు తెలిస్తే ఎలా అని నీ సందేహం. ప్రేమించు కున్నవారందూ పెండ్లి చేసుకుంటున్నారా? ఎంతో మంది సమస్యలు వచ్చి ఇంట్లో చూసిన సంబంధాలు చేసుకుంటున్నారు. కాబట్టి ఇంకేమీ ఆలోచించకు' అని కావ్యకు అర్థమయ్యే విధంగా వివరించారు.

'మరి ఇప్పుడు నన్నేం చేయమంటారు. కనీసం అతని నుంచి నాకు కొంత డబ్బు ఇప్పించండి' అంది. అతని నుంచి నీకు కచ్చితంగా నష్టపరిహారం వచ్చే విధంగా చేద్దాం' అని చెప్పి సురేంద్ర తల్లిని తీసుకురమ్మని లెటర్ పంపారు. కానీ అతను రాలేదు. పైగా సభ్యులు ఫోన్ చేస్తే 'కావ్య ఎవరో నాకు తెలియదు. అసలు నాకు అమ్మాయిలతో పరిచయాలే లేవు. నేను ఎక్కడికీ రాను' అని ఫోన్ పెట్టేశాడు. అయితే తర్వాత ఐద్వా లీగల్‌సెల్ గురించి ఎంక్వైరీ చేసిన అతను తల్లిని వెంటబెట్టుకుని వచ్చాడు. అతని తల్లి మాట్లాడుతూ 'అమ్మా ఇప్పుడు మా వాడికి నిశితార్థం కూడా జరిగిపోయింది. త్వరలో పెండ్లి కూడా పెట్టుకున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో పెండ్లి ఆగిపోతే మరో అమ్మాయి జీవితం నాశనం అవుతుంది' అంటూ చెప్పుకొచ్చింది.

'ఇంకా పెండ్లి కూడా కాని మరో అమ్మాయి గురించి ఆలోచిస్తున్నారు. మరి పదేండ్ల నుంచి తాళికట్టకుండా మీవాడు కావ్యతో సంసారం చేస్తున్నాడు. రెండు సార్లు అబార్షన్ కూడా చేయించాడు. ఇప్పుడు అతను మరో పెండ్లి చేసుకుని సుఖంగా జీవిస్తాడు. మరి కావ్య పరిస్థితి ఏమిటి?' అని ప్రశ్నించాడు. 'ఆ అమ్మాయి బాధ్యత నేను చూసుకుంటాను. నా కూతురులా చూసుకుంటాను. జరగబోయే పెండ్లిని మాత్రం ఆపకండీ' అంటూ బతిమలాడుకుంది.

అలా అయితే కావ్య పేరుతో పదిలక్షలు ఫిక్స్ చేయండి. ఆమె జీవితం ఆమె చూసుకుంటుంది. లేదంటే కావ్య పోలీస్‌స్టేషన్‌లో కేసుపెడుతుంది. ఆమె దగ్గర అన్ని రకాల సాక్షాలు ఉన్నాయి' అన్నారు.

మా దగ్గర అన్ని డబ్బులు లేవు. లక్ష రూపాయలు మాత్రం ఇవ్వగలం. అంతకు మించి ఇవ్వలేం అన్నారు. కానీ దానికి సభ్యులు అంగీకరించలేదు. చివరకు నాలుగు లక్షలు ఇస్తామని అంగీకరించారు. డబ్బులు ఇచ్చిన తర్వాత ఇద్దరితో ఒప్పంద పత్రాలు రాయించి పంపించారు. ప్రస్తుతం కావ్య ఉద్యోగం చేసుకుంటూ ఒంటరిగా ఉంటుంది. అప్పుడప్పుడు ఐద్వా కార్యక్రమాల్లో పాల్గొంటూ తనలా సమస్యలు ఎదుర్కొనే మహిళలకు తన వంతు సాయం చేస్తుంది.

✍ సలీమ



75 శాతం మంచిదే!

- ఇతరులతో మాట్లాడటానికి ఎక్కువగా భయపడేవారు ముందుగా ఎదుటి వ్యక్తి కండ్లలోకి చూసి మాట్లాడటానికి ప్రయత్నించాలి. పక్కవారితో మాట్లాడుతున్నప్పుడు అటుఇటూ చూస్తూ మాట్లాడటం వల్ల అపార్థం చేసుకునే అవకాశం ఎక్కువ.
- మొదట్లో ఇలాంటి ఇబ్బంది ఉంటే నెమ్మదిగా అలవాటు చేసుకుంటే సరిపోతుంది. అలా కొన్నిసార్లు ప్రయత్నించి చూడండి! మీకే చాలా సులభంగా అలవాటు అవుతుంది. తద్వారా భయం క్రమంగా దూరం అవుతుంది.
- ఎదుటి వ్యక్తితో మాట్లాడేటప్పుడు 75 శాతం కండ్లల్లోకి చూసి మాట్లాడితే మంచిదని చెబుతున్నాయి కొన్ని పరిశోధనలు. అలాగే తదేకంగా చూసి మాట్లాడినా ప్రమాదం. కాబట్టి జాగ్రత్తగా వ్యవహరించండి. క్రమం తప్పకుండా చేస్తే మీలో దాగి ఉన్న భయం, ఆందోళన తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మరోసారి పక్కవారితో మాట్లాడేటప్పుడు ఎలాంటి బిడియం, భయం ఉండదు.

కండ్లలోకి చూసి మాట్లాడండి...

మనలో చాలామంది ఎవరితో మాట్లాడలన్నా.. ఎవరింటికైనా వెళ్లాలన్నా.. అబ్బాయిలతో మాట్లాడాలన్నా... తెలియని వారితో సంభాషించాలన్నా చాలా భయపడిపోతుంటారు. ఈ భయం సాధారణంగా అందరిలో ఉంటుంది. ఇది మంచిదే కానీ మరీ ఎక్కువైతే ప్రమాదం అంటున్నారు నిపుణులు. ఇలా భయానికి లోనైన వారు ఇతరులతో కలవలేక ఎన్నో అవకాశాలను కోల్పోతారు. దాంతో వాళ్ల విజయానికి వాళ్లే అడ్డుకట్ట వేసుకుంటారు. అలాంటి భయాన్ని, బిడియాన్ని ఎలా తొలగించుకోవాలో తెలుసుకుందాం...



కొత్త వ్యక్తులతో మాట్లాడండి !

- ఎదుటి వారు మీ గురించి ఏవో అనుకుంటారని ఆలోచించకపోవడం మంచిది. ఎక్కువగా సిగ్గుపడేవారు ఎదుటి వారు తమ గురించి ఏవో అనుకుంటారని మాట్లాడటం మానేస్తారు. వాళ్లకు తమ వాళ్ల ఇబ్బంది కలుగుతుందేమోనని మాట్లాడటం మానేస్తారు. ఇలాంటి వ్యక్తులు ఒక విషయం గమనించాలి. ఎవరి పనుల్లో వారు నిత్యం బిజీగా ఉంటారని గుర్తుంచుకోవాలి. ఎందుకంటే ప్రతి ఒక్కరికి ఏదో ఒక సమస్య ఉంటుంది.
- కొత్తవాళ్ల ఇంటికి వెళ్లాలంటే భయమేస్తే ఇలా చేయండి. ముందుగా మీ స్నేహితుల ఇంటికి, బంధువుల ఇంటికి తరచు వెళ్లడం అలవాటు చేసుకోవాలి. తద్వారా భయం పోతుంది.
- రోజులో ఒక కొత్త వ్యక్తితో మాట్లాడటానికి ప్రయత్నించాలి. ముఖ్యంగా తమలో ఉన్న భయం పోవాలంటే కొత్త వ్యక్తులతో మాట్లాడాలి. అలాగే తరుచు పార్టీలకు, సెమినార్లకు, ఇతర కార్యక్రమాలకు వెళ్తుండాలి. అలా వెళ్లడం వలన అక్కడ నలుగురు కొత్తవారు పరిచయం అవుతారు. భయం ఎక్కువగా ఉన్నవారు ఎక్కువగా ఒంటరిగా ఉండకుండా స్నేహితులతో గడపడానికి ప్రయత్నించాలి. అలాగే బయటి వ్యక్తులతో మాట్లాడేటప్పుడు ఆత్మవిశ్వాసంతో మాట్లాడాలి. ❄

ఇల్లు చిన్నగా ఉంటే!



ఇల్లు చిన్నగా ఉందని చాలామంది బాధపడుతుంటారు. ఇక శుభకార్యలు.. పండుగలొస్తే అలంకరించుకోవడానికి కూడా ఇబ్బందే! అలాంటి వారు కొంచెం సృజనాత్మకంగా ఆలోచిస్తే చాలు ఇరుకిరుకు గదులను కూడా విశాలంగా మార్చేయగలరు. అలాంటి కొన్ని చిట్కాలు మీ కోసం...

- ఇంట్లో మొక్కలు లేవని బాధపడుతున్నారా! అయితే ఏం పర్వాలేదు... ఇలా చేసేయండి.. సన్నగా, పొడవుగా, దృఢంగా ఉన్న తీగలను తీసుకోవాలి. ఇంటి బయటి గోడకు మొలలు బిగించి, తీగలను అల్లుకోవాలి. ఇక ఆ తీగలకు చిన్న చిన్న పూల కుండీలను వేలాడదీస్తే సరిపోతుంది.
- హాలో చిన్నగా, పొడవుగా ఉండే టేబుల్‌ను పెట్టుకోండి. అన్నింటికి సౌకర్యవంతంగా ఉంటుంది. చూడటానికి అందంగా కూడా కనిపిస్తుంది.
- ఎలక్ట్రానిక్ చార్జింగ్ కోసం ఇంట్లో ఓ ప్రత్యేకమైన ప్రదేశాన్ని ఏర్పాటు చేసుకుంటే మంచిది. దీని వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు.
- హ్యాంగింగ్ వాల్ సోరేజ్ వల్ల గోడలు అందంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. పాత లెదర్ క్రాఫ్ట్స్, చిన్న చిన్న బ్యాగుల ను గోడలకు వేలాడదీస్తే సరిపోతుంది. వాటిలో కరెంట్ బిల్లు, వాటర్ బిల్లు, టెలిఫోన్ బిల్లు మొదలైన ముఖ్యమైన కాగితాలను దాచుకోవచ్చు.
- వాల్ హ్యాంగర్ నోట్ పాట్ చూడటానికి చాలా అందంగా ఉంటుంది. దీన్ని కంప్యూటర్ పక్కన పెట్టుకుంటే చాలా అద్భుతంగా కనిపిస్తుంది.
- ఇంటిని శుభ్రపరిచే వస్తువులును, బట్టలను గదిలో ఒకవైపు గోడకు హ్యాంగ్ చేసుకుంటే మంచిది. ఎక్కడ పడితే అక్కడ పెట్టడం వల్ల ఇల్లు గందరగోళంగా కనిపిస్తుంది. ❄

ఇ ట్లు చే ద్దాం

ఆపిల్ గుజ్జులో చక్కర, పాలు కలిపి ఫేస్‌ప్యాక్‌లా వేసుకోవాలి. పదిహేను నిమిషాల తర్వాత చల్లటి నీళ్ళతో కడగాలి. ఇలాచేస్తే డల్‌నెస్ పోయి కొత్త నిగారింపు వస్తుంది.



ఆదాయ మార్గాలేంటీ..!

● ఎన్నికల్లో పోటీ చేసేవారు ప్రకటించాలి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఆస్తులు, ఆదాయ వనరుల వివరాల్ని తప్పక ప్రకటించాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. అంతేగాక ఎన్నికల అభ్యర్థి జీవిత భాగస్వామి, వారిపై ఆధారపడ్డవారి ఆదాయ వనరుల వివరాల్ని కూడా పరిశీలన జరపాలని సుప్రీం సూచించింది. లక్నో కేంద్రంగా పనిచేస్తున్న 'లోక్ ప్రహరీ' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై వాదోపవాదాలు వింటున్న సుప్రీంకోర్టు పై వ్యాఖ్యలు చేసింది. అనేక రాష్ట్రాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేల ఆదాయాలు, ఆస్తులు గణనీయంగా పెరిగాయని ఎన్జీఓ సంస్థ తన పిల్‌లో సుప్రీంకు తెలియజేసింది. దీనికి సంబంధించి ఆదాయ పన్నుశాఖ ప్రాథమిక విచారణను సుప్రీం పరిగణనలోకి తీసుకుంది. 26 మంది లోక్‌సభ ఎంపీలు, 11 మంది రాజ్యసభ ఎంపీలు, 257 మంది ఎమ్మెల్యేల ఆస్తులు, ఆదాయ మార్గాల్లో పెద్ద ఎత్తున మార్పు ఉందని స్వచ్ఛంద సంస్థ ఆరోపించింది. దీంతో ఈ వ్యక్తులపై ఆదాయపన్ను శాఖ ప్రాథమిక విచారణ జరిపి...నిజమేనని తేల్చింది.

ఎర్రజొన్న రైతుల దీక్ష భగ్నం

- రైతులు, పోలీసులకు మధ్య వాగ్వాదం
- 17 మంది రైతుల అరెస్టు
- క్వింటాకు రూ.4,500 ఇచ్చేదాకా ఉద్యమం : రైతు ఐక్య కార్యాచరణ కమిటీ



నవతెలంగాణ-నిజామాబాద్ ప్రతినిధి/ఆర్మూర్

మద్దతు ధర కోసం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎర్రజొన్న రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను పోలీసులు శుక్రవారం తెల్లవారు జామున భగ్నం చేశారు. సుమారు 3.20 గంటల ప్రాంతంలో దీక్షా శిబిరం వద్దకు వచ్చిన పోలీసులు రైతులు, నాయకులను అరెస్టు చేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో రైతులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీక్షలో కూర్చున్న 17 మంది రైతులను పోలీసులు అరెస్టు చేసి ఏసీబీ కార్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వేసి ఉన్న టెంటును పోలీసులు తొలగించారు. మరోవైపు మద్దతు ధర కోసం ఎర్రజొన్న రైతులు చేపట్టిన ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. క్వింటాకు రూ.4,500 చెల్లించే వరకూ ఆందోళనలు కొనసాగుతాయని రైతులు, రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు ప్రకటించారు. ఆందోళనలో భాగంగా శుక్రవారం ఆర్మూర్ డివిజన్‌లో పలు చోట్ల, మెండోరా మండలం బుస్సాపూర్‌లో 44వ జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు.

'పట్నంలో బతుకుదామని' పుస్తకావిష్కరణ



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఎస్ఎస్ లక్ష్మిదేవమ్మ రచించిన 'పట్నంలో బతుకుదామని' పుస్తకాన్ని ఐద్వా కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతి ఆవిష్కరించారు. శుక్రవారం ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. మహిళల జీవితాలు, నాటి, నేటి పరిస్థితులను రచయిత తన కథనాలు, కథల్లో వివరించారని పలువురు నేతలు అభినందించారు. ఈ కార్యక్రమంలో రచయిత లక్ష్మిదేవమ్మతో పాటు ఐద్వా సీనియర్ నేతలు బి హైమవతి, కెఎన్ ఆశాలత, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుగ్గవీటి సరళ, మల్లు లక్ష్మి, రాష్ట్ర నాయకులు స్వర్ణ, ఎస్ లత, అరుణజ్యోతి ఉన్నారు.

మోడల్ స్కూల్స్‌లో దరఖాస్తుకు గడువు పెంపు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

మోడల్ స్కూళ్లలో ఆరోతరగతి నుంచి పదోతరగతి వరకూ అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 28వరకూ పొడగిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ తెలిపారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 15న జరిగే ప్రవేశపరీక్షకు ఈనెల 16తో దరఖాస్తు గడువు ముగిసింది. దరఖాస్తులు భారీగా వస్తుండటంతో మరోసారి విద్యార్థులకు అవకాశం కల్పించారు.

గనుల అనుమతులకు రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ

- మైనింగ్ టుడే సదస్సు ముగింపులో
- మంత్రులు జోగు రామన్న, జగదీశ్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గనులకు సంబంధించిన అనుమతుల మంజూరుకు రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటుచేయనున్నట్టు రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి జోగు రామన్న, విద్యుత్ శాఖ మంత్రి జి. జగదీశ్‌రెడ్డి చెప్పారు. టిఎస్ ఐపాస్ మాదిరిగా నిర్ధిష్ట కాలంలో అనుమతులిచ్చేలా చర్యలు తీసుకోనున్నామని చెప్పారు. శుక్రవారం హైటెక్స్‌లో మైనింగ్ టుడే సదస్సు ముగింపు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇరువురు మంత్రులు హాజరయ్యారు. మైనింగ్‌లో పర్యావరణ సమతుల్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. అందుకే రాష్ట్రంలో పెద్దఎత్తున హరితహారం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. గనుల తవ్వకాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని, దీనిమూలంగా కాలుష్య తీవ్రత తగ్గడంతో పాటు ఆదాయం కూడా ఉంటుందని చెప్పారు మైనింగ్‌పై జరుగుతున్న పరిశోధనల ఫలితాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని కంపెనీ యజమానులకు సూచించారు. గనుల్లో పనిచేసే కార్మికుల రక్షణ, సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పర్యావరణానికి హాని కలగకుండా మైనింగ్ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఎండీసీతో గనుల శాఖ ఉన్నతాధికారులు, మైనింగ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిజాలు చెప్పడం లేదు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై జేఎఫ్‌సీ విమర్శ



హైదరాబాద్ : విభజన హామీల అమలు, నిధుల విడుదల, వాటి ఖర్చు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాస్తవాలు చెప్పడం లేదని జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (జేఎఫ్‌సీ) విమర్శించింది. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చొరవతో ఏర్పాటైన ఈ కమిటీ తొలి సమావేశం హైదరాబాద్‌లో శుక్రవారం జరిగింది. ప్రత్యేక హోదా తో పాటు విభజన హామీలు, నిధులు విడుదల తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సమావేశం తీర్మానం చేసింది. విభజన హామీల అమలు, నిధుల విడుదల, ఖర్చు తదితర అంశాలపై వివరాలు సేకరించేందుకు ముగ్గురు సభ్యులతో సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో మాజీ సిఎస్ ఐవైఆర్ కృష్ణారావు, కేంద్ర హోంశాఖ మాజీ సెక్రటరీ, సలహాదారు పద్మనాభయ్య, మహారాష్ట్ర కేడర్ మాజీ ఐఏఎస్ అధికారి చంద్రశేఖర్‌లు ఉన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ సమావేశానికి అధ్యతన వహించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కాంగ్రెస్ నుంచి జంగా గౌతమ్, గిడుగు రుద్రరాజు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ పాలకులు చేసిన తప్పులకు ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. విభజన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ పరస్పర విరుద్ధ ప్రకటనలతో ప్రజలను అయోమయ పరిస్థితుల్లోకి నెట్టేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటరీ వ్యవస్థలో మాట ఇచ్చి వెనక్కి వెళ్లిపోతే ప్రతీ ఒక్కరిలో తిరుగుబాటు ధోరణి వస్తుందని, దీని వల్ల వేర్పాటువాద ఉద్యమాలు ఊపిరిపోసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

కేంద్రం స్పందించాలి : మధు

విభజన హామీల అమలుపై మార్చి 5లోగా స్పష్టమైన హామీ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. చేయని నేరానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు శిక్షకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, విభజన హామీలు, హోదాపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చామని చెబుతున్న నిధులకు, రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు పొంతన లేకుండా పోయిందన్నారు.

జేఎఫ్‌సీతో నిధులపై స్పష్టత : రామకృష్ణ

విభజన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ముందుకు వెళుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ విమర్శించారు. విభజన హామీలతో పాటు పార్లమెంటులో ప్రధాని చేసిన ప్రకటనలను అమలు చేయడం లేదన్నారు. జేఎఫ్‌సీ చేపట్టిన చర్చలు ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడతాయన్నారు. నిధుల విడుదల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అబద్ధాలు చెబుతున్నాయని, జేఎఫ్‌సీ ద్వారా స్పష్టత వస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

ఉత్త చేతులతో..

- ముగిసిన ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన
- గవర్నర్ నరసింహన్‌తో భేటీ
- ప్రధాని అపాయిమెంట్‌పై అనుమానాలు
- నేడు సీఎం కేసీఆర్ 65వ పుట్టినరోజు



నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీ పర్యటన ముగిసింది. ఈ నెల తొమ్మిదిన ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి, కేంద్రం నుండి ఎలాంటి హామీ పొందకుండానే శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు. వెంటనే రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ నరసింహన్‌తో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. కేంద్ర ఆర్థిక మంత్రితో జరిగిన భేటీ విశేషాలను వివరించారు. శనివారం కేసీఆర్ 65వ పుట్టినరోజు జరుపుకోబోతున్నారు.

అయితే ఇన్నిరోజులు ఢిల్లీ పర్యటనలో ఏమి చేశారన్న చర్చ మాత్రం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగినప్పుడు గానీ, విభజన హామీలను కేంద్రం పట్టించుకోనప్పుడు గానీ సీఎం కేసీఆర్ ఇప్పటివరకూ స్పందించలేదు. ఢిల్లీ వెళ్లిన సందర్భంలోనైనా కేంద్రమంత్రులను కలిసి తమ నిరసనను తెలియజేయకపోవడం గమనార్హం. ఎన్‌డిఎలో టీడీపీ భాగస్వామ్యంగా ఉన్నా విభజన హామీలపైనా ఆ రాష్ట్ర ఎంపీలు పార్లమెంటులో ప్రస్తావించారు. కానీ ప్రభుత్వంలో భాగస్వామ్యంగా లేని టీఆర్ఎస్‌పార్టీ ఎంపీలు మాట్లాడకుండా మౌనంగా ఉండిపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఏపీ సీఎం బాబు మాట్లాడుతున్నా, ఆస్థాయిలో కూడా కేంద్ర బడ్జెట్ గురించి తెలంగాణ సీఎం స్పందించకపోవడం ఏమిటన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారం రోజులు పాటు ఢిల్లీ ఉండి కూడా సీఎం కేసీఆర్ మాట్లాడకపోవడం దారుణమని విపక్షాలు మండిపడుతున్నాయి. బీజేపీతో టీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం చేసుకుందని చెప్పడానికి ఇదొక ఉదాహరణగా విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఎంపీలను నిలదీయండని చెప్పి, తాను మాట్లాడకపోవడంలో ఉద్దేశమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎయిమ్స్‌పై వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన రాష్ట్ర మంత్రి లక్ష్మారెడ్డికి అవమానం జరిగినా ఆ విషయాన్ని కేంద్ర ఆర్థికమంత్రి దృష్టికి తీసుకెళ్లలేదంటే, ఆయన ఎంతగా భయపడుతున్నారో అర్థమవుతుందని ఒక రాజకీయ పార్టీ నేత తెలిపారు. ఇటీవల తనపైనా, తన కుటుంబంపై వచ్చిన అవినీతిని బయటకు రాకుండా ఉండేందుకే ప్రధానమంత్రి నరేంద్రమోడీపై మాట్లాడేందుకు కూడా భయపడుతున్నారన్న ప్రచారం జరుగుతున్నది. మైనార్టీలకు, ఎస్సీలకు రిజర్వేషన్ల పెంపుపైనా నిలదీస్తానని, జంతర్‌మంతర్‌లో దీక్ష చేస్తానని చెప్పిన సీఎం ఇప్పుడు ఆ ఊసే లేదు. దీంతో అనుమానాలు మరింతగా పెరిగాయి. ఎస్సీ వర్గీకరణపై అఖిలపక్షాన్ని ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్తానని చెప్పి ఆ తర్వాత దాని గురించే నోరుఎత్తిన పాపానపోలేదు. ఢిల్లీ పర్యటనలో ప్రధానమంత్రి అపాయిమెంట్ అడిగారని ప్రచారం జరిగినా అందులోనూ వాస్తవం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కేంద్రానికి పూర్తిస్థాయి మద్దతుదారునిగా ఉంటానని ఒకరిద్దరు ఎంపీలను తన దూతగా కేంద్రం వద్దకు పంపినట్టు తెలిసింది. ఇందులో ఒక రాష్ట్ర గవర్నర్ కూడా మధ్యవర్తిత్వం నడిపినట్టు కూడా ప్రచారం జరుగుతున్నది.

సంతోష్‌కు రాజ్యసభకు పంపాలని మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతు

టీఆర్ఎస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్‌ను రాజ్యసభ పంపాలని ఆ పార్టీకి చెందని మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతు ఇచ్చినట్టు తెలిసింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. సంతోష్‌కు మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌ల మద్దతు కూడా లభించినట్టు తెలుస్తోంది. మార్చిలో రాష్ట్రానికి సంబంధించి రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్న విషయం తెలిసిందే. పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి చనిపోవడంతో ఆ స్థానం కూడా ఖాళీగా ఉంది. దీంతో ఆ మూడు స్థానాలు టీఆర్ఎస్‌కే దక్కనున్నాయి. అందులో ఒకటి బీసీ, మరొకటి మైనార్టీకి ఇస్తారని అంటున్నారు. మిగిలిన స్థానాన్ని సంతోష్‌కు ఇచ్చే అవకాశం ఉందని టీఆర్ఎస్‌వర్గాలు తెలిపాయి.

టీఆర్టీ నిలుపుదలకు హైకోర్టు నిరాకరణ

నవతెలంగాణ-హైదరాబాద్

ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)ను నిలిపివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. అయితే ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పరీక్షలు నిర్వహించిన తర్వాత ఎస్.జి.టి. పోస్టుల ఫలితాలను బహిర్గతం చేయరాదని తెలంగాణ విద్యాశాఖ,జీఏడీల ముఖ్యకార్యదర్శులతోపాటు టీఎస్‌పీఎస్సీలను హైకోర్టు న్యాయమూర్తి ఎమ్మెస్ రామచంద్రరావు ఆదేశించారు. 2012లో జరిపిన డీఎస్సీ పరీక్షల్లో వరంగల్,ఖమ్మం జిల్లాల్లో దివ్యాంగులకు కేటాయించిన ఎస్జీటీ పోస్టులు 9, 5 చొప్పున 2012లో భర్తీ కాలేదని, వీటిని కూడా కలిపి టీఆర్టీ నిర్వహించాలని, అప్పటి వరకూ టీఆర్టీ నిర్వహణను ఆపేయాలని ఆ జిల్లాలకు చెందిన మల్లికార్జున్, మురళి వేరువేరుగా హైకోర్టుల్లో రిట్లు దాఖలు చేశారు. వీటిని శుక్రవారం హైకోర్టు విచారించి ఆ రెండు జిల్లాల్లో పరీక్షలు నిర్వహించాక ఎస్.జి.టి. ఫలితాల్ని వెల్లడించరాదని మధ్యంతర ఆదేశాలిచ్చింది. విచారణ రెండు వారాలకు వాయిదా పడింది.

వేతనమే బాగుండలేదు

విద్యుత్ ప్రమాదంలో చేయి కోల్పోయిన కార్మికుడికి మానవీయకోణంలో ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వడం బాగానే ఉందని, అయితే ఆ కార్మికుడికి నెలకు రూ.5 వేలు మాత్రమే వేతనం నిర్ణయించడమే ఆమోదయోగ్యంగా లేదని హైకోర్టు ఆక్షేపణ తెలిపింది. కాంట్రాక్టర్ దగ్గర పనిచేసే వెంకటేశ్వర్లు 2011లో విద్యుత్ ప్రమాదంలో కుడి చేయి పోయింది. నాగర్‌కర్నూల్ జిల్లా రాచూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు ప్రభుత్వం నెలకు రూ.5 వేల జీతంతో ఉద్యోగం ఇచ్చింది. కనీస వేతన చట్టం కింద జీతం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బెంచ్ ఎస్పీడీసీఎల్ సీఎండీని ఆదేశించింది.

తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి 547 కోట్లు మంజూరు : మంత్రి తుమ్మల

నవతెలంగాణబ్యూరో - హైదరాబాద్

తీవ్ర వాద ప్రభావిత ప్రాంతాల అభివద్ధి పథకంలో భాగంగా రాష్ట్రానికి రూ. 547 కోట్ల మంజూరు అయ్యాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 6 న ఢిల్లీ పర్యటనలో కేంద్రమంత్రులను అభ్యర్థించడంతో ఈ నిధులను మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు. శుక్రవారం జరిగిన సమీక్షలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ మొత్తం 452 కి.మీ నిడివిగల రహదారులను కేంద్ర మంజూరు చేసిందని, ఈ సందర్భంగా ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో రహదారులను విస్తరించనున్నట్టు తెలిపారు. ఆయన కేంద్రానికి, రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా నిర్మాణ రంగంలో అన్ని స్థాయిల్లో పనిచేసే కార్మికులకు నిపుణులకు ఇంజనీర్లకు ప్రపంచ స్థాయిలో నైపుణ్యాలను అందించేందుకు ముందుకు వచ్చిన నేషనల్ ఓపెన్ కాలేజీతో ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్లతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల మాట్లాడుతూ కేంద్రం ఇటీవల ప్రకటించిన షుమారు రూ:8000 కోట్ల విలువైన జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ముఖ్య కార్యదర్శి సునిల్ శర్మ రవీందర్ రావు, గణపతిరెడ్డి, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సర్వీసులకు ఆనంద్

తెలంగాణ పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా పని చేస్తున్న 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ కేంద్ర సర్వీసులోకి వెళ్లారు. ఆయన సీఐఎస్ఎఫ్ ఐజీగా అయిదేండ్లపాటు పని చేయనున్నారు. ప్రస్తుతం సీవీ ఆనంద్ పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

కాళేశ్వరం కేసు కొట్టేయండి

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టుకు పర్యావరణ, అటవీ తదితర అన్ని అనుమతులూ వచ్చిన నేపథ్యంలో కేసు కొట్టివేయాలని జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ)కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించింది. కాగా కొన్ని అనుమతులపై తమకు అభ్యంతరాలున్నా యని పిటిషనర్ తరపు న్యాయవాది తెలియజేయడంతో కేసు విచారణను ఎన్జీటీ మార్చి 21వ తేదీకి వాయిదా వేసింది. చట్టబద్ధ అనుమతులు లేకుండానే కాళేశ్వరం ప్రాజెక్టుకు నిర్మిస్తున్నారంటూ పిటిషనర్ హయతుద్దీన్ దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం విచారణకు వచ్చింది. జస్టిస్ ఎస్ రఘువేంద్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. తెలంగాణ తరపున అడ్వకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి వాదిస్తూ... కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు వచ్చాయని ఎన్జీటీకి వివరించారు. ఈ నేపథ్యంలో కేసు ఎత్తివేయాలని కోరారు. అయితే కొన్ని అనుమతుల విషయంలో తమకు అభ్యంతరాలున్నాయని పిటిషనర్ తరపు జూనియర్ న్యాయవాది కోర్టుకు తెలిపారు. తమ సీనియర్ న్యాయవాది అందుబాటులో లేనందున కొంత సమయం ఇవ్వాలని కోరారు. దీంతో కేసు విచారణను మార్చి 21కి వాయిదా వేసింది. కాగా చట్టబద్ధ అనుమతులు వెలువడే వరకు ప్రాజెక్టు పనులను నిలుపుదల చేయాలని గతంలో ఎన్జీటీ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. పర్యావరణ, అటవీ అనుమతులు వస్తే ఎన్జీటీని ఆశ్రయించి ఉత్తర్వులు నిలుపుదల చేసుకోవచ్చని తెలంగాణకు గతంలో ఎన్జీటీ తెలియజేసింది.

కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు : మంత్రి లక్ష్మారెడ్డి

రోడ్ల మీద ఉన్న చిన్న షాపుల్లో మంత్రి తనిఖీలు

హైదరాబాద్ : మేం మిమ్మల్నేమీ చేయం... మీరు వాడుతున్న ఆహార పదార్థాలు నాణ్యమైనవేనా? కల్తీ చేస్తున్నారా? చెప్పండి చాలు... ఇంతకీ ఈ నూనె ఏం నూనె... ఏ కంపెనీది? ఎన్ని సార్లు ఇలా వేడి చేస్తారు? ఈ నూనెతో ఏమేం వండుతున్నారు? మీ ఇంటిని ఇలాగే ఉంచుకుంటారా? హోటల్‌ని ఇంత అధ్వాన్నంగా ఎందుకు నిర్వహిస్తున్నారు? అని వైఎంసిఏ చౌరస్తాలో నిర్వహిస్తున్న ఒక చిన్న హోటల్ యజమానిని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం పలు హోటళ్లను, టీ కొట్టు, ఐస్‌క్రీమ్ బండ్లను తనిఖీలు చేస్తూ ప్రశ్నల వర్షం కురిపించారు.

డయాగ్నోస్టిక్స్ కేంద్రాల పనులు వేగవంతం

ప్రజలకు అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించే పథకం ప్రారంభానికి అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని వైద్యశాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటింటికీ వైద్య పరీక్షలు అందే విధంగా అవసరమైన కార్యాచరణ చేపట్టాలన్నారు.

ఢిల్లీలో మీ గాండ్రింపులేవీ? : షబ్బీర్ అలీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్ర శేఖరరావు తెలంగాణలో ఉన్నప్పుడు కేంద్రంపై గాండ్రింపులు చేస్తూ....ఢిల్లీకి వెళ్లి పిల్లికూనలాగా మారిపోతున్నారని శాసనమండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్‌అలీ విమర్శించారు. నరేం ద్రమోడీకి ఎందుకు భయపడు తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి రూ 40వేల కోట్లు కావాలని చెప్పి ఢిల్లీకి వెళ్లాక రూ 450 కోట్లకే వినతిపత్రం సమర్పించడం వెనక అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇక్కడ ప్రగల్భాలు పలికి అక్కడి కెళ్లి ఎందుకు ఈ విధంగా వ్యవహరించారని నిలదీశారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలోని మీడియా కమిటీ హాల్‌లో ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నా...కేసీఆర్ తనపై ఉన్న కేసుల వల్లే మోడీకి భయపడుతున్నారని ఆరోపించారు. కర్నాటక రాష్ట్రం ప్రతి నియోజకవర్గంలో 40 కందుల కొనుగోలు కేంద్రాలను తెరిచి కేంద్రం నిర్ణయించిన మద్దతు ధరకు మరో రూ 400లను కలిపి కొనుగోలు చేస్తోందన్నారు. మన రాష్ట్రంలో ఒక నియోజక వర్గానికి నాలుగు కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ప్రతి నియోజక వర్గానికి 20 నుండి 25 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కందులు, ఎర్ర జొన్నలు కొనడానికి కావాల్సిన కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రం మద్దతు ధర ఇచ్చినా ఇవ్వకపోయిన రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ల ఫైల్ ఎక్కడ ఉందో కేసీఆర్ తెలుసుకుని దాన్ని క్లియర్ చేయించుకుని రాష్ట్రానికి రావాలని కోరారు. ఏపీ ఎంపీలు విభజన బిల్లులో పేర్కొన్న అంశాల కోసం పోరాడుతుంటే టీఆర్ఎస్ ఎంపీ దద్దమ్మలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. అనంతరం పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో మొత్తం 8 వేల ఎకరాలలో 20 వేల క్వింటాళ్ల కందులను పండించగా ఇప్పటివరకు కేవలం 2 వేల క్వింటాళ్లను మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. మిగిలిన కందులను కూడా సత్వరం కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు.

విద్యుద్ఘాతంతో కార్మికుడు మృతి

- రంగారెడ్డి జిల్లాలో ఘటన

నవతెలంగాణ - షాద్‌నగర్ రూరల్

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతం సంభవించి కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మధు(32) విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు.

శుక్రవారం స్థానికంగా ఓ వెంచర్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

రెండు తలల పాముకు శక్తులు అవాస్తవం

- ఉండేది ఒకటే తల
- అటవీ శాఖ అధికారుల స్పష్టీకరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రెండు తలల పాముకు ఎలాంటి శక్తులూ ఉండవని, దాని పేరిట మోసపూరిత ప్రచారం జరుగుతున్నది. ఈ సంగతిని అటవీ అధికారులే స్పష్టంగా చెబుతున్నారు. వాస్తవానికి రెండు తలల పాముకు ఉండేది ఒకటే తల అనీ, దాని తోక కూడా తలను పోలి ఉండటంతో రెండు తలల పాముగా భావిస్తున్నారని అభిప్రాయపడుతున్నారు. రెండు తలల పాముతో గుప్త నిధులు సాధించవచ్చంటూ జరుగుతున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మరాదని అంటున్నారు. గత నెల రోజుల్లో హైదరాబాద్ నగర శివార్లల్లోని నాలుగు చోట్ల నుంచి ఈ రెండు తలల పామును అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని రక్షిత అటవీ ప్రాంతాల్లో విడిచిపెట్టారు. చౌటుప్పల్ సమీపంలోని మల్కాపూర్, బేగంపేట రైల్వే స్టేషన్, ఎయిర్‌ఫోర్స్ కాలనీతో పాటు మేడ్చల్‌లో కూడా రెండు తలల పాములను ఆయా సమయాల్లో అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. కొన్ని చోట్ల గుప్త నిధుల కోసం ప్రయత్నించేవారు, అమ్మజూపే ప్రయత్నాలు సైతం చేశారు. ఈమేరకు పోలీసుల ద్వారా అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. కొందరికి గుప్త నిధుల మీద ఉండే బలహీనతను ఆసరా చేసుకుని ఈ పాముల వేట కొనసాగిస్తున్నారని, వాస్తవానికి విషపూరితం కాని ఈ పామును ' రెడ్ సాండ్ బో' గా పిలుస్తారని అటవీ అధికారులు తెలిపారు. తల, తోక రెండు ఒకే విధంగా పోలి ఉంటుందే తప్ప రెండు తలలు ఉండవని వణ్యప్రాణి నిపుణులు, అటవీ శాఖ ప్రత్యేకాధికారి ఎ.శంకరన్ స్పష్టం చేశారు. ఇక ముందు రెండు తలల పాము, వాటి అమ్మకం, అతీంద్రీయ శక్తులు అని ఎవరైనా ప్రచారం చేస్తే వెంటనే తమ దష్టికి తీసుకురావాలని, అటవీ శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 364 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం సెక్షన్ 51 కింద అలాంటి తప్పుడు పనులు, లేదా నేరాలకు పాల్పడితే మూడేండ్ల దాకా జైలు శిక్ష పడే అవకాశముందన్నారు. ఈ పాములను అక్రమంగా కలిగి ఉండటం, రవాణా చేయడం, స్మగ్లింగ్ చేయటం లాంటివి నేరమని అటవీ శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. వీటిని రవాణా చేసేవారు, ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టి డబుల్ ఇంజన్ అనే కోడ్ ను కూడా వాడుతున్నట్టు తమ ద ష్టికి వచ్చిందని తెలియజేశారు. అలాగే వీటి బరువు ఆధారంగా కూడా వాటి శక్తిపై మోసగాళ్లు నమ్మబలుకుతారని, మూడున్నర కేజీలు ఆపై బరువు ఉండే పాములు మరింత లబ్దిచేస్తాయని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని సమాచారం. రెండు తలల పాము, దాని శక్తుల పేరుతో జరిగే ప్రచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

నకిలీ ముఠా గుట్టు రట్టు

- 'ఇందిరమ్మ' ఇండ్లు ఇప్పిస్తామని డబ్బు వసూలు
- నకిలీ దస్తావేజులు, గుర్తింపు కార్డుల తయారు చేసి మోసం
- సుమారు రూ.30 లక్షలు వసూలు
- ముగ్గురు రిమాండ్, పరారీలో 8 మంది
- రూ.1.80 లక్షల నగదు, బైకులు, కంప్యూటర్ పరికరాలు స్వాధీనం



నిందితులను మీడియా ముందు హాజరు పరిచిన పోలీసులు

నవతెలంగాణ-శంషాబాద్

నకిలీ ఇండ్ల దస్తావేజులు, గుర్తింపు కార్డులు తయారు చేసి ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని చెప్పి అమాయకుల వద్ద నుంచి భారీగా డబ్బులు వసూలు చేసిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.లక్షా 80 వేల నగదు, రెండు ఇండ్ల పట్టా సర్టిఫికెట్లు, రెండు బైక్‌లు, మార్టిగేజ్ రిసిప్ట్, సీపీయూ, మానిటర్, కీబోర్డు, ప్రింటర్ స్వాధీనం చేసుకున్నారు.

దీనికి సంబం ధించిన వివరాలను సీఐ మహేష్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు.

శంషాబాద్‌లోని సిద్ధాంతి గ్రామానికి చెందిన సున్నంరాజు, కృష్ణా జిల్లా నందిగామకు చెందిన మణికంఠ, ఆర్ఎంపీ డాక్టర్‌గా పని చేస్తున్న అన్నవరపు విజయ్‌సాగర్, శంషాబాద్‌లోని నక్షత్ర కాలనీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న తిప్రమోని రాజు, సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్న పిట్టల సుధాకర్, సున్నం రాజ్యలక్ష్మి, బుడ్డం రమాదేవి, నరేందర్‌రెడ్డి, గఫార్, సంపత్‌రెడ్డి, ఖాదర్‌లు ముఠాగా ఏర్పడ్డారు. కొంతకాలం ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసిన సున్నం రాజు తర్వాత సిద్ధాంతి గ్రామంలోని సిమెంట్ స్టోరేజీలో పనిచేశాడు. హౌజింగ్ ఏఈ వీరిని పిలిచి శంషాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు, ఇతర కాగితాలను వేరు చేయాలని ఆదేశించారు. ఈ సమయంలో ఇందిరమ్మ ఇండ్లకు చెందిన దస్తావేజులను వారు కొట్టేశారు. వీటిని అనుమానం రాకుండా సిమెంట్ గోడౌన్‌లో దాచారు. పట్టా సర్టిఫికెట్లలో ఉన్న వారిని గుర్తించి వారి నుంచి డబ్బులు వసూలు చేద్దామని యత్నించారు. కానీ వారి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో నకిలీ డాక్యుమెంట్లు తయారు చేశారు. రాళ్లగూడ తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.79,500 చొప్పున సుమారు రూ.30 లక్షలు వసూలు చేశారు. ఈ వ్యవహారాన్ని తెలుసుకున్న పోలీసులు ముఠా గుట్టును రట్టు చేశారు. ప్రధాన నిందితుడు సున్నం రాజుపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మిగతావారు పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి రూ.లక్షా 80 వేల నగదు, రెండు ఇండ్ల పట్టా సర్టిఫికెట్లు, రెండు బైక్‌లు, మార్వాడీ వద్ద తాకట్టు పెట్టిన మార్టిగేజ్‌డ్ రిసిప్ట్, సీపీయూ, మానిటర్, కీబోర్డు, ప్రింటర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో ఎస్సైలు శివకుమార్, పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▼287 34,010	నిఫ్టీ ▼93 10,452	డాలరుకు రూపాయి విలువ 64.21	బంగారం(10.గ్రా) రూ. 31,315	వెండి (కేజీ) రూ. 40,600	కోడిగుడ్లు






కోడిగుడ్లు			
హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



మన బ్యాంకులు భద్రమేనా!

- కొండలా పేరుకుపోతున్న ఎన్‌పీఏలు
- వెలుగులోకి భారీ మోసాలు
- అంతకంతకు పెరుగుతోన్న ఎగవేత
- ఉద్దేశపూర్వక ఎగవేత కేసులు 8670
- 'రుణ మోసం' విలువ లక్ష కోట్ల పైమాటే!
- బ్యాంకుల మనుగడపై అనుమానాలు
- ఖాతాదారులకు 'నో క్యాష్' బోర్డులు
- సామాన్యుల్లో పెరుగుతోన్న ఆందోళన..


నవతెలంగాణ, వాణిజ్య విభాగం: దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తూ వస్తున్న బ్యాంకింగ్ రంగంపై క్రమంగా నీలి మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఒకప్పుడు సగటు భారతీయుడు తమ ఆర్థిక భద్రతకు బ్యాంకులు నిలువెత్తు నమ్మకమని భావించేవారు. బ్యాంకులో సొమ్ముంటే తమ ఇంట్లో ఉన్నదానికంటే కూడా భద్రమనే భావన ప్రజల్లో కనిపించేది. అక్కడ సొమ్ములుంటే తమ చేతులో డబ్బులున్నట్టే అన్నంత దీమాతో ప్రజలు ఉండేవారు. కానీ గత కొన్ని సంవత్సరాలుగా దేశీయ బ్యాంకింగ్ ముఖచిత్రం మారుతూ వస్తోంది. ఇటీవలి కాలంలో జరగుతున్న వరుస సంఘటనల నేపథ్యంలో దేశంలో బ్యాంకులపై నమ్మకం క్రమంగా సన్నగిల్లుతూ వస్తోంది. ఒకవైపు కొండలా పెరిగిపోతున్న నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ), మొండి బాకీలకు తోడు ఇప్పుడు తాజాగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) స్కామ్ రూపంలో వెలుగులోకి వస్తున్న బడా మోసాలతో ప్రజలకు బ్యాంకులపై నమ్మకం సన్నగిల్లుతోంది. దీనికి తోడు పెద్దనోట్ల రద్దు నాటి నుంచి బ్యాంకులు వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో మరింత అసహనాన్ని నింపుతోంది. పెద్దనోట్ల రద్దు జరిగి దాదాపు 15 నెలలు కావస్తున్నా బ్యాంకు అధికారులు ఖాతాదారులు అడిగినంత డబ్బులు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. శాఖలో నగదు లేదని.. రోజువారి పరిమితి ఇంతేనంటూ.. ఖాతాదారులు బ్యాంకుల్లో దాచుకున్న తమ సొంత సొమ్మును తిరిగి విత్‌డ్రా చేసుకొనేందుకే నానా రూల్స్‌తో హింసిస్తున్నారు. దీంతో బ్యాంకులంటే ప్రజలు భయపడే పరిస్థితి కనిపిస్తోంది. మన దేశ బ్యాంకింగ్ రంగంలో అంతర్గతంగా ఏదో జరుగుతోంది. ఈ నేపథ్యంలో వాస్తవం ఎప్పుడో భయటకు వచ్చి ఆర్థిక వ్యవస్థకే పెను ముప్పు వాటిల్లుతుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2008లో అమెరికాలోని కొన్ని బ్యాంకులు విఫలమవ్వడం మూలంగా అక్కడి ఆర్థిక వ్యవస్థ కేదేలైంది.. మాంద్యం పరిస్థితులు ఎదురయ్యాయి. ఇదే పరిస్థితి మన దేశంలోనూ పునరావృతం అవుతుందేమోనన్న అనుమానం సగటు భారతీయుడిలో కనిపిస్తోంది.



పీఎన్‌బీ మోసం మచ్చుక మాత్రమే..

పీఎన్‌బీలో వెలుగు చూసిన ఘరానా మోసం మాదిరిగానే రానున్న రోజుల్లో దేశీయ బ్యాంకింగ్ రంగంలో పలు బడా మోసాలు వెలుగు చూడొచ్చని బ్యాంకింగ్ రంగ విశ్లేషకులు చెబుతున్నారు. గడిచిన అయిదు సంవత్సరాల కాలంలో (గత మార్చి ముగింపు నాటికి) దేశంలో రుణ మోసాలకు పాల్పడిన కేసుల సంఖ్య దాదాపు 8,670 వరకు ఉంటుందని పెద్ద బ్యాంక్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. ఈ ఎగవేతల మొత్తం దాదాపుగా రూ.61,260 కోట్ల (9.58 బిలియన్ డాలర్ల) వరకు ఉండొచ్చని పేర్కొంది. ఇప్పటికే దాదాపు బ్యాంకుల మొండి బాకీలు 149 బిలియన్ డాలర్లకు చేరిన నేపథ్యంలో.. కొత్త మోసాలు బ్యాంకింగ్ రంగానికి సరికొత్త సవాళ్లను విసురుతున్నాయి. 2012-13లో రూ.6,357 కోట్లుగా ఉన్న రుణ మోసాలు గత ఏడాదిలో మార్చి నాటికి దాదాపుగా రూ.17,634 కోట్లకు చేరుకున్నాయి. అయితే ఇందులో పీఎన్‌బీ పేరే లేకపోవడం విశేషం. రాయిటర్స్ సంస్థ ఈ విషయమై ఆర్‌బీఐకి పెట్టుకున్న సమాచార హక్కు చట్టం అర్జీకిగాను ఆర్‌బీఐ స్పందిస్తూ పై వివరాలను అందించింది. అయితే మొత్తం 20 ప్రభుత్వ రంగ బ్యాంకులకు రాయిటర్స్ అర్జీ పెట్టుకోగా కేవలం 15 బ్యాంకులు మాత్రమే రుణ మోసాల గణాంకాలను వెల్లడించాయి. రుణ ఎగవేతలు ఎక్కువగ ఉన్న బ్యాంకుల జాబితాలో పీఎన్‌బీ దాదాపు రూ.6,562 కోట్ల విలువైన 389 కేసులతో ఈ జాబితాలో ముందు నిలవగా.. ఆ తరువాత స్థానంలో బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.4,473 కోట్ల విలువైన 389 కేసులతో రెండో స్థానంలోనూ.. రూ.4050 కోట్ల విలువైన 231 రుణ మోసాల కేసులతో బ్యాంక్ ఆఫ్ ఇండియా మూడో స్థానంలో ఉన్నట్టు రాయిటర్స్ తెలిపింది. దేశంలో అతిపెద్ద విత్త సంస్థ ఎస్‌బీఐలో ఇలాంటి కేసులు 1,069 వరుకు నమోదు అయ్యాయి. అయితే ఈ కేసుల ద్వారా బ్యాంకులకు జరిగిన నష్టం విలువ దాదాపు రూ.లక్ష కోట్లు అంతకు పైగానే ఉండే అవకాశం ఉందని బ్యాంకింగ్ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

గీతాంజలి మోసం రూ.4886 కోట్లు!



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఘరానా మోసం విషయంలో కొత్తకోణం వెలుగులోకి వచ్చింది. వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీతో పాటు ఆయన దర్శకత్వంలో బ్యాంకును ముంచడంలో గీతాంజలి గ్రూపు అధినేత మేహుల్ చోక్సీ కూడా కీలకంగా వ్యవహరించినట్టుగా విచారణ ఏజెన్సీల సోదాల్లో తేలింది. ఈ వ్యవహారంలో గీతాంజలి గ్రూపు రూ.4,886 కోట్ల మేరకు మోసానికి పాల్పడిందని సీబీఐ వెల్లడించింది. ఈ మూడు కంపెనీలకు 36 అనుబంధ సంస్థలున్నాయని..వీటిల్లో 17 సంస్థలు ముంబైలోను, ఒకటి హైదరాబాద్‌లోను ఉండగా, మిగిలినవి విదేశాల్లో ఉన్నట్టుగా సీబీఐ శుక్రవారం నాటి విచారణలో తేలింది. ఈ సోదాల్లో లభించిన సమాచారం మేరకు సీబీఐ గీతాంజలి గ్రూపుపై రెండో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసింది. సీబీఐ అధికారులు వెల్లడించిన సమాచారం మేరకు గీతాంజలి జెమ్స్, గిలి ఇండియా, నక్షత్ర కంపెనీలను ఈ ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ముంబై, పుణే, సూరత్, హైదరాబాద్, కోయంబత్తూర్ తదితర 26 ప్రదేశాల్లో మరోమారు సోదాలు నిర్వహించింది. గీతాంజలి గ్రూపునకు చెందిన ఆస్తులు, ఇతర నిందిత కంపెనీ డైరెక్టర్ల నివాసాలతో పాటు ప్లాంట్లు, ఫ్యాక్టరీలు, కార్యాలయాల్లో ఈ దాడులు జరిగినట్టు సీబీఐ తెలిపింది.

మార్కెట్ నష్టం రూ.15,000 కోట్లు



న్యూఢిల్లీ: పీఎన్‌బీలో వెలుగు చూసిన స్కామ్ స్టాక్ మార్కెట్లలో మదుపరులకు కనీళ్లు పెట్టిస్తోంది. వజ్రాల వ్యాపారి మోడీ పీఎన్‌బీకి చేసిన మోసం విలువ రూ.11,400 కోట్లయితే.. ఈ స్కామ్ ప్రకంపనలకు స్టాక్ మార్కెట్లలో మదుపరులు నష్టపోయిన మొత్తం రూ.15,000 కోట్లకు చేరుకుంది. సోమవారం నుంచి పీఎన్‌బీ కేసు దాదాపు రూ.9,047 కోట్లు.. గీతాంజలి జెమ్స్ స్టాక్ రూ.300 కోట్ల మేర నష్టపోగా.. ఇతర బ్యాంక్ స్టాక్‌లు దాదాపు రూ.5,500 కోట్ల మేర నష్టపోయాయి. పీఎన్‌బీ నుంచి స్వీకరించిన లెటర్ ఆఫ్ అండర్‌స్టాడింగ్‌ను చూపుతూ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ దాదాపు 17 బ్యాంకుల నుంచి దాదాపు 3000 కోట్ల మేర నిధులను సమీకరించినట్టుగా వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ రంగంలో అలహాబాద్ బ్యాంక్, ఐడీబీఐ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేనా బ్యాంక్, విజయా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సిండికేట్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ తదితరాలు కుదేలయ్యాయి.

ఆరు నెలల్లో పరిస్థితి అదుపులోకి..

పీఎన్‌బీ భారీ మోసం వెలుగు చూడటంలో మార్కెట్ రెగ్యులేటరీ 'సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డ్ ఆఫ్ ఇండియా' సెబీ విచారణ ప్రారంభించింది. సెబీ, స్టాక్ ఎక్స్ఛేంజీలు ఇప్పటికే చోక్సీ తో సహా నీరవ్ మోదీకి అన్ని సంస్థల స్టాక్ మార్కెట్ ట్రేడింగ్, తదితర అంశాల విశ్లేషణ మొదలు పెట్టింది. సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని రెగ్యులేటరీ అధికారి తెలిపారు. ఇది ఇలా ఉంటే భారీ స్కాం వెలుగులోకి రావడంతో పంజాబ్ నేషనల్ బ్యాంకు శుక్రవారం సాయంత్రం ఇన్వెస్టర్లతో సమావేశం నిర్వహించింది. ఆరునెలల్లో పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తీసుకొస్తామని హామి ఇచ్చింది.


వారంలోపు హాజరవ్వండి..!

మోడీకి సమన్లు జారీ చేసిన ఈడీ

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకులో (పీఎన్‌బీ) భారీ కుంభకోణానికి పాల్పడిన డైమాండ్ కింగ్ నీరవ్ మోడీ ప్రస్తుతం న్యూయార్క్‌లో తల దాచుకున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ వార్తల పట్ల తమకు స్పష్టత లేదని విదేశాంగ శాఖ ప్రకటించింది. నీరవ్ మోడీ తమ అధికారులు ఎవరితోనూ సన్నిహితంగా లేడని, ఈ దశలో ఆయన ఎక్కడ ఉన్నది చెప్పలేమని విదేశాంగ శాఖ ప్రతినిధి రవీష్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం అతని పాస్‌పోర్ట్ నిలిపివేసినందున మోడీ ఇక వేరే ఏ దేశానికి వెళ్లలేడని ఆయన పేర్కొన్నారు. నీరవ్ మోదీ కేసు మాల్యా మాదిరిగానే లోన్ డిఫాల్ట్ కేసు కాదని, నీరవ్ మోదీ వేల కోట్ల రూపాయల మేర బ్యాంకులను బురిడీ కొట్టించాడని, మోస పూరితంగా వ్యవహరించాడని ఇది తీవ్రమైన అంశంగా పరిగణించాల్సి ఉంటుందని రవీష్ అభిప్రాయపడ్డారు. మోడీకి బెల్జియం పాస్‌పోర్ట్ ఉంటే.. పీఎన్‌బీకి భారీ ఎత్తున నష్టం కలిగించి దేశం విడిచిన డైమండ్ వ్యాపారిని దేశానికి రప్పించడం అంత సులువు కాదని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు ప్రస్తుతం సీబీఐ, ఈడీ ముమ్మరంగా దర్యాప్తు సాగిస్తున్నాయి. సీబీఐ ఇంటర్‌పోల్‌ను సంప్రదించగా.. ఈడీ, నీరవ్ మోదీకి సమన్లను జారీచేసింది. నీరవ్‌మోదీతో పాటు మేహల్ చౌక్సికి సమన్లు జారీచేస్తున్నట్టు ఈడీ పేర్కొంది. ప్రివెంక్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద వీరికి సమన్లు జారీచేసినట్టు తెలిపింది. అంతేకాక వారంలోపల వీరిని తమముందు హాజరవ్వాలని ఆదేశించింది.

మరో ఎనిమిది మందిపైనా వేటు..

పీఎన్‌బీ స్కాంలో తాజాగా మరో ఎనిమిదిమంది అధికారులపై వేటు పడింది. అనుమానిత లావాదేవీలు జరిపారన్న ఆరపణలతో ఒక జనరల్ మెనేజర్ సహా ఎనిమిదిమందిని సస్పెండ్ చేసినట్టు ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. దీంతో ఈ మెగా స్కాంలో మొత్తం సస్పెండ్ అయిన పీఎన్‌బీ అధికారులు సంఖ్య 18కి చేరింది. ఆర్‌బీఐ ఆదేశాల ప్రకారం మార్చి 31 నాటికి ఇతర బ్యాంకుల పూర్తి బకాయిలను చెల్లించాల్సి ఉన్న నేపథ్యంలో అంతర్గత వనరుల ద్వారా ఈ నిధులను సమకూరుస్తామని ఆ అధికారి తెలిపారు.



ఖమ్మం స్టీల్‌ప్లాంట్‌పై ముసాయిదా

- సాధ్యాసాధ్యాలపై ఉక్కుశాఖకు నివేదిక అందజేత

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

తెలంగాణలోని ఖమ్మంతో పాటు ఏపీలోని వైఎస్ఆర్ జిల్లాలో స్టీల్‌ప్లాంట్ల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై మెకాన్ సంస్థ ముసాయిదా నివేదికను సిద్ధం చేసింది. కేంద్ర ఉక్కుశాఖకు ఆ ముసాయిదా నివేదికలను సమర్పించింది. స్టీల్ ప్లాంట్ల ఏర్పాటు సాధ్యపడే విధంగా ముసాయిదాలను సిద్ధం చేసినట్టు శుక్రవారం ఓ ప్రకటనలో కేంద్ర ఉక్కుశాఖ తెలిపింది. ఈ ముసాయిదాలపై కేంద్రం ఇరు రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించనుంది. ఏపీ విభజన చట్టంలోని 13వ షెడ్యూల్‌లో ఇరు రాష్ట్రాల్లో ఒక్కో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సిందిగా పొందుపరిచారు. గతంలో ఇందుకు సంబంధించి కేంద్రం ఓ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. అయితే ఖమ్మంలోని స్టీల్‌ప్లాంట్‌కు ఐరన్‌ఓర్ లభ్యతపై టాస్క్‌ఫోర్స్ కొన్ని సందేహాలు లేవనెత్తింది. అయితే స్టీల్‌ప్లాంట్ల ఏర్పాటుపై రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి చేశాయి. దీంతో గత సంవత్సరం నవంబర్ 23న అలాగే దానికి కొనసాగింపుగా డిసెంబర్ 27న కేంద్రమంత్రి బీరేందర్‌సింగ్ అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ సమావేశాలు జరిగాయి. స్టీల్‌ప్లాంట్ల ఏర్పాటు నివేదిక రూపకల్పనలో సంబంధిత రాష్ట్రాలు సమాచారం అందజేయాలని నిర్ణయించారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన సమాచారంతో మెకాన్ సంస్థ ప్రాజెక్టు నివేదికను సైతం రూపొందించనున్నట్టు కేంద్రం తన ప్రకటనలో పేర్కొంది.

బాలిక విద్యపై ప్రత్యేకదృష్టి

- రాష్ట్రపతికి కడియం వివరణ



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌తో ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి శుక్రవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపడుతున్న కార్యక్రమాలతో పాటు బాలికల విద్యకు చేపట్టిన చర్యలను కడియం వివరించారు. భేటీ అనంతరం కడియం మీడియాతో మాట్లాడారు. 'విద్యాశాఖ పరంగా చేపడుతన్న చర్యలను వివరించాం. రాష్ట్రం ఏర్పడిన తరువాత బాలికల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాం. దాదాపు 470 గురుకుల పాఠశాలలు నెలకొల్పాం. అలాగే 53 రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశాం. ఈ వివరాలన్నీ రాష్ట్రపతికి తెలియజేశాం' అని తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో బాలికల విద్యపై దృష్టిపెట్టాలని, ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని రాష్ట్రపతి సూచించారని కడియం చెప్పారు. మంత్రి వెంట ఎంపీ సీతారాం నాయక్ ఉన్నారు.

డాక్టర్ మహమ్మద్ ఇష్రాతుల్లాఖాన్ సస్పెన్షన్

తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్ మహమ్మద్ ఇష్రాతుల్లాఖాన్‌ను రెండేండ్లపాటు సస్పెండ్ చేస్తున్నట్టు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఛైర్మెన్ డాక్టర్ ఈ రవీంద్రరెడ్డి ప్రకటించారు. ఇష్రాతుల్లాఖాన్ రిజిస్ట్రేషన్ నెంబర్ 13872 అని, ఎంబీబీఎస్ చదివారని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఇష్రాతుల్లాఖాన్‌కు వైద్యరంగంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్హత లేదని పేర్కొన్నారు. అయినా తారిక్ ఖుస్రూ అనేక వ్యక్తికి ప్రాథమిక నిర్ధారణ లేకుండానే హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారని తెలిపారు. హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో స్పెషలిస్టు సలహాలు తీసుకోకుండానే చేశారని పేర్కొన్నారు. ఆపరేషన్ అనంతరం ఆ రోగి ప్రాణాలకే ముప్పు ఏర్పడిందని, ఓ కన్ను కోల్పోయారని తెలిపారు. కౌన్సిల్ మరో ముగ్గురు డాక్టర్లకూ హెచ్చరికలు జారీ చేసిందని పేర్కొన్నారు.

కొత్తవారికి ఇస్తే సిట్టింగులతో తలనొప్పి

వచ్చే ఎన్నికల్లో ఇప్పుడున్నవారితోనే ముందుకు

- అంతకంటే బెటర్ క్యాండెట్ ఉంటే మార్పు
- 2019 ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై అధికారపార్టీలో చర్చ
- సీఎం కేసీఆర్ వద్ద మూడో సర్వే ఫలితాలు
- త్వరలో జరిగే టీఆర్ఎస్ఎల్పీలో వెల్లడించే అవకాశం
- మార్చి మొదటివారంలో సమావేశం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రెండోసారి అధికారంలోకి వస్తామన్న ధీమాతో ఉన్న టీఆర్ఎస్‌పార్టీ నాయకత్వానికి పెద్ద సమస్య వచ్చి పడింది. అభ్యర్థులను ఎలా ఎంపిక చేయాలన్న దానిపై పునరాలోచనలో పడింది. ఈ విషయంలో టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ప్రజల్లో వ్యతిరేకత ఉందని చెప్పి సిట్టింగులను మార్చి కొత్తవారికి టికెట్లు ఇస్తే, వారంతా ఎదురుతిరిగే ప్రమాదం ఉందన్న అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. దీనివల్ల మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉందని గులాబీ నేతలు ఆందోళన చెందుతున్నారు. కొత్తగా చేరిన వారిని బుజ్జగించి, సిట్టింగులకే టికెట్లు ఇస్తే ఎలా ఉంటుందన్న చర్చా గులాబీ అధినేత చేస్తున్నారని సమాచారం. అదే సందర్భంలో సిట్టింగుల్లో బాగా వ్యతిరేకత ఉంటే, అటువంటి వారిని మార్చి ఆ నియోజకవర్గాల్లో అంతకంటే బెటర్ క్యాండెట్‌కు అవకాశం ఇస్తే ఎలా ఉంటుందని కూడా చర్చిస్తున్నారు. దీనిపైనా సర్వే చేయించాలని ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. టీఆర్ఎస్‌పార్టీ పట్ల, ప్రభుత్వ, ఎమ్మెల్యేల పనితీరుపై ఎప్పటికప్పుడు సీఎం కేసీఆర్ సర్వే చేయిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా తాజాగా చేయించిన తుది సర్వే ఫలితాలు సీఎం కేసీఆర్ వద్దకు చేరినట్టు టీఆర్ఎస్‌పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా సర్వేపై విశ్లేషణ చేస్తున్న క్రమంలో అనేక అంశాలు చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. దంత పరీక్ష కోసం ఢిల్లీలో ఉన్న సీఎం కేసీఆర్ దేశ, రాష్ట్ర రాజకీయాలపై కొంతమంది నేతలతో చర్చిస్తున్న క్రమంలో వారితో సర్వే ఫలితాలను పంచుకున్నట్టు తెలిసింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మార్చి మొదటివారంలో జరిగే టీఆర్ఎస్ఎల్పీ మీటింగ్‌లో సర్వే ఫలితాలను వెల్లడిస్తారని తెలుస్తోంది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో 119 సీట్లకు అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్, వచ్చే ఎన్నికలకు మాత్రం చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. అందుకే ఒకటికి నాలుగుసార్లు సర్వేల ద్వారా అభ్యర్థుల జాతకాలు తెలుసుకుంటున్నారు. ఇందులో అభ్యర్థులపై కంటే పార్టీకే ప్రజలు ఎక్కువ మద్దతు తెలుపుతున్నారని టీఆర్ఎస్ఎల్పీ మీటింగ్‌ల్లో సీఎం కేసీఆర్ వెల్లడించిన విషయం తెలిసిందే. 40 మందికిపైగా సిట్టింగు ఎమ్మెల్యేలపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నట్టు సీఎం కేసీఆర్ గుర్తించారు. ఎమ్మెల్యేలకు అందించిన సర్వే రిపోర్టుల్లోనే ఈ విషయం వెల్లడైంది.

దీంతో కొంతమంది సిట్టింగులను మార్చి, ఆ స్థానాల్లో కొత్తవారికి టికెట్లు ఇస్తారన్న ప్రచారం జరిగింది. దీనిపై వార్తలు వచ్చినప్పుడల్లా సిట్టింగులందరికీ టికెట్లు ఇస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. అయినా చాలామంది అభ్యర్థుల్లో అనుమానాలు ఇప్పటికీ ఉన్నాయి. ప్రజల్లో ఉండి పనిచేసుకోవాలని చెప్పడంతో వారంతా నియోజకవర్గాలకు పరిమితమయ్యారు. అయినా అటువంటివారిని నమ్మి టికెట్లు ఇస్తే ఆ నియోజకవర్గాల్లో గెలుస్తామన్న ఆశ టీఆర్ఎస్‌పార్టీ నేతల్లో ఎక్కువమందికి లేదు. దీంతో అక్కడ నుంచి వివిధ పార్టీలకు చెందిన నేతలను చేర్పించి, గులాబీ కండువాలు కప్పిన విషయం తెలిసిందే. తమకు టికెట్లు వస్తాయన్న ఆశతో వారంతా ఉన్నారు. అయితే ఇప్పటికే సిట్టింగు ఎమ్మెల్యేలకు తమతమ నియోజకవర్గాలకు మంచి పట్టు ఉంది. ఒక గ్రూపును ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నారు. స్థానికంగా వివిధ పార్టీలకు చెందిన నేతలను, కార్యకర్తలను టీఆర్ఎస్‌పార్టీలోకి ఆహ్వానించారు.

వ్యతిరేకత ఉన్న ఎమ్మెల్యేలకూ నియోజకవర్గాల్లో పట్టు ఉంది. దీంతో వారిని పక్కనపెట్టి ఆ స్థానంలో కొత్తగా పార్టీలో చేరిన వారికి టికెట్లు ఇస్తే, వారంతా ఎదురుతిరగడం ఖాయమని టీఆర్ఎస్‌పార్టీలోకి ఒక గ్రూపు చెబుతున్నది. ఉదాహరణకు భూపాలపల్లిలో స్పీకర్‌గా ఉన్న మధుసూదనాచారి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. టీడీపీ, కాంగ్రెస్‌పార్టీలకు చెందిన స్థానిక నేతలను టీఆర్ఎస్‌లోకి చేర్పిస్తున్నారు. అయితే ఆయనకు టికెట్టు రాదని ప్రచారం జరుగుతున్నది. ఆయన స్థానంలో గండ్ర సత్యనారాయణకు టికెట్టు ఇస్తారని, అందుకే ఆయన గులాబీ కండువా కప్పుకున్నారని తెలుస్తోంది. ఆ నియోజకవర్గంలో గండ్రకు టికెట్టు ఇస్తే, మదుసూదనాచారి వర్గీయులు ఎదురుతిరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. ఎమ్మెల్సీ ఇస్తామని ఆశచూపినా, గ్యారంటీ ఏమిటన్న చర్చ నడుస్తున్నది. అలాంటిచోట కొత్తవారికే ఎమ్మెల్సీ సీటు ఇస్తామని చెబితే బాగుంటుందని టీఆర్ఎస్‌పార్టీ నేతలు అభిప్రాయపడ్డారు. అయితే ఉమ్మడి కరీంనగర్, వరంగల్, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో సిట్టింగు ఎమ్మెల్యేల పట్ల తీవ్ర వ్యతిరేకత ఉందని, అటువంటి వారిని మార్చినా ఇబ్బందేమీ ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఓడిన స్థానాలచోట ఇతర పార్టీల నుండి ఎమ్మెల్యేలు గులాబీ తీర్థం పుచ్చుకోవడంతో, అక్కడ నుంచి పోటీ చేసిన టీఆర్ఎస్‌నేతల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. వారంతా సిట్టింగులకు ఎదురుతిరగడం ఖాయమని ప్రచారం జరుగుతున్నది.

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలివ్వండి

- కార్మిక కమిషనర్‌కు

మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ (సీఐటీయూ, ఏఐటీయూఐసీ, ఐఎఫ్‌టీయూ, ఐఎన్‌టీయూసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు కార్మిక శాఖ కమిషనర్ మహమ్మద్ నదీంను శుక్రవారం హైదరాబాద్‌లో జేఏసీ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం జేఏసీ ప్రతినిధులు పాలడుగు భాస్కర్ (సీఐటీయూ), కె ఏసురత్నం (ఏఐటీయూసీ), కె సూర్యం (ఐఎఫ్‌టీయూ)లు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు. జీవో నెంబర్ 14లో పేర్కొన్నట్టు లేదంటే జీహెచ్ఎంసీ కార్మికులకు ఇస్తున్నట్టుగానే జిల్లాల్లో పనిచేస్తున్న మున్సిపల్, కార్పొరేషన్, నగర పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు 2015,జులైలో వేతనాలను రూ.8,500 నుంచి రూ.12,500లకు పెంచారని తెలిపారు. 2017, మే 23న మరోసారి రూ.1,500 పెంచారని, దీంతో నెలకు రూ.14 వేల జీతం నిర్ణయించిందని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీలో రెండుస్లారు వేతనాలు పెంచడం పట్ల హర్షం ప్రకటిస్తున్నామని తెలిపారు. కానీ జిల్లాల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఇది చట్టవిరుద్ధమని, వివక్ష కిందకే వస్తుందని తెలిపారు. సమాన పనికి సమాన వేతనమివ్వాలని సుప్రీం కోర్టు చెప్పిందని పేర్కొన్నారు. మున్సిపల్ పరిపాలన శాఖ అధికారులు, జేఏసీ నాయకులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు కేటగిరీలను బట్టి వేతనాలు పెంచాలని సూచించారు.

విద్యాశాఖ కమిషనర్ బదిలీ?

సర్కారుపై ఉపాధ్యాయ సంఘాల ఒత్తిడి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పాఠశాల విద్యాశాఖలో పలు వివాదాస్పద ఉత్తర్వులు ఆ శాఖ కమిషనర్ మెడకు చుట్టు కున్నాయా.? ఆయన బదిలీ త్వరలో జరగనుందా..? అంటే అవుననే అంటున్నాయి ప్రభుత్వ వర్గాలు. ఇటీవల పలు వివాదాలకు పాఠశాల విద్యాశాఖ కేంద్రబిందువుగా మారింది. వేసవి సెలవుల్లో మార్పు, నూతన విద్యాసంవత్సరం ప్రారంభం, ఆప్షనల్ హాలీడేస్ వినియోగం, గణితం, సోషల్ టీచర్ల పీరియేడ్ల గొడవలతో పాటు తాజా వచ్చిన సర్కారు బడుల్లో సెలవుల పంచాయతీ, హెచ్ఎంల అధికారాల కోత, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్స్ అధికారాలకు కత్తెర...ఇలా పలు అంశాలూ వివాదాస్పదమయ్యాయి. వీటన్నింటిలోనూ కమిషనర్ జి కిషన్‌తో పాటు ఓ రిటైర్డ్ సీనియర్ అధికారి పాత్ర ఉందని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ఈ వివాదాస్పద ఉత్తర్వుల విషయాన్ని డిప్యూటీసీఎం కడియం శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య దృష్టికి తీసుకుపోవడం, ఆ ఉత్తర్వులు రద్దు కావడం పరిపాటిగా మారింది. ఇటీవల హెచ్ఎంలు, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్స్ అధికారులను తగ్గించడంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా మండిపడ్డాయి. ఈ క్రమంలోనే వారం రోజుల క్రితం జరిగిన టీచర్స్ యూనియన్స్ సమావేశమూ రసాభసగా మారింది. ఈ విషయాన్ని పలు ఉపాధ్యాయ సంఘాలనేతలు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకుపోయారు. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే ఐఏఎస్‌ల బదిలీల్లో కమిషనర్ జి కిషన్‌ను బదిలీ చేయనున్నట్టు సర్కారులోని ఓ కీలకనేత చెప్పినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ అంశం ఉపాధ్యాయవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే ముక్కుసూటిగా వ్యవహరించే జి కిషన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత సర్కారు పాఠశాలల అభివృద్ధి కాస్త మెరుగుపడ్డాయి. ఆయన చొరవతోనే ఈవిద్యా సంవత్సరం విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు, యూనిఫామ్స్, దుప్పట్టు అందిన విషయం తెలిసిందే.

ఇంటర్ పరీక్షలు బహిష్కరణ

రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమివ్వాలి

- ఇంటర్, డిగ్రీ ఫీజులు పెంచాలి
- ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించాలి : ప్రయివేటు విద్యాసంస్థల జేఏసీ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమస్యల పరిష్కారం కోసం ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఉద్యమబాట పట్టాయి. సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వంతో తలపడుతున్నాయి. ఈనెల 28 నుంచి ప్రారంభం కావాల్సిన ఇంటర్, వచ్చే నెల 6 నుంచి ప్రారంభం కావాల్సిన డిగ్రీ మూడో సంవత్సరం వార్షిక పరీక్షలను బహిష్కరిస్తున్నట్టు ప్రయివేటు విద్యాసంస్థల జేఏసీ ప్రకటించింది. శుక్రవారం హైదరాబాద్‌లో ప్రయివేటు విద్యాసంస్థల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ చైర్మెన్ జింజల రమణారెడ్డి మాట్లాడుతూ విధిలేని పరిస్థితుల్లోనే పరీక్షలను బహిష్కరిస్తున్నామని చెప్పారు. సమస్యలు పరిష్కరించాలని మంత్రులు, అధికారులకు అనేక సార్లు వినతిపత్రాలు, విజ్ఞప్తులు చేసినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. విద్యాసంస్థలను రక్షించుకోవడానికి, సమస్యలు పరిష్కరించుకోవడానికి పరీక్షలను బహిష్కరిస్తున్నామని అన్నారు. ఇది విద్యార్థులు, తల్లిదండ్రులకు కొంత ఇబ్బంది అయినా అర్థం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తున్నట్టు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చే వరకు పరీక్షలపై సహాయ నిరాకరణ కొనసాగిస్తామని చెప్పారు. పరీక్షా కేంద్రాలను కేటాయించబోమన్నారు. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం వల్ల ప్రయివేటు విద్యాసంస్థలు సంక్షోభంలో ఉన్నాయని అన్నారు. భవనాలకు అద్దె చెల్లించలేక, సిబ్బందికి జీతాలివ్వకలేక, కరెంటు బిల్లులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందించాలని ప్రశ్నించారు. అడపాదడపా ఇచ్చే ఫీజు బకాయిలు వడ్డీలకే సరిపోతున్నదని ఎద్దేవా చేశారు. ప్రయివేటు విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం, ఫీజులు సకాలంలో రాకపోవడంతో ప్రయివేటు విద్యాసంస్థల యజమానులు బాణాల వెంకటరెడ్డి, వేమూరి శ్రీనివాసరావు, శంకర్ మరణించారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే ఇంకెంతమంది చనిపోతారో తెలియని పరిస్థితి ఉందన్నారు. ప్రయివేటు విద్యాసంస్థల జేఏసీని తక్షణమే చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. మంత్రులు చొరవ చూపాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్, డిగ్రీ, పీజీ ఫీజులను పెంచాలని కోరారు. ఇంటర్ సైన్స్‌కోర్సులకు రూ.25 వేలు, ఆర్ట్స్‌కు రూ.15 వేలు, డిగ్రీ సైన్స్‌కు రూ.30 వేలు, కామర్స్‌కు రూ.25 వేలు, ఆర్ట్స్‌కు రూ.20 వేలు, పీజీ సైన్స్‌కు రూ.50 వేలు, ఆర్ట్స్, కామర్స్‌కు రూ.30 వేలకు పెంచాలన్నారు. ప్రయివేటు విద్యాసంస్థల జేఏసీ కన్వీనర్లు ఎస్ఎన్ రెడ్డి, గౌరి సతీష్, నారాయణగౌడ్, కోర్ కమిటీసభ్యులు కందాల పాపిరెడ్డి, వి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరిస్తే ఈ ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, తమకు మధ్య కొందరు అధికారులు అగాధం సృష్టిస్తున్నారని అన్నారు. లేనిపోనివి చెప్పి ప్రయివేటు విద్యాసంస్థలంటేనే దోపిడీ చేస్తున్నాయనే అభిప్రాయం వచ్చేలా అధికారులు వ్యవహరించడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ, చిన్న కాలేజీలను విజిలెన్స్ దాడులకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్పొరేట్ కాలేజీల కోసమే ఇంటర్‌లో గ్రేడింగ్ విధానం అమలు చేయడం లేదన్నారు.

తమ కోర్కె సీఎం కేసీఆర్‌ను కలవడమేనని అన్నారు. ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యలపై వివరిస్తామని చెప్పారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పాత పది జిల్లాల్లో ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలను కలుస్తామని, చైతన్యం పెంచుతామని అన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రయివేటు విద్యాసంస్థల జేఏసీ నాయకులు బాలకృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సి రాంచందర్, టి విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపముఖ్యమంత్రి కడియంతో భేటీ

ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరిని శనివారం హైదరాబాద్‌లో ప్రయివేటు విద్యాసంస్థల జేఏసీ నాయకులు కలవనున్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించనున్నారు. శుక్రవారం ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్‌ను జేఏసీ నాయకులు కలిసి వినపతిత్రం సమర్పించారు.

ఇంటర్ పరీక్షలను బహిష్కరిస్తున్నామని వివరించారు. పరీక్షలకు సహకరించాలని, కేంద్రాలివ్వాలని జేఏసీ నాయకులను అశోక్ కోరారు. తాము సహకరించలేమని, ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సమాధానమిచ్చినట్టు సమాచారం.

'శ్రావణబెళగొళ'కు తెలంగాణ టూరిజం ప్రత్యేక బస్సులు

హైదరాబాద్: 'కర్నాటకలోని శ్రావణబెళగొళ జైనులకు అత్యంత ప్రీతిపాత్రమైన, పవిత్రమైన స్థలం. ఇది తీర్థయాత్రకు ప్రసిద్ధి చెందినది. అలాగే చారిత్రాత్మక, మత సంబంధమైన వారసత్వ ప్రదేశం. ఇక్కడ భగవాన్ బాహుబలి(గోమతేశ్వరుడు) విగ్రహానికి ప్రతి 12 ఏండ్లకోసారి మహామస్తకాభిషేక వేడుకలు నిర్వహిస్తారు. ఈ నెల 17 నుంచి 25 వరకు ఈ వేడుకలు జరగనున్నాయి. పర్యాటకుల కోరిక మేరకు ప్రత్యేక టూర్ ప్యాకేజీ కింద హైదరాబాద్ నుంచి శ్రావణబెళగొళ వరకు ఏసీ వోల్వో బస్సులను నడపనున్నట్టు' తెలంగాణ పర్యాటక శాఖ ప్రకటించింది. ఈ ప్యాకేజీలో పెద్దలకు 4000, పిల్లలకు 3200 రూపాయల చొప్పున చార్జీలను నిర్ణయించింది. ఆన్‌లైన్‌లో www.tstdc.in వెబ్‌సైట్ ద్వారా సీట్లు బుక్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18004254646ను సంప్రదించవచ్చు.

20న జాతీయ ఎస్సీ కమిషన్ రాక

- దళిత సంఘాల నేతలతో భేటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు.. వాటి పరిష్కారం కోసం ఈ నెల 20న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు హైదరాబాద్‌కు రానున్నారు. దళితుల సమస్యలపై రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ కార్యదర్శులతో హైదరాబాద్‌లోని హొటల్ తాజ్ డెక్కన్‌లో సమావేశమవుతారు. అదేవిధంగా ఎస్సీల సమస్యలపై దళిత సంఘాల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు.

జేవీవీ ఆధ్వర్యంలో 24,25న జాతీయ సదస్సు

30 వసంతాలు పూర్తయిన సందర్భంగా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో రెండు రోజులపాటు హైదరాబాద్‌లో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. జేవీవీ ఆవిర్భవించి 30 వసంతాలు పూర్తయిన సందర్భంగా 'పరిశీలించండి - ప్రశ్నించండి' అదే ప్రగతికి మూలం అనే నినాదంతో రెండు రోజులపాటు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. వెంకటేశ్వరరావు చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రశ్నపై దాడి చేయడం సరికాదన్నారు. ముఖ్యంగా విద్యా, వైద్య, ఆరోగ్య రంగాల్లో ఉండే వారు ప్రశ్నించకుండా ఉంటే అభివృద్ధి జరగదన్నారు మూఢనమ్మకాలు, బాల్యవివాహాలపై ప్రజలను చైతన్య పరుస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలనేదానిపై ఈ సదస్సులో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యమానికి సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్. బి. సుదర్శన్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ప్రొఫెసర్లు తేజల్ కానిత్కర్, ఆర్. రమాకుమార్, జి. హరగోపాల్, టివి. వెంకటేశ్వరన్, కె. నాగేశ్వర్, కె. లక్ష్మీనారాయణ, శీలాప్రసాద్, వి. బాలసుబ్రమణ్యం (ఎమ్మెల్సీ), టి. సుందరరామన్, పిండిగ అంబేద్కర్, డాక్టర్ ఏ. భీనేశ్వర్‌రెడ్డి, హెచ్. వాగేషన్‌లు పాల్గొంటారని చెప్పారు. ప్రజలను చైతన్యం చేసే విధంగా, ప్రశ్నించే తత్వం పెంపొందించే విధంగా కార్యక్రమాలు రూపొందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ బిఎన్‌రెడ్డి మాట్లాడుతూ సదస్సులో విద్య, ఆరోగ్యం, సైన్స్, రాజ్యాంగం హక్కులు, వ్యవసాయం అనే అంశాలపై చర్చిస్తామన్నారు. సైన్స్, టెక్నాలజీ, అగ్రికల్చర్‌పై చర్చ జరగకుండా బంగారు తెలంగాణ సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జెవివి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం. ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి టి. శ్రీనాథ్, ఉపాధ్యక్షులు డాక్టర్ అందె సత్యం,కార్యదర్శి పి. నర్సింహులు, రాజా, రాష్ట్ర నాయకులు లక్ష్మీనర్సయ్య, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎన్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిల సాధనకు 28న చలో కమిషనరేట్

వ్యవసాయ కార్మిక సంఘం నిర్ణయం

- చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర: వెంకట్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీల పెండింగ్ బిల్లుల కోసం ఈనెల 28న హైదరాబాద్‌లోని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్‌ను ముట్టడించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిర్ణయించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర కమిటీ సమావేశం నగరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం అఖిలభారత ఉపాధ్యక్షులు బి.వెంకట్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పేద కూలీలకు ప్రభుత్వం రూ.159 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. వెంటనే నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. వ్యవసాయానికి అనుసంధానం చేసి భూస్వాములను సంతృప్తిపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. పోరాటాలతో సాధించుకున్న చట్టాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవడం ప్రజల బాధ్యత అని చెప్పారు. ఉపాధి హామీ చట్టం నిధులను ఇతర రంగాలకు మళ్లించరాదని డిమాండ్ చేశారు. కార్పొరేట్ వ్యవసాయంపై ఉన్న శ్రద్ధ గ్రామీణ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి ప్రభుత్వాలకు లేదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు మాట్లాడుతూ పెండింగ్ బకాయిలను కాగితాలపై చెల్లించినట్టుగా చూపించడాన్ని తప్పుబట్టారు. నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. 3.80 లక్షల మంది శ్రమశక్తి సంఘాలను నిర్వీర్యం చేసి మేట్లను తొలగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని చెప్పారు.

ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు జి.నాగయ్య, శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ బి.పద్మ, రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి నారి ఐలయ్య, నాయకులు వేదగిరి శ్రీనివాసరావు, సిహెచ్.రంగయ్య, కె.జగన్, నర్సింహ్మ, ఎం.రాములు పాల్గొన్నారు.

కేటీఆర్ చర్చలు సఫలం

- తక్కువ ధరకే స్టీల్ సరఫరాకు కంపెనీలు ఒకే
- ఎనతి-ఉక్కు రూ 43,660లకు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి తక్కువ ధరకు ఉక్కును విక్రయించేలా మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కె తారకరామారావు చర్చలు సఫలమయ్యాయి. టన్ను ఉక్కు రూ 43, 660లకు సరఫరా చేసేందుకు స్టీల్ కంపెనీలు అంగీకరించాయి. శుక్రవారం సచివాలయంలో స్టీల్ కంపెనీ యాజమానులతో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కేటీఆర్, హౌజింగ్ కార్పొరేషన్ చైర్మెన్ మడుపు భూంరెడ్డి, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్ర రామచంద్రన్ సమావేశమయ్యారు. స్టీల్ సరఫరాపై చర్చించారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన స్టీలుకు నిర్దిష్టమైన ధరకు అందించాలని స్టీల్ కంపెనీలను మంత్రులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా నిరుపేదలకు నాణ్యతతో విశాలమైన ఇండ్లను నిర్మిస్తున్నదని, ఇటువంటి ఉన్నత కార్యక్రమానికి, లాభాపేక్షతో కాకుండా సానుకూల దృక్పథంతో సరసమైన ధరకు ఉక్కును విక్రయించాలని కోరారు. ఈ పథకం ప్రారంభినప్పుడు మెట్రిక్ టన్ను స్టీల్ ధర ట్యాక్స్‌లతో కలుపుకుని రూ 32550 ఉండగా, బహిరంగ మార్కెట్లో ప్రస్తుత స్టీల్ ధర రూ 53, 100 (జీఎస్టీతో కలిపి) ఉందన్నారు. ఈ అంగీకారంతో గృహ నిర్మాణ శాఖపై రూ 264.60 కోట్ల భారం తగ్గిందన్నారు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే ఒక్కో మెట్రిక్ టన్ను రూ 9440 తగ్గిందన్నారు. పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, వాణిజ్యపన్నుల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, చీఫ్ ఇంజనీర్ సత్యమూర్తి, సీఈ సురేష్‌కుమార్, ఆలిండియా స్టీల్ అసోసియేషన్ చైర్మెన్ సురేష్ కుమార్ సింఘాల్‌తో పాటు ఇతర స్టీల్ కంపెనీల యాజమానులు పాల్గొన్నారు.

జీతాల్లేకుండా పన్ను కట్టేదెలా!

- కాంట్రాక్టు లెక్చరర్ల ఆవేదన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతినెలా జీతాల్లేకుండా ఆదాయపు పన్ను ఎలా కట్టాలని కాంట్రాక్టు లెక్చరర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షులు జి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ శోభన్‌బాబు, ప్రచార కార్యదర్శి జబీఉల్లా శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 3,687 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకులు ఆదాయపు పన్ను కట్టాలని ఇంటర్ విద్యా కమిషనర్ అశోక్ ఆదేశాలివ్వడంతో ఏం చేయాలో తోచడం లేదని పేర్కొన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులకు రూ.37,100 చొప్పున పది నెలలే జీతాలొస్తాయని తెలిపారు. జీతాలు పెరిగి ఎనిమిది నెలలే అయ్యిందని పేర్కొన్నారు. అందులోనూ ఆరు నెలల జీతాలే అందుకున్నామని, డిసెంబర్, జనవరి వేతనాలు పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు.

ప్రతినెల రూ.200 ప్రొఫెషనల్ ట్యాక్స్ పోతోందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు అందిన వేతనాలు రూ.2,21,400 మాత్రమేనని తెలిపారు. ఆదాయపు పన్ను పరిమితి రూ.2.50 లక్షల వరకు ఉందని పేర్కొన్నారు. పన్ను పరిధి దాటకముందే పన్ను ఎలా కట్టాలని తెలిపారు. మార్చి నుంచి ఏప్రిల్ వరకు జీతాలు పొంది రూ.2.50 లక్షల ఆదాయం దాటిన వారికి ఆదాయపు పన్ను వర్తిస్తుందని పేర్కొన్నారు. 12 నెలల జీతం, డీఏ, హెచ్ఆర్ఏ చెల్లిస్తే ఆదాయపు పన్ను చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.


28న ఏజెన్సీ బంద్ : గిరిజన ఐక్య వేదిక

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇతర కులాలను ఎస్టీ జాబితాలో కలుపుతున్నందుకు నిరసనగా ఈ నెల 28న ఏజెన్సీ ప్రాంతాల్లో బంద్ పాటించాలని గిరిజన ఐక్య వేదిక పిలుపునిచ్చింది. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ గిరిజన ఐక్య వేదిక నేతలు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎస్టీ జాబితాలో ఇతర కులాలను కలపడాన్ని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమర్ధరించడం అన్యాయమన్నారు.

ఎర్రజొన్న రైతులకు గుర్తింపు కార్డులు

- దళారులపై కఠిన చర్యలు :మంత్రి హరీశ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎర్రజొన్నల కొనుగోలులో భాగంగా సదరు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామని మార్కెటింగ్ శాఖ మంత్రి టి. హరీశ్‌రావు చెప్పారు. సేకరణ వ్యవహారంపై తక్షణమే ఆర్మూరును సందర్శించాలని, ఎర్రజొన్నల కొనుగోలుకు ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో శుక్రవారం జలసౌధలో మంత్రి వివిధ శాఖల అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌తో పాటు వ్యవసాయ శాఖ కమిషనర్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.వ్యవసాయ విస్తరణాధికారి, మార్కెటింగ్, రెవెన్యూ అధికారులతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీ పరిశీలన అనంతరమే నిజమైన రైతుల నుంచి ఎర్రజొన్నలు కొనుగోలు చేయాలని హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. ఎర్రజొన్న పండించిన అసలు రైతులకు మాత్రమే ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎకరానికి 12 క్వింటాళ్ళకు మించి ఎర్రజొన్నను మార్కెట్‌కు తీసుకు వచ్చే వారిపై విజిలెన్స్ శాఖ నిఘా పెట్టాలని కోరారు. కొనుగోలు చేసిన సరకుకు డబ్బును రైతు ఖాతాలో జమ చేయాలని చెప్పారు. ఒక్క పైసా కూడా దుర్వినియోగం కావడానికి వీలు లేదన్నారు.

పరేషాన్



(మొదటిపేజీ తరువాయి)

వస్తోంది. ఆళ్లపల్లి మండలం మార్కోడులో ఊరి చివరున్న చెట్టు వద్ద మాత్రమే సిగ్నల్స్ వస్తుండటంతో అక్కడ వేలి ముద్రలు తీసుకుని తిరిగి గ్రామంలోకి వచ్చి బియ్యం ఇస్తున్నారు. పాల్వంచ మండలం కారెగట్టులోనూ ఇదే పరిస్థితి.

సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం పర్సాయిపల్లిలో ఏడు క్వింటాళ్ల బియ్యం సరఫరా చేయాలి. మిషన్ పనిచేయక గురువారం ఉదయానికి కేజీ కూడా పంపిణీ చేయలే. పాలకవీడు మండలం బొత్తలపాలెంలో 646 కార్డుల్లో ఆరుగురికే బియ్యం ఇచ్చారు. పెన్‌పహాడ్ మండలం దూపహాడ్‌లో 68క్వింటాళ్లకు 34 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశారు. అనంతారంలో ఒక షాపులో 95 క్వింటాళ్లకు 40 క్వింటాళ్లు, మరో షాపులో 93 క్వింటాళ్లు 45 క్వింటాళ్లే పంపిణీ చేశారు.

నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం ఎంమల్లేపల్లిలోని రేషన్ షాపులో 230 కార్డులున్నాయి. నాలుగో తేదీ నుంచి సిగ్నల్స్ రాకపోవడంతో ఈ -పాస్ మిషన్ పని చేయడం లేదు. అప్పుడప్పుడు వచ్చే నెట్‌వర్క్‌తో ఇప్పటి వరకు 100కార్డుదారులకు మాత్రమే బియ్యం పంపిణీ చేశారు. గొల్లపల్లిలోని రేషన్ షాపులో 220 కార్డులుండగా ఇప్పటి వరకు 70 మందికి మాత్రమే పంచారు.

జయశంకర్ జిల్లా కోమటిపల్లి గ్రామపంచాయతీ కొత్తూరు రేషన్ దుకాణంలో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ లేక ఈపాస్ మిషన్‌ను రాజారం చెరువు కట్టపైకి తీసుకెళ్లి బయోమెట్రిక్‌లో వేలిముద్రలు తీసుకున్నారు. మళ్లీ గ్రామానికి వెళ్లి బియ్యాన్ని తూకం వేసి ఇచ్చారు.

ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్లపల్లి రేషన్ దుకాణానికి మొత్తం 240క్వింటాళ్ల బియ్యం రాగా ఇప్పటి వరకు 150క్వింటాళ్ల బియ్యమే పంపిణీ జరిగింది. ఈ పాస్ మెషన్‌కు సిగ్నల్ సమస్యతోపాటు ఎలక్ట్రానిక్ కాంటాలు కూడా మొరాయిస్తున్నాయి.

పెద్దపల్లి జిల్లాలో 2,12,362 రేషన్‌కార్డులున్నాయి. 413 రేషన్ షాపుల ద్వారా ప్రతి నెలా 39,851.97 క్వింటాళ్ల బియ్యం అలాట్ ఉంది. బయోమెట్రిక్ మొరాయింపు, 15వ తేదీ వరకే సరుకులు ఇవ్వడంతో మూడు నెలల్లో 12,846.92 క్వింటాళ్ల బియ్యం వరకు వెనక్కి వెళ్లాయి.

20 శాతమే..

బెల్లంపల్లి మండలంలో ఒక్కో రేషన్ దుకాణానికి 500 కార్డులుండగా వేలిముద్రలు పడక ఇప్పటివరకు 20 శాతం పంపిణీ కూడా పూర్తవ్వలేదు. మందమర్రి మండలంలో దుకాణానికి 500 కార్డులుండగా ఈ నెలలో 150 మందికే సరుకులు పంపిణీ చేశారు.

ఒక్కరిదీ మ్యాచ్ కాలే..

నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం గొడిసిర్యాల గ్రామానికి చెందిన సిడాం సుగుణాబాయిది నిరుపేద కుటుంబం. ఐదుగురు కుటుంబ సభ్యుల్లో ఏ ఒక్కరి వేలిముద్రలు మ్యాచ్ కాకపోవడంతో వారికి రావాల్సిన 30 కిలోల బియ్యం ఇవ్వలేదు.

ఏలి ముద్రలతోనే సమస్య :
సంద రాజేశ్వరి ముంజంపల్లి

గీ ఏలి ముద్రలు ఎప్పటిసంది సురువైనవో.. గప్పటి సంది నా చేతి వేలిముద్రలు వత్తలేవు. బియ్యం వచ్చినప్పుడల్లా పోయిన. ఎన్నిసార్లయినా ఏలిముద్రలు పడలే. గిప్పటిదాకా బియ్యం తీసుకోలే. ఇచ్చే బియ్యానికే మిషిన్లని, 15రోజులే ఇత్తమని ఆగం చేసుడెందుకు.

రెండుసార్లు వేలిముద్రలు పెట్టకుంటే..
జూపాక రాజమ్మ- మూలసాల, పెద్దపల్లి మండలం



నా కార్డుకు నెలకు 6 కిలోల చొప్పున బియ్యం వచ్చేవి. వేలిముద్రలు పెట్టనందున రెండు నెలల బియ్యం ఇయ్యలే. నా కూతురుకు ఆరోగ్యం బాగలేక ఆస్పత్రిలో చేరడంతో వెళ్లాను. నా కొడుకు హైదరాబాద్‌లో ఉంటూ పని చేస్తున్నాడు. నా కొడుకు వేలిముద్ర లేకపోతే కూడా బియ్యం ఇవ్వడం లేదు.

వేలిముద్ర పడలేదని.. : జె.సుమలత, నవీపేట్

మిషన్‌లో వేలిముద్ర పడలేదని బియ్యం ఇవ్వడం లేదు. వచ్చేది 6 కిలోల బియ్యం.. వీఆర్వోను కలుద్దామంటే ఆయన నెలలో ఒక్క రోజే వచ్చి పోతున్నడు. ఆయన కోసం ఎదురుచూస్తూ కూర్చుంటే రూ.200 కూలి పోతున్నది.

ఐదు నెలలుగా బియ్యం రావడం లేదు...
నాంపల్లి ఎల్లవ్వ, నారాయణరావుపేట- సిద్దిపేట జిల్లా



ఐదు నెలలుగా మాకు రేషన్ బియ్యం రావడం లేదు. ఆధార్ కార్డులో వేలిముద్రలు సరిచేసు కొమ్మన్నరు. అయినా వేలుముద్రలు రావడం లేదు.

రాత్రి ఎనిమిది వరకు వేచి చూస్తున్నాం...
నర్సింలు, పెద్దమ్మగూడెం- సంగారెడ్డి జిల్లా



రాత్రి ఎనిమిది గంటల వరకు రేషన్ సరుకుల కోసమే వేచిచూస్తున్నాం. వండుకుని తినే సమయంలో రేషన్ షాపు వద్ద లైన్లో నిలబడి ఇబ్బందులు పడుతున్నాం. వేలిముద్రలు రాక ఒక్కో వ్యక్తి ఐదారుసార్లు వేలు పెట్టాల్సి వస్తోంది.

వందలాది రూపాయలు కిరాయి పెట్టుకుని వచ్చా..
గుండ్లగోని అంజమ్మ -ఎంమల్లేపల్లి- నల్లగొండ జిల్లా

హైదరాబాద్‌లో పని చేసుకుని బతుకుతున్నా. బియ్యం కోసం పని మానుకొని ఇంత దూరం వస్తే.. మూడు రోజుల నుంచి ఈపాస్ మిషన్ సిగ్నల్ రావడం లేదు. వేలిముద్రలు పడటం లేదు. గతంలో రాగానే బియ్యం ఇచ్చేవారు. ఇప్పుడు ఈపాస్‌తో ఇబ్బందులకు గురిచేస్తున్నారు.


పాఠశాలకు వెళ్లకుండా వచ్చాను
సంధ్యారాణి, 5వ తరగతి విద్యార్థి (దాబా) (కె)

ఉదయం నుంచి రేషన్ దుకాణం వద్ద లైన్‌లో ఉన్న. మా నాన్న నన్ను లైన్‌లో ఉంచి వ్యవసాయ పనులకు పోయిండు. ఈపాస్ యంత్రంలో నెట్‌వర్క్ లేకపోవడంతో రోజంతా అక్కడే నిలబడాల్సి వచ్చింది.

సిగ్నల్ కోసం ఇంటిపైకి..
వెంకట్రాములు, మల్లెపల్లి డీలర్- మహబూబ్‌నగర్ జిల్లా

మల్లెపల్లి, తిర్మాలాపూర్, కుట్టినపల్లి గ్రామాల్లో సిగ్నల్ రాకపోవడంతో మేడపైకి ఎక్కాల్సి వస్తోంది. సరుకులు తెచ్చేది ఒక ఎత్తయితే.. పంపిణీ చేయటం మరో ఎత్తవుతున్నది.

50 మందికైనా ఇవ్వలేక పోతున్నం...
హన్మంతరావు, మెదక్ పట్టణ రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు



ఈపాస్‌కు నెట్‌వర్క్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో రోజుకు కనీసం 500 మందికి సరుకులు ఇచ్చేవాళ్లం. ఇప్పుడు 50మందికి కూడా ఇవ్వలేకపోతున్నాం. దీనికి తోడు పంపిణీకి తేదీల నిబంధనతో అందరికీ రేషన్ అందడం లేదు.

అప్పులబాధతో మరో ముగ్గురు..

- ఆత్మహత్య చేసుకుని ఇద్దరు రైతులు
- గుండెపోటుతో మిర్చిరైతు..

నవతెలంగాణ- కాల్వ శ్రీరాంపూర్/రేగొండ/గార్ల

అప్పుల బాధతో మరో ముగ్గురు రైతులు శుక్రవారం చనిపోయారు. ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకోగా..ఓ మిర్చి రైతు గుండెపోటుతో చనిపోయాడు. మృతుల్లో కౌలు రైతు ఉన్నాడు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం పరిధిలోని జాఫర్‌ఖాన్‌పేట్‌కు చెందిన చేకొండ రాజయ్య(47) ఆరేండ్లుగా ఆరెకరాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఖరీఫ్‌లో మూడెకరాల్లో వరి, మూడెకరాల్లో పత్తి పంటలేశాడు. పత్తి పంట సరిగా పండలేదు. నీరు సరిపోక వరిపైరూ ఎండిపోయింది. కౌలు, పెట్టుబడి కోసం చేసిన బాకీలు రూ.5 లక్షలు ఎలా తీర్చాలో తెలియలేదు. దీంతో తీవ్ర మనస్థాపం చెంది చేనులోనే చెట్టుకు ఉరేసుకు న్నాడు. పోలీసులు ఘటనాస్థలిని సందర్శించారు. రైతు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది. ప్రొఫెసర్ జయశంకర్-భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కనిపర్తికి చెందిన ఎం.రాజుసమ్మయ్య(60) మూడెకరాలలో పత్తి, మిర్చి పంట సాగు చేశాడు. గతేడాది, ఈ యేడాది కూడా పంట సాగు కోసం రూ.6లక్షలు అప్పు చేశాడు. పంట దిగుబడి సరిగారాక, తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతునికి భార్య పోచమ్మ, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

మహబూబాబాద్ జిల్లా గార్ల మండల శివారులోని పూమ్యతండాకు చెందిన ఇస్లావత్ హచ్యా (58) ఎకరన్నరలో మిర్చి, మరో ఎకరన్నరలో పత్తి సాగు చేశాడు. పెట్టుబడి నిమిత్తం రూ.3.50లక్షలు అప్పుచేశాడు. గతేడాది పెద్దకొడుకు చనిపోవటం, మరోవైపు చిన్న కొడుకు కాలు విరిగిపోవటం, ఇంకోవైపు పంట దిగుబడి రాక అప్పులు అలాగే ఉండటంతో లోలోన కుమిలిపోయాడు. అదే బెంగతో ఆ రైతు గుండె ఆగింది. గుండెపోటుతో మరణించిన హచ్యా కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని టీఆర్ఎస్ మండల నాయకులు మీరాపఠాన్ కోరారు.

నేరెళ్ల బాధితులకు న్యాయం చేయండి..

- హోం మంత్రికి సంఘీభావ కమిటీ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలని 'నేరెళ్ల బాధితుల సంఘీభావ కమిటీ' హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఇసుక మాఫియా ఘటనలో పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని తెలిపింది. అనేకసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా, ఆఖరుకు రాష్ట్రపతి కోవింద్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని హోం మంత్రి ఈ సందర్భంగా కమిటీకి హామీనిచ్చారు. బాధితులకు తగు న్యాయం జరిగేలా చూడాలంటూ డీజీపీని ఆదేశిస్తానని అన్నారు.

నేరెళ్ల సంఘీభావ కమిటీ ఆధ్వర్యాన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, టీజేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్, న్యూడెమోక్రసీ రాష్ట్ర నేత గోవర్ధన్ తదితరులు శుక్రవారం హోం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ.. బాధితులను చావ బాదిన జిల్లా ఎస్పీపై ఇప్పటి వరకూ చర్యలు తీసుకోకపోవటం శోచనీయమన్నారు. బాధిత కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగమైనా ఇవ్వాలి లేదా ఆర్థిక సాయమైనా చేయాలని డిమాండ్ చేశారు. కోదండరామ్ మాట్లాడుతూ.. నేరెళ్ల ఘటనలో పోలీసులు అత్యంత దుర్మార్గంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల తరపున అనేక రకాలుగా ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. వారికి న్యాయం జరిగేంత వరకూ పోరాడతామని చెప్పారు. ఈ ఘటనలో పోలీసులు, బాధితులను ఇష్టానుసారంగా తిట్టటం, కులం పేరుతో దూషించటం చట్ట విరుద్ధమని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరిచి.. ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. లేదంటే అన్ని పార్టీలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మింగిన మ్యాన్‌హోల్


చిత్తూరు: ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేసేందుకు వెళ్లిన ఏడుగురు కార్మికులు విషవాయువులను పీల్చి మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు..చిత్తూరు జిల్లాలోని పలమనేరు మండలంలో మోరం గ్రామంలోని పౌల్ట్రీ ఫారంలో సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేయడానికి ఏడుగురు కార్మికుల వెళ్లారు. క్లీన్ చేయడానికి సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగిన ఒక కార్మికుడు అందులోని విషవాయువులు పీల్చి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో అతన్ని కాపాడటానికి ట్యాంక్‌లోకి దిగిన మరో ఎనిమిది మంది ఇదే స్థితికి లోనయ్యారు. వెంటనే స్థానికులు వారిని ఆస్పత్రులకు తరలించారు. నలుగురు ఘటనాస్థలంలోనే మృతిచెందగా, ముగ్గురు చికిత్స పొందుతూ మరణించారు. మృతులు రమేష్, రామచంద్రం, రెడ్డప్ప, కేశవ, గోవిందస్వామి, బాబు, శివలుగా గుర్తించారు. మృతులందరు సమీప గ్రామ నివాసులేనని తెలిసింది. కాగా మృతుల కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 10లక్షల రూపాయల పరిహారాన్ని ప్రకటించింది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎన్ చినరాజప్ప విచారాన్ని వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోఉన్న కార్మికులకు సరైన వైద్యం అందించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ సూచించారు. అయితే పరారీలో ఉన్న పౌల్ట్రీ ఫారం మేనేజర్‌కోసం గాలింపు చర్యలు చేపట్టామని పోలీసులు తెలిపారు.

చొప్పదండి తహసీల్దార్‌ను అరెస్ట్ చేయాలి

కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు

నవతెలంగాణ -చొప్పదండి

అనారోగ్యంతో మరణించిన దళిత మహిళ మృతదేహాన్ని పూడ్చేందుకు వెళ్తే అది ప్రభుత్వ స్థలమంటూ అడ్డుకున్న చొప్పదండి తహశీల్దార్ రాజయ్యను వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల కేంద్రంలోని దుబ్బకాలనీలో గుడిసెలు వేసుకున్న పేదలను కేవీపీఎస్ బృందం శుక్రవారం కలిసింది. బాధితుల వివరాలు సేకరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008లో 291 మంది ఎస్సీ, బీసీల్లోని పేదలకు అప్పటి ప్రభుత్వం నివాస స్థలాల కోసం పట్టాలిచ్చిందని చెప్పారు. తర్వాత హద్దులు చూపకపోవడంతో వారు పలుసార్లు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని అన్నారు. ఎన్నో ఏండ్లుగా ఆ భూమిలో నివసిస్తున్న దళితులకు భూమి ఇవ్వకుండా



పట్టాలను రద్దు చేసి పోలీసులను ఉసిగొల్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పట్టాలవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కరీంనగర్ జిల్లా కార్యదర్శి టీ.సురేష్, నాయకులు దేవరాజ్, మల్లారపు బాపు, లక్ష్మినారాయణ తదితరులు ఉన్నారు.

సుబాబుల్, జామాయిల్ పంటలకు
గిట్టుబాటు ధర ఇవ్వాల్సిందే

నవతెలంగాణ-భద్రాచలం

సుబాబుల్, జామాయిల్ పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, లేనిపక్షంలో దీనిపై చట్టసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీస్తామని కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి, సీపీఐ(ఎం) ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజయ్య అన్నారు. సుబాబుల్, జామాయిల్ పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాక సమీపంలో ఐటీసీ పేపర్‌మిల్లును అఖిలపక్షం ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం ముట్టడించారు. రైతుల ఆందోళన నేపథ్యంలో ముందస్తుగానే పోలీసులు మిల్లుగేట్‌కు తాళం వేశారు. బ్యారికేడ్లను తోసుకుని...గేటు దూకి లోనికెళ్లే క్రమంలో పోలీసులకు, రైతులకు మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో ముఖ్య నాయకులను ఐటీసీలోనికి వెళ్లేందుకు అవకాశమిచ్చారు. అంతకు ముందు రైతు సంఘాల ఐక్యవేదిక నాయకులు ఏకే రామారావు అధ్యక్షతన ఐటీసీ కర్మాగారం వద్ద జరిగిన సభలో రేణుకాచౌదరి, సున్నం రాజయ్య మాట్లాడుతూ రైతులు జామాయిల్, సుబాబుల్ తోటలు వేసేలా ఐటీసీ కంపెనీ పురిగొల్పిందని, తీరా పంట చేతికొచ్చే సమయంలో గిట్టుబాటు ధర ఇవ్వకుండా రైతులను నష్టాల ఊబిలోకి నెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు శ్రేయస్సే కోరుకుంటే..వెంటనే క్వింటా సుబాబుల్‌కు రూ.5600, జమాయిల్‌కు రూ.6వేలు ఇచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. చర్చల పేరుతో రైతులను ప్రభుత్వం అవమానించిందన్నారు. రైతు నాయకులను హైదరాబాద్ పిలిచి వారి ముందే దళారులతో చర్చలు జరిపి తర్వాత రైతులతో జరపడమేంటని ప్రశ్నించారు. దళారీ వ్యవస్థను యాజమాన్యం దొడ్డిదారిన ప్రోత్సహిస్తోందన్నారు. సుబాబుల్, జామాయిల్ రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. ఆంధ్రాలో ప్రత్యేకంగా యార్డులు పెట్టి సుబాబుల్, జామాయిల్ కొనుగోలు చేస్తుంటే ఇక్కడ ఎందుకు ఏర్పాటు చేయరని ప్రశ్నించారు. అన్ని మండలాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో మూతపడ్డ కాగజ్‌నగర్, కమలాపురం ఫ్యాక్టరీలను తెరిపించాలని కోరారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గసభ్యులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ ఐటీసీ కంపెనీలో భారీ కుంభకోణం జరుగుతోందన్నారు. అటవీశాఖ ద్వారా కొనుగోలు చేసిన దాని కన్నా ఎక్కువ లెక్కలు రాస్తూ అవినీతికి పాల్పడుతున్నారని, అందులో ఐటీసీ, అటవీ అధికారులకు వాటాలున్నాయన్నారు. హరితహారానికి కోటి మొక్కలు ఐటీసీ ఇచ్చిందన్న నెపంతో రైతులను ఎంత ముంచినా పట్టించుకోరా అని సీఎం కేసీఆర్‌ని ప్రశ్నించారు.

ఎంపీ రేణుకాచౌదరి, సున్నం రాజయ్య, పోతినేని సుదర్శన్‌రావు, ఇతర రైతు సంఘాల నాయకులు ఐటీసీ పరిపాలనాధికారి ప్రమోద్ పాత్రోకు వినతిపత్రం అందించారు. రైతు సంఘాల నాయకులతో, రాజకీయ పార్టీల నేతలతో చర్చించి ధరలపై నిర్ణయం తీసుకుంటామని ప్రమోద్ పాత్రో వారికి హామీ ఇచ్చారు. అధికారుల హామీ మేరకు ఉద్యమాన్ని తాత్కాలికంగా విరమిస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పోటు రంగారావు, న్యూడెమోక్రసీ (రాయల వర్గం) నేత రాయల చంద్రశేఖర్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) భద్రాద్రి, ఖమ్మం జిల్లా కార్యదర్శులు అన్నవరపు కనకయ్య, నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్లు, ఏజె రమేశ్, రైతుసంఘం నాయకులు బొంతు రాంబాబు, తాతా భాస్కర్‌రావు, మాదినేని రమేష్‌బాబు, యలమంచిలి రవికుమార్, ఎంబి నర్సారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయితా సత్యం, ఎడవల్లి క్రిష్ణ, బీజేపీ నాయకులు వెంకట రెడ్డి, టీడీపీ నాయకులు తాళ్లూరి జగదీశ్, ఏపీ రైతు సంఘం నాయకులు బిబిజి తిలక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్.. బీజేపీలతో రాజకీయం భ్రష్టు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీలు మాదిగలను మోసం చేస్తున్నాయని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ స్వార్థ రాజకీయాలకు పెద్ద పీట వేస్తూ సిద్ధాంతాలను పక్కన పెట్టాయని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంత్యోదయ సిద్ధాంతానికి వ్యతిరేకంగా పాల్పడుతున్నదని చెప్పారు. మార్చి 5వ తేదీలోపు వర్గీకరణ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుంటే తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామన్న బీజేపీ అధికారంలోకి వచ్చి నాలుగేండ్లు అవుతున్నా వర్గీకరణ ఒక అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. వర్గీకరణ విషయంపై కాంగ్రెస్, బీజేపీ నాటకమాడుతున్నాయని దుయ్యబట్టారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించకుండా ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు వస్తే ఎమ్మార్పీఎస్ నిరసన సెగ తప్పదని, రాహుల్ గాంధీకి కూడా అదే గతి పట్టిస్తామని హెచ్చరించారు. మాదిగలను మోసం చేయడంలో బీజేపీ మొదటి స్థానంలో ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఉషామెహర్ కమిషన్‌ను వేసిన ఆ పార్టీ వర్గీకరణ విషయంలో బీజేపీని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెడితే మద్దతు ఇస్తామని రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్రమోడీకి లేఖ రాయాలని మంద కృష్ణ డిమాండ్ చేశారు. ఓబీసీ వర్గీకరణ కోసం ఒక లేఖ రాస్తే కమిషన్ వేసిన కేంద్ర ప్రభుత్వం 24 ఏండ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటాలు, ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. వర్గీకరణ బిల్లుపై తెలుగు రాష్ట్రాల ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారో తెలియడం లేదన్నారు.

సహనం ఆగ్రహంగా మారకముందే..

వర్గీకరణపై మాదిగల సహనం ఆగ్రహంగా మారకముందే కేంద్రం నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి పెద్ద మాదిగను అవుతానన్న ఏపీ సీఎం చంద్రబాబు అధికారంలోకి రాగానే ఈ విషయాన్ని మరిచిపోయారని, తెలంగాణ సీఎం కేసీఆర్ వర్గీకరణ విషయంపై దోబుచులాడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఇద్దరు ముఖ్యమంత్రులు పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టడానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు.

బీజేపీ ఉన్న ఓట్లు కాపాడుకుంటే చాలు

వచ్చే సాధారణ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని చెబుతున్న చెబుతున్న బీజేపీ నేతలు అధికారం కాదు.. ఉన్న ఓట్లను కాపాడుకుంటే చాలని వ్యాఖ్యానించారు.

నేడు.. రేపు తెలంగాణ, ఏపీ కమిటీ సమావేశాలు

శని, ఆదివారాల్లో ఎమ్మార్పీఎస్ అనుబంధ కమిటీ సమావేశాలు జరుగుతాయని చెప్పారు. ఈ సమావేశాల్లోనే భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు మావోయిస్టులు మృతి
- భారీగా మందుపాతర్లు, తుపాకులు స్వాధీనం
- మరో చోట బస్సుకు నిప్పంటించిన మావోయిస్టులు ?

నవతెలంగాణ-చర్ల

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా చింతగుప్ప పోలీస్ స్టేషన్ పరిధిలోని టోకన్‌పల్లి దండకారణ్యంలో గురువారం అర్ధరాత్రి ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసులు, మావోయిస్టుల కు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. సుక్మా ఎస్పీ అభిషేక్ మీరా వివరాల ప్రకారం.. టోకన్‌పల్లి దండకారణ్యంలో మావోయిస్టులు రహస్య సమావేశం నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు డీఆర్జీ, ఎస్‌టీఎఫ్ జవాన్లు కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో ఇరువురికి మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో నందా గరుదమ (24) అనే మహిళా మావోయిస్టు, సన్నీ ఉర్ఫ్ కుంజాం(30) అనే మరో మావోయిస్టు మృతి చెందారు. మరికొంత మంది మావోయిస్టులు పారిపోయారు. సంఘటనా స్థలంలో భారీగా మందుపాతర్లు, తుపాకులు, వైరు, మందులు, నిత్యావసర వస్తువులు, విప్లవ సాహిత్యాలు లభ్యమైనట్టు ఎస్పీ తెలిపారు. భీజాపూర్ జిల్లా తోయనార్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఘాటి రహదారిలో మావోయిస్టులు బస్సుకు నిప్పంటించినట్టు సమాచారం.

కాంగ్రెస్‌లో కిరికిరి..!

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న వేళా...కాంగ్రెస్ పార్టీలో యాత్రల లొల్లి మొదలైంది. కొంత మంది బస్సుయాత్ర అంటే మరికొంత మంది పాదయాత్రలంటూ ప్రకటనలు చేస్తున్నారు. ఏ ఇద్దరూ కలిసి యాత్ర చేసే అవకాశం కనిపించడం లేదు. సీనియర్ నేతలంతా ఎవరికి వారే యమునా తీరే అన్న ట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటిదాక అధ్యక్ష పదవి కోసం కొట్లాడుకుంటున్న నేతలు...యాత్రల కోసం లొల్లి పెట్టుకుంటున్నారు. ఒకవైపు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బస్సుయాత్ర ద్వారా తన స్థానాన్ని పదిల పర్చుకునేందుకు ప్రయత్ని స్తుండగా, అదే జరిగితే ఆయనకే పేరొస్తుందని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలా స్థిరపడి పోతే తమ పరిస్థితి ఆగమ్యగోచరంగా మార బోతుందని కొంత మంది నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే బస్సుయాత్ర కాకుండా ఎవరికి వారు పాదయాత్రలు చేసి సొంత ఇమేజ్ పెంచుకోవాలని

తాపత్రయపడుతున్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్యంలో నెల 26న చేవేళ్ల పట్టణం నుంచి బస్సుయాత్ర ప్రారంభించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ఆర్ 2004 ఎన్నికలకు ముందు పాదయాత్ర నిర్వహించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారు. చేవెళ్ల నుంచి బస్సుయాత్ర ప్రారంభించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ రాష్టంలో అధికారంలోకి వస్తోందని నేతలు భావిస్తున్నారు. మార్చి 11 వరకు బస్సుయాత్ర కొనసాగించి, అసెంబ్లీ సమావేశాలను పురస్కరించుకుని బ్రేక్ ఇవ్వనుంది. ఆ తర్వాత జూన్ 2న వరకు కొనసాగించి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారీ బహిరంగ సభను నిర్వహించి, దానికి ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీని ఆహ్వానించేలా ప్లాన్ చేసినట్టు తెలిసింది. బస్సుయాత్ర అనగానే పార్టీ శ్రేణుల్లో కోలాహలం మొదలైంది. బస్సుయాత్ర ప్రారంభం కాకముందే...నేనంటే...నేనంటూ కొంత మంది సీనియర్ నాయకులు పాదయాత్రలు చేస్తామంటూ ప్రకటిస్తున్నారు. సీనియర్ నేతలంతా బస్సుయాత్ర చేయడమే బెటర్ అని కొంత మంది నేతలు ఉత్తమ్‌కు మద్దతు పలుకుతున్నారు. ఈ యాత్రలో పాల్గొనకుండా కొంత మంది నేతలు పోటీ యాత్రకు సిద్ధమవుతున్నారు. పాదయాత్ర చేసేందుకు టీపీసీసీ కార్యనిర్వహక అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క ఐదారు మాసాల క్రితం ప్రయత్నించారు. అప్పట్లో పాదయాత్రకు కొంత మంది నేతలు అడ్డుపడటం వల్లే ఆగిపోయిందని తెలిసింది. మళ్లీ తన పాదయాత్రను కొనసాగించేందుకు ఆయన పావులు కదుపుతున్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. మరోపక్క పెండింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాల కోసం కొడంగల్ నుంచి పాదయాత్ర చేయాలని స్థానిక ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి నిర్ణయించినట్టు ప్రకటనలు వచ్చాయి. నల్లగొండ జిల్లాలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఎమ్మెల్యే డికె అరుణ, కరీంనగర్ జిల్లాలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పాదయాత్రకు ప్లాన్ చేసినట్టు తెలిసింది. ఇప్పటికే యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్ నేతృత్వంలో బస్సుయాత్ర కొనసాగుతున్నది. అయినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో అధిష్టానం ఎవరో ఒకరికి వ్యక్తిగత పాదయాత్రకు అనుమతి ఇచ్చే అవకాశం లేదన్న చర్చ కూడా ఉంది. దీంతో పార్టీ నేతలంతా బస్సు యాత్ర చేయాలని ప్రణాళిక రూపొందించిందని కొంత మంది నేతలు విశ్లేషణలు చేస్తున్నారు. పార్టీ నేతలను సమన్వయపరుస్తూ బస్సు యాత్ర చేపడతారని, దీని వల్ల ఎవరినీ నొప్పించకుండా మూకుమ్మడిగా తనతో తీసుకెళ్లేలా ఉత్తమ్ ప్లాన్ చేశారని సమాచారం. అయితే పార్టీ నేతలంతా సొంతంగా పాదయాత్రలు చేసి ఇమేజ్ పెంచుకోవాలన్న లక్ష్యంతో ఉన్నారు. అయినప్పటికీ రాష్ట్ర నాయకత్వం బస్సుయాత్రను తెరపైకి తెచ్చినట్టు తెలుస్తోంది. పార్టీలో ఎవరో ఒక్కరికి అవకాశం ఇవ్వడంతో అంతర్గత కుమ్ములాటలకు ఆస్కారం ఇచ్చినట్టు అవుతుందని అధిష్టానం భావిస్తోంది. నేతలను ఎవరినీ నొప్పించకుండానే పార్టీ పరంగా తమ లక్ష్యం నెరవేర్చుకునేలా అధిష్టానం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందని పార్టీలో వ్యక్తమవుతున్నది. పార్టీ నేతల్లో భేదాభిప్రాయాలను పక్కన పెట్టి నాయకులంతా ఐక్యంగా బస్సు యాత్రను విజయవంతం చేసే ప్రయత్నానికి అంతర్గతకుమ్ములాటలు ఇబ్బందిగా మారనున్నాయి.

రావిరాల గీతాంజలి యూనిట్‌లో ఈడీ సోదాలు

రూ.3వేల కోట్ల వజ్రాలు, వజ్రాభరణాలు సీజ్

- కార్మికుల మనుగడ ప్రశ్నార్థకం :
  కంపెనీని ప్రభుత్వం నడిపించాలి : సీఐటీయూ

నవతెలంగాణ-మహేశ్వరం

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, రావిరాలలోని రాజీవ్‌జెమ్స్ పార్కులో గీతాంజలి గ్రూప్ డైమండ్ జ్యువెలరీ యూనిట్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు గురువారం రాత్రంతా సోదాలు చేశారు. సుమారు రూ.3వేల కోట్ల విలువ చేసే వజ్రాలు, వజ్రాభరణాలు సీజ్ చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.11,400 కోట్లు కుచ్చుటోపి పెట్టిన నీరవ్‌మోడీ వజ్రాల వ్యాపారంలో భాగంగా హైదరాబాద్ జెమ్స్ సెజ్‌లో 2007 నుంచి గీతాంజలి గ్రూప్ పేరుతో వజ్రాభరణాల తయారీ యూనిట్‌ను అతని అల్లుడిని పెట్టి నిర్వహిస్తున్నాడు. బ్యాంక్‌కు రుణం ఎగ్గొట్టిన నేపథ్యంలో గురువారం రాత్రి నుంచి ఈడీ అధికారులు సోదాలు చేస్తూ లాకర్లను సీజ్ చేస్తుండటంతో, ప్రస్తుతం ఈ యూనిట్‌లో పని చేస్తున్న 900 మంది కార్మికుల ఉపాధి ప్రశ్నార్థకంగా మారింది. మహేశ్వరం మండలం రావిరాల రెవెన్యూ పరిధిలోని 1/1 సర్వే నెంబర్‌లో 170 ఎకరాల్లో రాజీవ్‌జెమ్స్ కంపెనీని (సెజ్) స్పెషల్ ఎకనామికల్ జోన్ కింద 2005 నవంబర్ 26న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఇక్కడ వజ్రాలను శుభ్రం చేసి, పాలిషింగ్ నాణ్యతతో కూడిన కటింగ్‌లతో దేశ విదేశాలకు ఎగుమతి చేసేవారు. నీరవ్‌మోడీ నిర్వాకంతో ప్రస్తుతం ఈ సెజ్‌లో చాలా మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడనున్నాయి.



కార్మికుల బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి : సీఐటీయూ

ఈడీ అధికారులు జెమ్స్ పార్క్ పరిశ్రమను తమ ఆధీనంలోనికి తీసుకుంటే అందులో పని చేసే 900 మంది కార్మికుల పరిస్థితి ఏంటని సీఐటీయూ జిల్లా నాయకులు దత్తునాయక్ ప్రశ్నించారు. కార్మికుల విషయంలో ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలని, వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, ఇంక్రిమెంట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒక్క కార్మికునికి అన్యాయం జరిగినా పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఆ కంపెనీని ప్రభుత్వమే నడిపించాలని సూచించారు.

నవచిత్రం

ఛలో విజయానందం



నాగశౌర్య, ఉషా ముల్పూరి, ప్రసాద్, వెంకీ, బుజ్జి, గౌతమ్

నాగశౌర్య, రష్మిక మండన్నా జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఛలో'. ఉషా ముల్పూరి నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ సందర్భంగా నిర్మాత చిత్రానికి పనిచేసిన 24 క్రాఫ్టలను సత్కరించారు. దర్శకుడు వెంకీ కుడుములకు కారు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ, సినిమా తీయాలంటే హీరో, హీరోయిన్, దర్శకుడు ఉంటే చాలు అనుకునేవాళ్ళం. కానీ మా ఐరా క్రియేషన్స్ ప్రారంభించాక తెలిసింది. తెర మీద కనిపించే వారి వెనుక వందలాది శ్రామికుల కష్టం ఉందని. సినిమా విజయం సాధిస్తే 24 విభాగాల వారిని సత్కరించాలని 'ఛలో' ప్రారంభం రోజునే నిర్ణయించుకున్నాం. అనుకున్నట్టే సక్సెస్ అయ్యింది. ఇక్కడికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐరా క్రియేషన్స్ ప్రారంభించడానికి దర్శకుడు వెంకీ కారణం కావడమే కాకుండా, మా బ్యానర్‌లో ఇంత మంచి చిత్రానికి దర్శకత్వం వహించినందుకు ఆయనకు కారును గిఫ్ట్‌గా ఇస్తున్నాం. మొదటి చిత్రంతోనే విజయ యాత్ర ప్రారంభించిన వెంకీ మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. ఈ చిత్రానికి పనిచేసిన వారికి, సపోర్ట్ చేసిన వారందరికీ కృతజ్ఞతలు' అని అన్నారు.

సినిమాకు వెళ్తాను అంటే నా తల్లిదండ్రులు డబ్బులిచ్చారు. నాగశౌర్య తల్లిదండ్రులు డబ్బులిచ్చి మరీ సినిమా తీశారు. వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేను. ఈ చిత్రం చేసే అవకాశం ఇవ్వడమే పెద్ద గిఫ్ట్. ప్రేక్షకులు బ్లాక్‌బస్టర్ హిట్ చేయడం డబుల్ గిఫ్ట్ అయితే, ఇప్పుడు నాకు కారు గిఫ్ట్ ఇవ్వడం మరిచిపోలేని గిఫ్ట్. నాగశౌర్య అనే వ్యక్తి నాకు పరిచయం కాకపోతే నాకీ జీవితం లేదు. సినిమాకు పనిచేసిన కెమెరామెన్ సాయి శ్రీరామ్, ఎడిటర్స్ చంటి, తమ్మిరాజు, మ్యూజిక్ డైరెక్టర్ స్వరసాగర మహతికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు. సినిమా విజయంలో భాగమైన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్' అని దర్శకుడు వెంకీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగశౌర్య, ప్రసాద్, బుజ్జి పాల్గొని తమ విజయానందాన్ని పంచుకున్నారు.



థమన్, వరుణ్ తేజ్, చిరంజీవి, వెంకీ అట్లూరి, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, బాపినీడు

తెలుగు చిత్ర సీమ గర్వపడే చిత్రం : చిరంజీవి

"తొలిప్రేమ' కాంటెంపరరీ లవ్ స్టోరీ. తెలుగు చిత్ర పరిశ్రమ గర్వపడే చిత్రం. ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తుంది' అని చిరంజీవి అన్నారు. వరుణ్ తేజ్, రాశీఖన్నా జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మించిన 'తొలిప్రేమ' చిత్రం ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శించబడుతున్న నేపథ్యంలో సినిమాను వీక్షించిన చిరంజీవి శుక్రవారం చిత్ర బృందాన్ని తన నివాసంలో అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'తొలిప్రేమ' వంటి పెద్ద సక్సెస్‌ను సాధించిన చిత్ర బృందానికి నా అభినందనలు. దర్శకుడు వెంకీ అట్లూరిని ప్రత్యేకంగా అభినందించాలి. నా బ్రదర్ పవన్ నటించిన 'తొలిప్రేమ' టైటిల్‌తో వస్తున్న సినిమా కావడంతో క్యూరియాసిటీ కలిగింది. చాలా ఇన్‌స్పైరింగ్‌గా అనిపించింది. అయితే ఇది పక్కా కమర్షియల్ చిత్రం. నటీనటులంతా పాతవాళ్లే. కానీ తెరకెక్కించిన విధానం చాలా కొత్తగా ట్రెండీగా ఉంది. కథ కన్నా సిచ్చ్యువేషనల్‌గానే సినిమా అంతా సాగుతుంది. ఇలా చేయడం డైరెక్టర్‌కి చాలా పెద్ద ఛాలెంజింగ్. ఇంత ఫ్రెష్‌గా ఉందంటే దర్శకుడు వెంకీ ఫ్రెష్ థాట్ వల్లే. ఓ కొత్త కోణంలో సినిమాను చూపించారు. ఇలాంటి దర్శకులు ఇండస్ట్రీకి అవసరం. కొత్తదనంతో కూడిన సినిమాలు రావడం వల్ల పక్క పరిశ్రమలు కూడా మన గురించి మాట్లాడుకుంటున్నాయి.

వరుణ్ తేజ్ ఎంతో మెచ్యూర్డ్‌గా నటించాడు. సినిమాలో వరణ్‌ని కాకుండా ఓ యంగ్ బాయ్‌ని చూస్తున్న ఫీలింగ్ కలిగింది. మూడు వేరియేషన్స్‌లో తనని తాను మలుచుకున్న తీరు సూపర్. ప్రేమ సన్నివేశాలు, ఇగో క్లాషెస్ సన్నివేశాల్లో వరుణ్, రాశీఖన్నా బాగా ఇన్‌వాల్వ్ అయి నటించి మనల్ని అందులో లీనమయ్యేలా చేశారు. కొన్ని సన్నివేశాల్లో వరుణ్ నటన, పలికించిన భావోద్వేగాలు చూసి మా ఫ్యామిలీ అంతా గర్వపడుతున్నాం.

తన ఎత్తుకు డాన్సులు ఎంత వరకు కుదురుతాయో అనుకున్నా, కానీ ప్రతీ స్టెప్‌ను అడాప్ట్ చేసుకుని బాగా చేశాడు. నాగబాబు గర్వపడే మూవ్‌మెంట్ ఇది. వాళ్ళనాన్న నాగబాబుకు వరుణ్ ఈ సినిమాతో మంచి గిఫ్ట్ ఇచ్చాడు. ఇందులో ఓ కొత్త రాశీఖన్నాను చూస్తాం. థమన్ సంగీతం సినిమాకు హైలైట్. కెమెరామెన్ జార్జి సినిమాను అద్భుతంగా చిత్రీకరించారు. అందంగా చూపించారు. చరణ్ అభిమానించే నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్. బడ్జెట్ విషయంలో రాజీపడకుండా నిర్మించారు' అని అన్నారు.


'నాకు యాక్టర్ అవ్వాలన్నా ఆలోచన పెదనాన్న చిరంజీవిని చూసే వచ్చింది. ఈ రోజు డాడీ (చిరంజీవి) వచ్చి మంచి మాటలు చెబుతుంటే చాలా సంతోషంగా ఉంది' అని వరుణ్ తేజ్ తెలిపారు.

దర్శకుడు వెంకీ అట్లూరి చెబుతూ, 'చిన్నప్పుడు 'స్టువర్ట్‌పురం పోలీస్ స్టేషన్' సినిమా టైమ్‌లో చిరంజీవిని చూశా. మళ్ళీ ఇన్నాళ్ళకు చిరంజీవి పక్కన కూర్చుని మాట్లాడే అవకాశం రావడం మరచిపోలేని అనుభూతి. ఆ ఆనందాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నా. ఆయన సినిమా చూసి, నచ్చి మమ్మల్ని ప్రశంసించడం చాలా సంతోషంగా ఉంది. చాలా గర్వపడుతున్నా. ఈ సినిమా సక్సెస్ మరింత బాధ్యతను పెంచింది' అని చెప్పారు.

'33 ఏండ్ల క్రితం సినిమాలు చేద్దామని పసుపులేటి రామారావు ద్వారా ఓ అభిమానిగా చిరంజీవిని కలిశాను. ఇన్నేండ్లకు చరణ్, పవన్, బన్నీ, ఇప్పుడు వరుణ్‌తో సినిమాలు చేసే అవకాశం లభించినందుకు హ్యాపీగా ఉంది' అని నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ తెలిపారు.

'నేను చిరంజీవికి పెద్ద అభిమానిని. ఆయన మమ్మల్ని అభినందించడం ఇంటర్ పాసై డిగ్రీ కాలేజ్‌కి వెళ్ళిన ఫీలింగ్ కలుగుతుంది' అని థమన్ అన్నారు.

పాతికేండ్లకు కొత్త హీరో దొరికాడు



నాగార్జున

'పాతికేండ్లు వెతికితే నాకో కొత్త హీరో దొరికాడు. అతనే నాగార్జున' అని రామ్‌గోపాల్ వర్మ అన్నారు. వర్మ దర్శకుడిగా మారి రూపొందించిన చిత్రం 'శివ'. నాగార్జున హీరోగా 1989లో వచ్చిన ఈ సినిమా అప్పట్లో ఓ ట్రెండ్ సెట్టర్. నాగార్జునను మాస్ హీరోగా నిలబెట్టిన చిత్రమిది. ఆ తర్వాత నాగార్జున, వర్మ కాంబినేషన్‌లో 'అంతం', 'గోవిందా గోవింద' చిత్రాలొచ్చాయి. దాదాపు పాతికేండ్ల తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో ప్రస్తుతం ఓ చిత్రం రూపొందుతోంది. ముంబయిలో శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. ఫిబ్రవరి 16న 'శివ' చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని తాజా సినిమాలో నాగార్జున యాక్షన్‌కు సంబంధించిన పలు స్టిల్స్‌ను వర్మ ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. 'ఈ రోజు ఫిబ్రవరి 16. కొన్నేండ్ల క్రితం ఇదే రోజు 'శివ' చిత్రీకరణ ప్రారంభించాను. ఇప్పుడు నేను తీస్తున్న కొత్త చిత్రంలోని నా కొత్త హీరో నాగ్ స్టిల్‌ను పంచుకుంటున్నాను. ఆయన నా బ్రాండ్ హీరో. పాతికేండ్లు వెతికిన తర్వాత నాకొక కొత్త హీరో దొరికాడు. అతనే ఇప్పటి వరకు చేయని రియలిస్టిక్ యాక్షన్ హీరోగా నటిస్తున్న నాగార్జున' అని వర్మ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. నాగార్జున సరసన మైరా సరీన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి 'గన్', 'సిస్టమ్' అనే పేర్లు పరిశీలనలో ఉన్నాయని సమాచారం.

పాటల సందడిలో చెన్నై చిన్నోడు



'చెన్నై చిన్నోడు' చిత్రం ఆడియో ఆవిష్కరణోత్సవ దృశ్యం

జి.వి.ప్రకాష్ కుమార్ హీరోగా నటించిన తమిళ చిత్రాన్ని 'చెన్నై చిన్నోడు' పేరుతో శూలిని దుర్గా ప్రొడక్షన్స్ పతాకంపై వి.జయంత్ కుమార్ తెలుగులో విడుదల చేస్తున్నారు. 'వీడి లవ్‌లో అన్నీ చిక్కులే' అనేది ట్యాగ్‌లైన్. నిక్కీ గల్రానీ, రక్షిత హీరోయిన్లుగా నటించగా, ఎం.రాజేష్ దర్శకత్వం వహించారు. జి.వి.ప్రకాష్ సంగీతం సమకూర్చిన ఈ చిత్ర తెలుగు పాటల విడుదల కార్యక్రమం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన ప్రతాని రామకృష్ణగౌడ్ పాటల సీడీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'చిత్ర పాటలు, ట్రైలర్ బాగున్నాయి. తమిళంలో సక్సెస్ అయిన ఈ చిత్రాన్ని తెలుగులో మంచి టైటిల్‌తో విడుదల చేస్తున్నారు. యంగ్ ఏజ్‌లో నిర్మాతగా మారిన జయంత్ కుమార్‌కు అభినందనలు. ఈ సినిమా సక్సెస్‌తో నిర్మాతకు మంచి భవిష్యత్ ఏర్పడాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'మా తాతగారి వల్ల సినిమాలపై ఆసక్తి ఏర్పడింది. తొలిసారిగా ఈ తమిళ చిత్రాన్ని అనువాదం చేస్తున్నాం. రాజీపడకుండా స్ట్రయిట్ సినిమాలా డబ్బింగ్ చేశాం. పూర్ణచారి పాటలన్నింటికీ అర్థవంతమైన సాహిత్యాన్ని సమకూర్చారు. ఆద్యంతం కడుపుబ్బా నవ్వించే చక్కని కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. ప్రకాష్ రాజ్ పోలీస్ పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. హీరో జీవా గెస్ట్‌రోల్‌లో కనిపిస్తారు. జి.వి.ప్రకాష్ నటనతోపాటు, సినిమాకు మంచి సంగీతాన్ని సమకూర్చారు. అందమైన ఫారెన్ లొకేషన్లలో పాటలు చిత్రీకరించారు. అతి త్వరలో సినిమాను విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం' అని నిర్మాత విజయ్ తెలిపారు. పూర్ణచారి చెబుతూ, 'తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా ఇందులో నాలుగు పాటలు రాశాను. సింగర్స్ కూడా బాగా పాడారు. సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నా' అని చెప్పారు.

ఈ కార్యక్రమంలో సాయివెంకట్, రాంకీ, సీనియర్ జర్నలిస్ట్ పసుపులేటి రామారావు, సింగర్స్ సంపత్, సాయిమాధవ్, మౌనికా రెడ్డి తదితరులు పాల్గొన్ని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

జోడీ కుదిరింది..



వెంకటేష్, శ్రియా

ఇటీవల 'అజ్ఞాతవాసి'లో గెస్ట్ రోల్‌లో మెరిసిన వెంకటేష్ నెక్ట్స్ తేజ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటించనున్న విషయం విదితమే. ఈ చిత్రం కోసం వెంకీ, శ్రియా ముచ్చటగా మూడోసారి జోడీ కట్టబోతున్నారు. గతంలో 'సుభాష్ చంద్రబోస్', 'గోపాల గోపాల' చిత్రంలో కలిసి నటించారు. తాజాగా ఈ చిత్రంలో వెంకీ సరసన కథానాయికగా శ్రియాను ఎంపిక చేశారని సమాచారం. తొలుత 'చెలియా' ఫేమ్ అదితిరావు హైదరీని హీరోయిన్‌గా తీసుకోవాలని భావించినప్పటికీ ఆమె డేట్స్ కుదరకపోవడంతో శ్రియాను ఫైనల్ చేశారట. ఫ్యామిలీ థ్రిల్లర్ నేపథ్యంలో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను జరుపుకోనుంది. ఇందులో వెంకటేష్ ప్రొఫెసర్‌గా నటిస్తుండగా, మరో హీరో నారా రోహిత్ ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి 'ఆట నాదే వేట నాదే' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని సమాచారం. ఇటీవల 'గాయత్రి'లో నటించిన శ్రియా ప్రస్తుతం 'నరగాసురన్', 'తడ్కా', 'వీర భోగ వసంతరాయలు' చిత్రాల్లో నటిస్తోంది.



దిశా పటానీ

మొత్తానికి అలా.. మేనేజ్ చేశా

'టైగర్ షరాఫ్ ఎనర్జీ లెవల్‌ని అందుకోవడం చాలా కష్టం. ఆయనతో డాన్స్ చేయడం ఎగ్జైటింగ్‌గా ఉంది' అని అంటోంది దిశా పటానీ. 'లోఫర్'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన దిశా ప్రస్తుతం హిందీలో 'బాఘి 2' చిత్రంలో నటిస్తోంది. టైగర్ షరాఫ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి అహ్మద్ ఖాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అనుభవాలను దిశా అభిమానులతో పంచుకుంటూ, 'ఈ చిత్రంలో నటిస్తున్నందుకు చాలా ఎగ్జైటింగ్‌గా ఫీలవుతున్నాను. మా కోస్టార్ టైగర్ షరాఫ్ డాన్స్ అద్భుతంగా చేస్తాడు. డాన్సుల్లో అతని ఎనర్జీ లెవల్ హై రేంజ్‌లో ఉంటుంది. నాకు డాన్స్ అంటే ఇష్టం. కానీ ఆయన ఎనర్జీని అందుకోవడం చాలా టఫ్‌గా అనిపించింది. దీని కోసమై చాలా హార్డ్ వర్క్ చేశాను. డిఫరెంట్ డాన్స్ స్టెప్స్ కూడా నేర్చుకున్నాను. ఆయనలా కాకపోయినా మొత్తానికి బాగానే మేనేజ్ చేశా. టైగర్ షరాఫ్ బాలీవుడ్‌లోనే వన్ ఆఫ్ ది బెస్ట్ డాన్సర్. దర్శకుడు అహ్మద్ ఖాన్ మంచి సపోర్టర్. ఆయన సహకారంతో బాగా నటించగలిగాను. ఈ నెల 21న చిత్ర ట్రైలర్ విడుదల కానుంది. ట్రైలర్ కోసం ఆతృతగా వెయిట్ చేస్తున్నా' అని తెలిపింది.

సైలెంట్ మెర్క్యూరీ..



కృతి సనన్



ప్రభుదేవా

ప్రభుదేవా ప్రస్తుతం ప్రయోగాత్మకంగా రూపొందే 'మెర్క్యూరీ' అనే సైలెంట్ చిత్రంలో నటిస్తున్నారు. 'పిజ్జా' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న కార్తీక్ సుబ్బరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. డైలాగ్స్ లేకుండా సైలెంట్ మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను ఏప్రిల్ 13న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పెన్ స్టూడియోస్, స్టోన్‌బెంచ్ ఫిల్మ్స్ పతాకంపై కార్తికేయన్ సంతానం నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంతోష్ నారాయణ్ సంగీతం సమకూరుస్తున్నారు. గతంలో కమల్ హాసన్, సింగీతం శ్రీనివాసరావుల కాంబినేషన్‌లో మాటల్లేకుండా 'పుష్పక విమానం' చిత్రం వచ్చిన విషయం విదితమే. ఇక తెలుగులో వెంకీ హీరోగా, 'భాగమతి' ఫేమ్ అశోక్ దర్శకత్వంలో కూడా ఈ తరహా చిత్రాన్ని రూపొందించేందుకు ప్లాన్ చేస్తున్నారట.

ఏక్ విలన్ 2లో..!

'వన్: నేనొక్కడినే', 'దోచేయ్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన కృతిసనన్ బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి 'హీరోపంతి', 'దిల్‌వాలే', 'రాబ్తా', 'బరేలీ కి బర్ఫీ' చిత్రాల్లో నటించి మెప్పించింది. కృతి ప్రస్తుతం దిల్జిత్ దోసాంజేతో కలిసి 'అర్జున్ పాటియాలా' చిత్రంలో నటిస్తోంది. దీంతోపాటు తాజాగా మరో బంపర్ ఆఫర్‌ను అందుకుంది. బాలీవుడ్‌లో భారీ విజయాన్ని సాధించిన 'ఏక్ విలన్' సీక్వెల్‌లో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట. 'ఏక్ విలన్ 2'గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన కృతి నటించనుంది. ఈ చిత్రానికి మోహిత్ సూరి దర్శకత్వం వహించనున్నారు. 'ఏక్ విలన్' చిత్రంలో సిద్ధార్థ్ సరసన శ్రద్ధా కపూర్ నటించిన విషయం విదితమే.

ఆసక్తికర సినిమాలు..



కంగనా రనౌత్

అమితాబ్ బచ్చన్, కంగనా రనౌత్.. ఒకరు బాలీవుడ్ మెగాస్టార్, మరొకరు లేడీ సూపర్ స్టార్. ఈ ఇద్దరూ కలిసి నటిస్తే ఆ సినిమాపై అంచనాలు ఆకాశమే హద్దు అవుతాయి. పైగా వీరిద్దరూ కలిసి ఓ ప్రాజెక్ట్‌ను అంగీకరించారంటే కచ్చితంగా అదొక వైవిధ్యమైన చిత్రమై ఉండాల్సిందే. అదే కోవలో తాజాగా ఈ ఇద్దరు కలిసి ఓ బయోపిక్‌లో నటించబోతున్నారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తొలి వికలాంగ మహిళ అరుణిమ సింగ్ జీవితం ఆధారంగా దర్శకుడు ఆర్.బాల్కీ ఓ బయోపిక్‌ను తెరకెక్కించబోతున్నారు. ఇందులో అరుణిమ పాత్రలో కంగనా నటించనుండగా, ఆమెకు మెంటర్‌గా అమితాబ్ బచ్చన్ నటించనున్నారని సమాచారం. ఇదిలా ఉంటే కంగనా, రాజ్‌కుమార్‌రావ్ కలిసి మరోసారి నటిస్తున్నారు. శైలేష్ ఆర్ సింగ్, ఏక్తా కపూర్ నిర్మించబోతున్న సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రంలో ఈ ఇద్దరూ జోడీ కట్టబోతున్నారు. గతంలో వీరిద్దరు కలిసి 'క్వీన్' చిత్రంలో నటించిన విషయం విదితమే. ఈ తాజా చిత్రానికి దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు తనయుడు ప్రకాష్ కోవెలమూడి దర్శకత్వం వహించనుండటం విశేషం. అన్నీ కుదిరితే ఈ చిత్రం మార్చిలో పట్టాలెక్కనుందట. కంగనా ప్రస్తుతం 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' చిత్రంలో నటిస్తోంది. క్రిష్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.

క్రైమ్ బేస్డ్ లవ్ స్టోరీ..



రాధా బంగారు, జొన్న పరమేష్

కార్టూనిస్ట్, రచయిత ఉలి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'నీ ప్రేమ కోసం'. జొన్న పరమేష్, రాధా బంగారు హీరోహీరోయిన్లు. మాస్టర్ గోవింద్ బోగోజు సమర్పణలో సరోవర్ ఫిల్మ్స్ పతాకంపై ఉప్పుల గంగాధర్ నిర్మిస్తున్నారు. ఈచిత్రం గురించి నిర్మాత గంగాధర్ మాట్లాడుతూ, 'రెండక్షరాల ప్రేమ రెండు మనసులను కలుపుతుంది. రెండు జీవితాలను నిండు నూరేండ్లు ఆనందమయం చేస్తుంది. అలాంటి ప్రేమ కోసం లైలా-మజ్ను, పార్వతి-దేవదాస్, అక్బర్ సలీం-అనార్కలీ వంటి ఎందరో ప్రేమికులు తమ జీవితాలను అర్పించారు. ఆ కోవకు చెందిన ఒక ప్రేమికుడి కథే ఈ చిత్రం. క్రైమ్ బేస్డ్ లవ్‌స్టోరీ ఇది. అన్ని కమర్షియల్ హంగులతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ప్రేమ, కుటుంబం, కులం, మతం, ఉగ్రవాదం, మావోయిజం వంటి పలు సమస్యలను స్పృశిస్తూ, ప్రేమకే ఒక ఛాలెంజ్‌గా నిలుస్తుందీ చిత్రం. నిర్మాణాంతర పనులు పూర్తి చేసుకుని త్వరలోనే సినిమాను విడుదల చేస్తాం' అని అన్నారు. మచ్చ రవీందర్, నంబి వేణుగోపాలాచార్య కౌశిక, కళ్యాణ్ చక్రవర్తి, కంప్యూటర్ ప్రభాకర్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వేమూరి చంద్రశేఖర్, ఎడిటర్: సంపత్‌రాజ్, సత్రాజ్, సంగీతం: కె.లక్ష్మణ్‌సాయి.

ముంపుపై పోరాటం...
నీటి వాటా కోసం ఆరాటం

పోలవరంపై ద్విముఖ వ్యూహం

- కొండూరి రమేశ్‌బాబు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో భారీగా ముంపు ప్రమాదం ఉందని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై పోరాటానికి పావులు కదుపుతున్నది. మరొకవైపు పట్టిసీమ, పోలవరం నీటి వాటా కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నది. రాష్ట్ర పునర్విభజన సందర్భంగా పోలవరం ప్రాజెక్టు ప్రధాన ఎజెండాగా మారింది. ఒక దశలో తెలంగాణ ఏర్పాటు కోసం పోలవరం ముంపు మండలాలను త్యాగం చేశారనే విమర్శలు కూడా వచ్చాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి రాగానే పార్లమెంటులో ప్రవేశపెట్టిన మొదటి బిల్లు కూడా పోలవరందే కావటం విశేషం. పోలవరం ముంపు ప్రాంతంలో ఉన్న పూర్వపు ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసినా అధికార టీఆర్ఎస్ పార్టీ నుంచి కానీ తెలంగాణ ప్రభుత్వం నుంచి కానీ ఎటువంటి ఆందోళన వ్యక్తం కాకపోవటంతో అటు కేంద్రంతో పాటూ ఏపీ ప్రభుత్వం కూడా ఊపిరి పీల్చుకున్నది. ఏపీలో విలీనం చేసిన మండలాలే కాకుండా తెలంగాణ భూభాగంలో భద్రాచలం ఎగువ భాగంలో కూడా ముంపు తీవ్రత ఎక్కువగా ఉంటుందని కొందరు విశ్రాంత ఇంజినీర్లు హెచ్చరించటంతో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచనలో పడింది. 45 లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో ఈ ప్రాజెక్టు రూపకల్పన చేయటంతో ముంపు ప్రభావంపై అనధికారిక అంచనాకు వచ్చింది. 1986 కేవలం 36 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినప్పుడే భద్రాచలం పట్టణం మునిగిపోవటమే కాక ఎగువన 100 కిలీమీటర్ల దూరం వరకూ నదికి ఇరువైపుల పలు గ్రామాలు మునిగిపోయాయి. పోలవరం ప్రాజెక్టు లేనప్పుడే ఇంత విపత్తు జరిగితే ఇక నిర్మాణం తర్వాత జరిగే నష్టం ఏ స్థాయిలో ఉంటుందోనని ఇంజినీర్లు అంచనా వేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి కూడా తీసుకువెళ్ళారు. అయినప్పటికీ మొదట ఆయన స్పందించలేదని తెలిసింది. ఒక దశలో ఈ అంశంపై ఆయన దాటవేత ధోరణి అవలంబించారు. ప్రాణహిత రీడిజైన్‌లో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని గోదావరి నదిపై చేపట్టిన తర్వాత ఏపీ నుంచి ఎటువంటి అభ్యంతరాలు ఉండవని భావించారు. ఏపీ ప్రభుత్వం కాళేశ్వరం జోలికి రాకుండా ఉండేందుకు వ్యూహాత్మక ప్రకటనలు కూడా చేశారు. పోలవరం కట్టుకోండంటూ బహిరంగ ప్రకటనలు చేశారు. ఇదంతా జరిగినా ఏపీ వైఖరిలో మాత్రం మార్పు రాలేదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏపీ ప్రభుత్వం గోదావరి బోర్డుకు, కేంద్ర జలవనరుల శాఖకు ఫిర్యాదు చేసింది. గోదావరిలో నీటి లభ్యత లేదని, బేసిన్‌లో ఉన్న తమ రాష్ట్ర అనుమతి లేకుండా దీనిని నిర్మిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నది. దీనితో తెలంగాణ వైఖరిలో కూడా మార్పు వచ్చింది. ప్రాజెక్టుల విషయంలో అమీ తుమీకి సిద్ధపడింది.

సుప్రీం, ఎన్జీటీలో కేసులు...

పోలవరం ముంపు విషయంలో సుప్రీం కోర్టులోనూ, ఎన్జీటీలోనూ దాఖలైన రిట్ పిటీషన్లలో తెలంగాణ రాష్ట్ర సర్కార్‌ను కూడా ప్రతివాదిగా పేర్కొనడంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ కేసుల్లో వైఖరి చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. ఒక స్వచ్ఛంద సంస్థ ఎన్జీఈలోనూ, సుప్రీం కోర్టులోనూ వేసిన పిటిషన్‌లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో భద్రాచలం దేవాలయంతో పాటూ పట్టణం పూర్తిగా మునిగిపోతుందని, ఎగువన ఉన్న దుమ్ముగూడెం ప్రాజెక్టు ఇన్‌టేక్ ప్రాంతం, అశ్వాపురం వద్ద నున్న హెవీ వాటర్ ప్లాంట్, మణుగూరు బొగ్గుగనులు, 100 కిలోమీటర్ల పరిధిలోని ఏడు మండలాల్లో మరో 100 గిరిజన గ్రామాలు ముంపునకు గురవుతాయని పేర్కొన్నది.



ఫైల్

శాస్త్రీయ ఆధారాలతో వేసిన ఈ పిటిషన్‌లోని అంశాలతో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా ఏకీభవించింది. ఇవే అంశాలతో కూడిన ఒక అఫిడవిట్‌ను రాష్ట్ర నీటిపారుదల శాఖలోని అంతరాష్ట్ర విభాగం ఎన్జీటీలోనూ, సుప్రీం కోర్టులోనూ దాఖలు చేసింది. అయితే తెలంగాణ అఫిడవిట్‌పై ఏపీ కొన్ని అభ్యంతరాలు లేవనెత్తింది. పోలవరం బ్యాక్ వాటర్‌తో జరిగే నష్టంపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకూ కేంద్ర జలవనరుల శాఖకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నది. కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి కూడా పోలవరం విషయంలో తెలంగాణ నుంచి ఎటువంటి అభ్యంతరాలు తమకు అందలేదని ఇటీవల రాజ్యసభలో తెలిపారు. దీనితో తెలంగాణ ప్రభుత్వం గురువారం ఢిల్లీలో జరిగిన జలవనరుల శాఖ సమావేశంలో పోలవరం ముంపుపై రాత పూర్వక ఫిర్యాదును అందచేసింది. తెలంగాణలో ముంపు నిర్ధారణ కోసం మళ్లీ సర్వే చేయించాలని కోరింది.

నీటి వాటా కోసం....

పోలవరం ప్రాజెక్టుతో పాటూ పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా బేసిన్‌కు తరలించే 80 టీఎంసీల నీటికి బదులుగా తెలంగాణలో 45 టీఎంసీల కృష్ణా నీటిని అదనంగా వినియోగించుకునే అవకాశం కల్పించాలని తెలంగాణ డిమాండ్ చేస్తున్నది. గత మూడేండ్లుగా పలు సందర్భాల్లో ఈ అంశాన్ని లేవనెత్తింది. గురువారం జరిగిన కేంద్ర జలవనరుల శాఖ సమావేశంలో కూడా దీనిపై వాదోపవాదాలు జరిగాయి. గోదావరి నదీ జలాల వివాదాల ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం పోలవరం నుంచి తరలించే నీటిలో ఎగువన ఉన్న కర్నాటక, మహారాష్ట్రకు నీటి వాటా ఉన్నదని, ఒప్పందం జరిగినప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న తెలంగాణ కు వాటా ఇవ్వలేమని ఏపీ స్పష్టం చేసింది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం తాత్కాలిక ఏర్పాటు కావటంతో ఈ నీటిలో కూడా వాటా ఇవ్వలేమని తెలిపింది. దీనికి తెలంగాణ సంతృప్తి చెందలేదు. పట్టిసీమ, పోలవరం వాటా కోసం పోరాటం తీవ్రతరం చేయాలని అవసరమైతే కేంద్ర జలవనరుల శాఖ మంత్రి అధ్యక్షతన జరిగే అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో దీనిని ప్రస్తావించాలని నిర్ణయించింది.

'చిన్న కందుకూరు' ఘ తలిపై హక్కుల కమిషన్‌కు టీ మాస్ ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యాదాద్రి భువనగిరి జిల్లా చిన్న కందుకూరు గ్రామంలో ఇటీవల జరిగిన ఘటనలపై తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక (టీ మాస్ ఫోరం) మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. గ్రామంలోని దళితులపై ఆరెస్సెస్‌కు చెందిన కట్టెగొమ్ముల రవీందర్‌రెడ్డి, కోకల సందీప్‌తోపాటు వారి అనుచరులు 30 మంది దాకా దాడి చేశారని తెలిపింది. దళితులను కులం పేరుతో దూషించి, అవమానపరిచారని ఫోరం నేతలు కమిషన్‌కు తెలిపారు. ఈ నేపథ్యంలో దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. దళితులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీ మాస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ, స్టీరింగ్ కమిటీ సభ్యులు కిల్లె గోపాల్, పైళ్ల ఆశయ్య, మన్నారం నాగరాజు, యాదాద్రి జిల్లా కన్వీనర్ కల్లూరి మల్లేశ్, బాధితులు కొంపెల్లి రాజు, ఎర్ర చంద్రయ్య, ఎర్ర సోమయ్య పాల్గొన్నారు.

కోర్టులో లొంగిపోయిన అక్రమాస్తుల నిందితుడు కట్టా

- జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలింపు
- ఏడు రోజుల కస్టడీ కోరిన ఏసీబీ
- ఇద్దరు బినామీలను విచారిస్తున్న అధికారులు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి



కోట్లాది రూపాయల అక్రమాస్తులను కలిగి ఉన్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటూ అజ్ఞాతంలోకి వెళ్లిన కట్టా పురుషోత్తంరెడ్డి శుక్రవారం ఏసీబీ ప్రత్యేక కోర్టులో లొంగిపోయాడు. అయితే,అతని బావమరిది శ్రీనివాస్‌రెడ్డి మాత్రం ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నాడు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ పూర్ణచంద్రరావు తెలిపిన వివరాల ప్రకారం ఆదాయానికి మించి రూ.25 కోట్లకు పైగా అక్రమాస్తులను సంపాదించిన హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి గతవారం రోజులుగా ఏసీబీకి చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్న విషయం తెలిసిందే. దేశం విడిచి పారిపోయే ప్రమాదం ఉందని ఏసీబీ అధికారులు ఇమిగ్రేషన్ విభాగానికి చేసిన విజ్ఞప్తి మేరకు అతనిపై లుక్‌అవుట్ నోటీసు కూడా జారీ అయ్యింది. అయితే, కట్టా దరొకితేగాని ఈ కేసులో మరిన్ని కీలక అంశాలు వెలుగు చూడవని ఎదురు చూస్తున్న ఏసీబీ అధికారులను కట్టా ముప్పు తిప్పలు పెట్టాడు. చివరికి శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో తన సమీప బంధువులతో కట్టా ప్రత్యక్షమయ్యాడు. ఏసీబీ అధికారులు చూస్తుండగానే కోర్టులోకి వెళ్లి న్యాయమూర్తి ముందు లొంగిపోతున్నట్టు తెలిపాడు. దీంతో,15 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి న్యాయమూర్తి ఆదేశించడంతో కట్టాను చంచల్‌గూడ జైలుకు తరలించారు. తమ ముందుగాక కోర్టులో వ్యూహాత్మకంగా లొంగిపోయిన కట్టా నుంచి అతని అక్రమాస్తులకు సంబంధించిన మరింత సమాచారాన్ని రాబట్టాల్సి ఉందని, అందుకు ఏడు రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ అధికారులు కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణను సోమవారానికి న్యాయమూర్తి వాయిదా వేశారు. కట్టా లొంగిపోయినంత మాత్రాన సరిపోదని, అతని బావమరిది వద్ద నిందితుడి అక్రమార్జనకు సంబంధించిన పూర్తి సమాచారం ఉన్నదని అనుమానిస్తున్న ఏసీబీ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి కోసం గాలింపు చర్యలను ఉధృతం చేశారు. వీరిద్దరి సమక్షంలోనే సాగర్ సొసైటీలోని కట్టా నివాసం, శ్రీనివాస్‌రెడ్డి ఇంటిని సోదా చేయాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. ఇదిలాఉంటే ఇప్పటికే అరెస్టయిన కట్టా బినామీలు యాదవరెడ్డి, నిషాంత్‌రెడ్డిలను ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారించారు. వీరి వద్ద నుంచి కట్టా అక్రమ పెట్టుబడులకు సంబంధించి మరింత సమాచారాన్ని రాబట్టడానికి ఏసీబీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇంకా వీరిని మూడు రోజుల పాటు విచారించాల్సి ఉన్నదని , తాము ఆశించిన సమాచారం వీరిద్దరి నుంచి రాబట్టగలమని ఏసీబీ అధికారులు విశ్వాసం వ్యక్తంచేశారు.

మార్క్‌ఫెడ్ ద్వారా ఎర్ర జొన్నలు కొనుగోలు

మద్దతు ధర క్వింటాలకు రూ. 2300 :

ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ మార్క్‌ఫెడ్ ద్వారా ఎర్ర జొన్నల కొనుగోలుకు రంగం సిద్ధం చేసినట్టు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారధి శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. మద్దతు ధర క్వింటాలుకు రూ. 2300 నిర్ణయించినట్టు తెలిపారు. ఈ ధర సోమవారం నుంచి అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. 45 రోజుల పాటు ఈ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ మేరకు నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ ఉన్న ఎర్ర జొన్నల వివరాలు సేకరించాలని, విఆర్‌వో, ఏఈవోలచేత సర్వే చేయించాలని కోరారు. ఇతర ప్రాంతాల నుంచి ఎర్రజొన్నలు దిగుమతి కాకుండా చూడాలని కోరారు. మూడు జిల్లాల్లో33 మండలాల్లో మొత్తం 27506 మంది రైతులు 51234 ఎకరాల్లో ఎర్ర జొన్న పంట సాగు చేసినట్టు తెలిపారు. ఈ పంట పండించిన రైతులకు టోకెన్లు జారీ చేయాలని, సదరు రైతులకే మార్కెట్‌లో ఎర్రజొన్నలు అమ్ముకునేందుకు అవకాశం కల్పించాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. సుమారు 87099 మెట్రిక్ టన్నుల జొన్నలు మార్కెట్ రావాల్సి ఉంటుందని అంచనా వేశారు.

వ్యాయమ టీచర్ల డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర వ్యాయమ విద్య ఉపాధ్యాయుల సంస్థ(పేట) 2018 సంవత్సరానికి గానూ రూపొందించిన డైరీని తెలంగాణ సాట్స్ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ...పేట రూపొందిచిన డైరీలో వ్యాయమ ఉపాధ్యాయులకు కావాల్సిన సమాచారమంతా ఉందని అన్నారు. ఈ సమాచారం విద్యార్థులకూ ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్, వ్యాయమ టీచర్ల సంఘం రాష్ట్ర నాయకులు సోమేశ్వర్‌రావు, బి.రాఘవరెడ్డి, బాలరాజు, శ్రీనివాస్‌మూర్తి పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొందుకు చేయుతనివ్వండి

మంత్రి పద్మారావుకు టెన్నిస్ క్రీడాకారిని వినతి

జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థికంగా సహకరించాలని క్రీడాశాఖ మంత్రి పద్మారావును టెన్నిస్ క్రీడాకారిణి కుమారి మలిశ్క కోరింది. ఈమేరకు తన తల్లిదండ్రులతో కలిసి శుక్రవారం మంత్రికి ఆమె వినతిపత్రం అందించింది.

ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్‌లో నాలుగో స్థానం కైవలం చేసుకున్న మలిశ్కను ఈ సందర్భంగా మంత్రి పద్మారావు, సాట్స్ చైర్మెన్ వెంకటేశ్వర్‌రెడ్డి అభినందించారు. ఆర్థికంగా సహాయం అందిస్తామని హామీనిచ్చారు.



చిన్న పరిశ్రమల్ని బ్రతికించండి

- ఎన్‌పీఏ గడువును 180 రోజులకు పెంచాలి
- కేంద్రానికి జాతీయ పారిశ్రామిక సంఘాల విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తమ కాళ్లపై తాము నిలబడేలా కేంద్రప్రభుత్వం విధానపర నిర్ణయాలు తీసుకోవాలని పలు జాతీయ పారిశ్రామిక సంఘాలు విజ్ఞప్తి చేశాయి. దక్షిణాది రాష్ట్రాల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక సంఘాల సమావేశం ఈనెల 14, 15 తేదీల్లో చెన్నైలో జరిగింది. ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎమ్ఈ) జాతీయ అధ్యక్షులు ఎ ప్రశాంత్‌కుమార్ రెడ్డి, తమిళనాడు స్మాల్ అండ్ టినీ ఇండస్ట్రీస్ అసోసియేషన్ (టీఎఎన్ఎస్‌టీఐఏ) సి బాబు, కర్నాటక స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ (కెఎఎస్ఎస్ఐఏ) హన్మంత్‌గౌడ్, కేరళ స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ (కెఎస్ఎస్ఐఏ) మాజీ అధ్యక్షులు హనుమంతప్పల సంయుక్తాధ్వర్యంలో జరిగిన ఈ సమావేశాల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొన్నారు. బ్యాంకుల్లో ఆస్తుల్ని తనఖాపెట్టి, వడ్డీలకు రుణాలు తీసుకొని పరిశ్రమల్ని స్థాపిస్తే...బ్యాంకర్లు తమను దోషులుగా చూస్తున్నారని పలు రాష్ట్రాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఎస్ఎమ్ఈ జాతీయ అధ్యక్షులు ఎ ప్రశాంత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ 90 రోజుల్లో బ్యాంకు వాయిదాలు చెల్లించకుంటే పరిశ్రమల్ని నిరర్ధక ఆస్తుల జాబితా (ఎన్‌పీఏ)గా ప్రకటించి, ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడం దుర్మార్గమని అన్నారు. చిన్న పరిశ్రమలు స్థాపించిన వెంటనే లాభాలను ఆర్జించలేవని, వాటికి కొంత సమయాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్‌పీఏ ప్రకటించడానికి బ్యాంకులు ఇస్తున్న 90 రోజుల గడువు సరికాదని, ముందస్తు నోటీసు పీరియడ్‌ను 180 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్‌పీఏ అయిన పరిశ్రమలు తమ ఆస్తుల్ని స్వచ్ఛందంగా అమ్ముకుని, బ్యాంకు రుణం తీర్చే అవకాశాన్ని కల్పించాలని కోరారు. బ్యాంకులు వేలం వేయడం వల్ల పారిశ్రామికవేత్తల వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలగడంతో పాటు సొసైటీలో తలెత్తుకోలేని పరిస్థితుల్ని కల్పించవద్దని విజ్ఞప్తి చేశారు. రుణాలు చెల్లించడానికి తగినంత గడువు ఇవ్వకుండా ఎన్‌పీఏలుగా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వరంగ సంస్థలు, బహుళజాతి సంస్థలు తప్పనిసరిగా చిన్న, మధ్యతరహా పరిశ్రమల నుంచే 50 శాతం ఉత్పత్తుల్ని కొనుగోలు చేసేలా కేంద్రప్రభుత్వం చట్టంలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. టీఎఎన్ఎస్‌టీఐఏ అధ్యక్షులు సి బాబు మాట్లాడుతూ పారిశ్రామికంగా సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందుతోందని, దాన్ని అందుకోవడంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక యాజమాన్యాలు నానా అవస్థలు పడుతున్నాయని చెప్పారు. ఈ తరహా పోటీని తట్టుకొని ఆర్థికంగా నిలబడటం చాలా కష్టమని, దానికి తోడు బ్యాంకర్లు పరిశ్రమ స్థాపించిన మరుసటి నెలనుంచే రుణాల చెల్లింపులకు వత్తిడులు తేవడం భావ్యం కాదన్నారు. ఎన్‌పీఏ గడువును 90 రోజుల నుంచి 180 రోజులకు పెంచేందుకు రిజర్వుబ్యాంకు అంగీకరించిందని, కానీ కేంద్రప్రభుత్వం ఆ మేరకు ఇంకా ఉత్తర్వులు ఇవ్వలేదని వివరించారు. ఈ మేరకు దక్షిణాది పారిశ్రామిక సంఘాలన్నీ ఉమ్మడిగా కేంద్రప్రభుత్వానికి లేఖ రాయాలని సమావేశంలో నిర్ణయించారు.

టీఆర్టీ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక హెల్ప్‌డెస్క్
- పరీక్షలు పూర్తయ్యేవరకు అభ్యర్థులకు అందుబాటులో
- సీజీజీ అధికారులతో టీఎస్‌పీఎస్సీ సమావేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) రాతపరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారమే ప్రకటించిన తేదీల్లో టీఆర్టీ రాతపరీక్షలు జరుగుతాయని స్పష్టం చేసింది. శుక్రవారం టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి అధ్యక్షతన సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నిమ్జే, ఇతర అధికారులతో సమావేశం జరిగింది. టీఆర్టీ దరఖాస్తుల్లో వస్తున్న సమస్యలపై చర్చించారు. అభ్యర్థుల ఫిర్యాదులను ప్రధానంగా చర్చించి పరిష్కార మార్గాలపై దృష్టి సారించారు. పీడీఎఫ్ రూపంలో దరఖాస్తులను సమర్పించిన తర్వాత ఆ వివరాలను మార్చడానికి అవకాశముండబోదని సీజీజీ స్పష్టం చేసింది. 31 జిల్లాల ప్రకారం దరఖాస్తు చేసిన అభ్యర్థులు పది జిల్లాల ప్రకారం దరఖాస్తులను సవరణ చేయడానికి ఇబ్బందులు తలెత్తుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్, సీజీజీ డైరెక్టర్ రాజేంద్ర నిమ్జే ఓ ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థి ఓటీఆర్ వివరాల్లో తప్పుల్లేకుండా మార్పులు చేయాలని కోరారు. హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సమయంలోనే 31 జిల్లాలను 10 జిల్లాలుగా మార్చుకోవాలని సూచించారు. ఆ సమయంలో 31 జిల్లాల నుంచి 10 జిల్లాలకు సంబంధించిన అంశమే మార్చుకోవడానికి అవకాశముంటుందని తెలిపారు. టీఆర్టీ అభ్యర్థుల సమస్యలు పరిష్కారం కోసమే ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. టీఆర్టీ రాతపరీక్షలు పూర్తయ్యే వరకు అభ్యర్థులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. రోజూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు అభ్యర్థులకు సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. ఏ సమస్యలున్నా అభ్యర్థులు హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని కోరారు. 8333923740 నెంబర్‌కూ ఫోన్ చేయొచ్చని సూచించారు. helpdesk@tspsc.gov.in మెయిల్‌కు వివరాలు పంపొచ్చని తెలిపారు. పరీక్షలు పూర్తయినా కులం, జెండర్ వంటి వివరాలను మార్చుకోవడానికి అవకాశముందని పేర్కొన్నారు. సబ్జెక్టు, మీడియం వంటి వివరాలను ఇప్పటికే సవరణ చేశారని, మరోసారి మార్చేందుకు అవకాశం లేదని తెలిపారు.

టీఆర్టీ రాతపరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ తీసుకునే నిర్ణయాలపై అభ్యర్థులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈనెల 19వ తేదీ నుంచి టీఆర్టీ హాల్‌టికెట్లను జారీ చేస్తామని టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈనెల 24 నుంచి టీఆర్టీ రాతపరీక్షలు ప్రారంభం కానున్నాయి.

దక్షిణాది రాష్ట్రాలకు మోడీ అన్యాయం : చెరకు

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

దక్షిణాది రాష్ట్రాలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ కేంద్రబడ్జెట్లో అన్యాయం చేశారని తెలంగాణ ఇంటిపార్టీ అధ్యక్షులు చెరకు సుధాకర్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సమితి ద్రోహుల పార్టీగా మిగిలిపోనుందన్నారు. ఢిల్లీకి పోయి మోడీని సీఎం కేసీఆర్ ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ తన కుటుంబంలోని మరొకరిని పెద్దల సభకు పంపుతున్నారని అన్నారు. మేధావులతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ పై చర్చిస్తామన్నారు. ఆంధ్రా కోసం పవన్ కళ్యాణ్ చేస్తున్న ఆందోళన సమంజసమయినదని దానికి తమ పార్టీ మద్దతును ఆయన ప్రకటించారు. ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాలకు చెందిన సందీప్‌ను రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమిస్తూ ప్రకటించారు. తమ పార్టీలో చేరిన 70 మందికి పార్టీ కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్ దొమ్మాట వెంకటేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఇంద్రకరణ్‌కు కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు

హైదరాబాద్: : రాష్ట్ర గృహ నిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా హౌజింగ్ కార్పొరేషన్ చైర్మెన్ మడుపు భూంరెడ్డి, గృహ నిర్మాణ శాఖ స్పెషల్ సీయస్ చిత్ర రామచంద్రన్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శివశంకర్, న్యాయ శాఖ కార్యదర్శి నిరంజన్ రావు, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కేసీఆర్‌కు జీవన్‌రెడ్డి కృతజ్ఞతలు

హైదరాబాద్: గతంలో ఎర్రజొన్న రైతుల సమస్యలను ఎవరూ పట్టించుకోలేదని ఇప్పుడు వారికి టీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచిందని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఎర్రజొన్నలకు రూ.2300 మద్దతుధర ప్రకటించిన కేసీఆర్‌కు ఆయన కతజ్ఞతలు తెలిపారు. సోమవారం నుంచి కొనుగోళ్లు కూడా ప్రారంభమవుతాయన్నారు.

కేసీఆర్ బర్త్‌డే వీడియో సాంగ్ విడుదల

ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా టీఆర్ఎస్ యూత్ వింగ్ తయారు చేసిన ఆడియో, వీడియో సాంగ్ ఆల్బమ్‌ను ఎంపీ కవిత ఆవిష్కరించారు.

త్రీఆర్స్ కొనసాగింపు!

- మార్చి రెండో వారం వరకూ...
- పరీక్షల సమయంలో వద్దంటున్న టీచర్లు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

విద్యార్థులకు అభ్యాసన సామర్థ్యాలను పెంచేందుకు నిర్వహించిన త్రీఆర్స్ కార్యక్రమాన్ని మరింతకాలం పొడిగించాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తున్నది. డిసెంబర్‌లోనే ఈ కార్యక్రమం ముగిసినా, ప్రస్తుతం దీన్నిమార్చి వరకూ కొనసాగించాలని యోచిస్తోంది. దీనిపై ఇప్పటికే జిల్లా విద్యాశాఖాధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశముంది. అయితే పరీక్షల సమయంలో ఇలాంటి ఆలోచన వద్దని ఉపాధ్యాయులు వారిస్తున్నారు.

త్రీఆర్స్ నిర్వహణపై జనవరి మొదటి వారంలో రాష్ట్ర మానిటరింగ్ కమిటీ బృందం రాష్ట్రంలోని 1,226 పాఠశాలలను సందర్శించింది. ఈ కార్యక్రమ నిర్వహణతో విద్యార్థులకు పెద్దగా ప్రయోజనం చేకూరలేదని, దీనిపై ఉపాధ్యాయులు పెద్దగా దృష్టి సారించకపోవడమే ప్రధాన కారణంగా కమిటీ తన నివేదికలో పేర్కొన్నది. త్రీఆర్స్‌ను మార్చి రెండో వారం వరకూ కొనసాగించాలని సూచించింది. ఆగష్టులో ప్రారంభమైన త్రీఆర్స్ రాష్ట్రంలో 60రోజుల పాటు బడుల్లో ప్రత్యేకంగా తరగతులు నిర్వహించి, వెనుకబడిన విద్యార్థులకు చదవడం, రాయడం, లెక్కించడం నేర్పించారు. ఈకాలంలో 40శాతం మంది విద్యార్థుల్లో కొంతమెరుగైన ఫలితాలు వచ్చాయి. అయితే అభ్యసన సామర్థ్యంలో మార్పు రాకపోవడానికి బాధ్యులుగా ఎవ్వరినీ చేయలేదు. మార్చి రెండోవారం వరకూ(నెలరోజులు) కొనసాగించి, మార్పు రాకుంటే దానికి ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, స్పెషల్‌ఆఫీసర్లను బాధ్యులను చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. ప్రధానంగా ప్రాథమిక పాఠశాలలపై దృష్టి పెడుతున్నట్టు తెలుస్తోంది. తెలుగులో ఒత్తుల పదాలు, వాక్యాలు, పేరాలను నేర్పడానికి అవసరమైన కృత్యాలపైన అవగాహన పెంచాలని భావిస్తున్నారు. అవకాశముంటే రాష్ట్రస్థాయిలో ఎస్ఎస్ఏ సెక్టోరల్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చి, వారి ద్వారా మరోసారి మండల స్థాయిలోనూ శిక్షణ ఇప్పించాలని రాష్ట్ర మానిటరింగ్ కమిటీ విద్యాశాఖకు సూచించింది. మొదటి త్రీఆర్స్ పరీక్షల్లో, సీసీఈ విధానం అమలులో 55 ప్రభుత్వ పాఠశాలలు మంచి ప్రతిభను కనబరిచాయి. మరో 50స్కూళ్లపై దృష్టి సారించాలని కమిటీ నివేదికలో పేర్కొన్నది. 201 కేజీబీవీల్లో కమిటీ సందర్శించగా, వీటిలో 21పాఠశాలలు మెరుగ్గా, మరో 12 పాఠశాలలపై దృష్టి పెట్టాలని సూచించింది. సందర్శించిన 89మోడల్ స్కూళ్లలోనూ రెండుమెరుగ్గా, మరో మూడింటిపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని నివేదికలో పేర్కొన్నారు. రెండో విడుతలో వెనుకబడిన పాఠశాలలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని భావిస్తున్నారు. అయితే మొదటి విడుత త్రీఆర్స్‌లో మధ్యాహ్నం వరకూ సబ్జెక్టుల బోధన, మధ్యాహ్నం నుంచి త్రీఆర్స్ తరగతులు నిర్వహించారు. ప్రస్తుతం పరీక్షల సమయం కావడంతో సాయంత్రం వరకూ తరగతుల నిర్వహణకే ఉపాధ్యాయులు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ సమయంలో మళ్లీ త్రీఆర్స్ తరగతులు నిర్వహించాలంటే కష్టమని వారు చెబుతున్నారు.



త్రీఆర్స్ కొనసాగుతోంది: జి కిషన్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్

త్రీఆర్స్ మొదటి విడుతలో ఆశించిన ఫలితాలు రాలేదు. విద్యార్థులకు ప్రాథమికంగా చదవడం, రాయడం రాకుండా వారికి పాఠాలు ఎంత చెప్పినా ఉపయోగం ఉండదు. కాబట్టి త్రీఆర్స్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాం. అయితే పాఠశాలల సమయాన్ని బట్టి, త్రీఆర్స్‌కు తరగతులు కొనసాగించాలని చెప్పాం.



షార్ట్
76
(44 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లు)

244 పరుగుల లక్ష్యం.. వన్డేల్లోనూ ఇది మంచి స్కోరే. అలాంటిది టీ20ల్లో 244 పరుగుల లక్ష్యాన్నీ ఆసీస్ ఊదిపారేసింది. మరో ఏడు బంతులు మిగిలి ఉండగానే ఛేదించేసింది. సిక్సర్లు, ఫోర్ల మోతతో దద్దరిల్లిన ఆక్లాండ్‌లో ఆస్ట్రేలియా టీ20 క్రికెట్‌లో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన రికార్డు సృష్టించింది. వార్నర్ (59), షార్ట్ (76)లు ఆస్ట్రేలియాను విజయ పథాన నడపగా.. కివీస్ తరఫున మార్టిన్ గప్టిల్ (109) శతకం వృథా అయ్యింది.

లక్ష్యం 244.. అయితే ఏంటీ!

- 18.5 ఓవర్లలోనే ఛేదించిన ఆస్ట్రేలియా
- వార్నర్, షార్ట్ వీరవిహారం
- గప్టిల్ మెరుపు శతకం వృథా

ముక్కోణపు టీ20 సిరీస్

నవతెలంగాణ-ఆక్లాండ్



మార్టిన్ గప్టిల్
105
(54 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్స్‌లు)

సిక్సర్ల మోతతో ఆక్లాండ్ దద్దరిల్లిపోయింది. కివీస్, ఆసీస్ బ్యాట్స్‌మెన్ వీరంగంతో బౌండరీలు చిన్నబోయాయి. హైలైట్స్‌ను తలపించిన టీ20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా రికార్డు లక్ష్యాన్ని ఛేదించింది. డెవిడ్ వార్నర్ (59, 24 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), జాన్ మాథ్యూ షార్ట్ (76, 44 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగటంతో 244 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా మరో ఏడు బంతులుండగానే ఛేదించింది. మార్టిన్ గప్టిల్ (105, 54 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్స్‌లు) శతక మెరుపులు వృథా అయ్యాయి. ఐదు వికెట్ల తేడాతో రికార్డు విజయం సాధించిన ఆస్ట్రేలియా ముక్కోణపు (ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) టీ20 సిరీస్ ఫైనల్లో ప్రవేశించింది!.ఈ మ్యాచ్‌లో 32 సిక్సర్లు నమోదు కాగా, ప్రపంచ రికార్డు సమమైంది.

అటు వార్నర్, ఇటు షార్ట్ : కొండంత లక్ష్యం ముందుంది. ప్రత్యర్థి బౌలింగ్ నాణ్యమైనదే. ఇలాంటి పరిస్థితుల్లో 120 బంతుల్లో 244 పరుగులు ఎంతటి జట్టుకైనా కష్టమే. కానీ ఆస్ట్రేలియా ఈ సవాల్‌ను మరో కోణంలో చూసింది. ఓపెనర్లు డెవిడ్ వార్నర్ (59), జాన్ మాథ్యూ షార్ట్ (76)లు విజృంభించగా కివీస్ చిన్నబోయింది. పోటీ పడి బౌండరీలు బాదిన ఓపెనర్లు స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. వార్నర్ ఐదు సిక్సర్లతో చెలరేగగా, షార్ట్ సైతం 8 ఫోర్లతో రంకెలేశాడు. వీరిద్దరి జోరుతో 9 ఓవర్లలోనే ఆసీస్ స్కోరు 100 పరుగులు దాటేసింది. వార్నర్ నిష్క్రమణ తర్వాత క్రిస్ లిన్ (18) సైతం వెంటనే వికెట్ కోల్పోయాడు. షార్ట్‌తో కలిసి మాక్స్‌వెల్ (31, 14 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. మిడిల్ ఓవర్లలో 18 బంతుల పాటు బౌండరీ ఇవ్వని న్యూజిలాండ్.. మ్యాచ్‌ను తన చేతుల్లోకి తీసుకొన్నది. కానీ 17వ ఓవర్లో ఒక్కసారిగా కథ మారిపోయింది. 24 బంతుల్లో 42 పరుగులు చేయాల్సిన తరుణంలో బెన్ వీలర్ వేసిన ఆ ఓవర్ తొలి బంతి నో బాల్ కాగా... దాన్ని ఫించ్ సిక్స్‌గా మలిచాడు. తర్వాతి బంతిని సైతం బౌండరీ దాటించాడు. ఒక్క బంతితోనే బౌలర్‌ను మార్చివేసినా ఫలితంలో మార్పు లేదు. కానీ అప్పటికే సమీకరణం 23 బంతుల్లో 29 పరుగులకు వచ్చేసింది. ట్రెంట్ బౌల్ట్‌ను సైతం ఫించ్ ఓ ఫోర్, సిక్సర్ బాదాడు. 14 బంతుల్లోనే 36 పరుగులు పిండుకున్న ఫించ్ విశ్వరూపం చూపించాడు. 18వ ఓవర్ ఐదో బంతిని సిక్సర్‌గా సంధించిన ఫించ్ లాంఛనాన్ని పూర్తి చేశాడు. మూడేసి ఫోర్లు, సిక్స్‌లతో చెలరేగిన ఫించ్ మిడిల్ ఆర్డర్‌లో సత్తా చాటాడు. కివీస్ బౌలర్లలో వీలర్ 3.1 ఓవర్లలో 64 పరుగులు ఇచ్చుకోగా, బౌల్ట్ 3.5 ఓవర్లలో 42 పరుగులు సమర్పించుకున్నాడు. గ్రాండ్‌హోమె సైతం 3.5 ఓవర్లలో 56 పరుగులు కోల్పోయాడు.

గప్టిల్ గర్జన : టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్‌కు ఓపెనర్ మార్టిన్ గప్టిల్ (105) మరో సెంచరీ అందించాడు. సహచర ఓపెనర్ కొలిన్ మన్రో (76, 33 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లు)లతో కలిసి ఆకాశమే హద్దుగా చెలరేగిన గప్టిల్ 49 బంతుల్లోనే శతకబాదాడు. అర డజను సిక్సర్లు, ఫోర్లు కొట్టిన మన్రో కంగారూ బౌలర్లను ఉతికారేశాడు. మరో ఎండ్‌లో గప్టిల్ ఏకంగా 9 సిక్స్‌లు కొట్టాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 10.4 ఓవర్లలో 132 పరుగులు జోడించారు. మన్రో నిష్క్రమించినా గప్టిల్ గర్జన ఆగలేదు. మిడిల్ ఆర్డర్‌లో ఎవ్వరూ మెరువకపోయినా, ఆఖర్లో రాస్ టేలర్ (17) ఆరు బంతుల్లోనే రెండు సిక్సర్లు కొట్టాడు. గప్టిల్ టీ20ల్లో రెండో సెంచరీ నమోదు చేయగా.. న్యూజిలాండ్ ఆరు వికెట్లు కోల్పోయి 243 పరుగులు చేసింది. ఆసీస్ బౌలర్లలో అండ్రూ టై 64 పరుగులు, రిచర్డ్‌సన్ 40 రన్స్, స్టాన్‌లెక్ 43 పరుగులు సమర్పించుకున్నారు.



డెవిడ్ వార్నర్
59
(24 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు)

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ : 243/6 (మార్టిన్ గప్టిల్ 109, కొలిన్ మన్రో 76, రాస్ టేలర్ 17, అండ్రూ టై 2/64)
ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ : 245/5 : (జాన్ మాథ్యూ షార్ట్ 76, డెవిడ్ వార్నర్ 59, అరోన్ ఫించ్ 36, ఇశ్ సోధి 1/35)



పాతిక లక్షల క్యాచ్ పట్టిన ఆనందంలో కివీస్ అభిమాని మిచెల్

ఆ క్యాచ్ విలువ రూ.24 లక్షలు

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ధనాధన్ టీ20లో ఆటగాళ్లు సిక్సర్ల వర్షం కురిపించగా.. రాస్ టేలర్ సిక్సర్ ఓ అభిమానిపై కాసుల వర్షం కురిపించింది. ఈ మ్యాచుల్లో ఆటగాళ్లు పట్టిన క్యాచులతో వికెట్లు కూలితే, ఈ అభిమాని క్యాచ్‌కు ఏకంగా కాసులు రాలాయి. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో 19.5 ఓవర్‌లో టేలర్ డీప్ మిడ్ వికెట్ మీదుగా భారీ సిక్సర్ సంధించాడు. ఆ బంతిని స్టాండ్స్‌లో నిల్చోన్న మిచెల్ గ్రిమ్‌స్టోన్ ఒంటిచేత్తో పట్టేశాడు. సిరీస్ శీతల పానియాల ప్రచారదారు ఈ 20 ఏండ్ల అభిమానికి 50 వేల న్యూజిలాండ్ డాలర్లు ప్రకటించింది. అందరిలాగే తనూ క్యాచ్ అందుకొన్నా.. వెతుక్కొంటూ వచ్చిన బహుమానంతో మిచెల్ సంభ్రమాశ్చర్యానికి లోనయ్యాడు. అన్నట్టు మిచెల్ స్థానిక విశ్వవిద్యాలయంలో విద్యార్థి. సాధారణంగా స్టాండ్స్‌లోకి ఆటగాళ్లు కొట్టిన బంతుల్ని క్యాచులు అందుకోవటం అభిమానులకు ఎంతో సరదా. ప్రతి మ్యాచ్‌లోనూ ఈ రకమైన వినోదం చూస్తూనే ఉంటాం. కానీ మిచెల్ మిక్కిలి లక్కీ. అందుకే క్యాచ్‌తో పాటు క్యాష్‌ప్రైజ్ పట్టేశాడు. మ్యాచ్ అనంతరం బాల్, గ్లోవ్స్‌ను కూడా రాస్ టేలర్ ఈ అభిమానికి గుర్తుగా ఇచ్చాడు.



విరాట్ కోహ్లి 129*

విరాట్ వీరంగం

ఆఖరు వన్డేలో ఎనిమిది వికెట్ల తేడాతో భారత్ ఘనవిజయం

- 5-1తో సిరీస్ సొంతం
- కోహ్లి అజేయ సెంచరీ
- సమిష్టిగా రాణించిన బౌలర్లు

ఉపఖండాన్ని తలపించే సెంచూరియన్ వేదికగా వన్డేల్లో మరో ఘన విజయాన్ని అందుకున్నది కోహ్లి సేన. తొలుత భారత బౌలింగ్ బృందం సమిష్టిగా రాణించటంతో సఫారీలు పరుగులు చేయటానికి ఆపసోపాలు పడ్డారు. సిరీస్‌లో తొలిసారి బంతి అందుకున్న శార్దూల్ సహా మణికట్టు మాయగాడు చాహల్ కీలక వికెట్లు తీసి ప్రత్యర్థి శిబిరంలో వణుకు పుట్టించారు. నిర్ణీత ఓవర్లు పూర్తిగా ఆడకముందే కుప్ప కూలిన సఫారీలు 204 పరుగులు చేశారు. లక్ష్య ఛేదనలో పరుగుల యంత్రం విరాట్ కోహ్లి శతకంతో విజృంభించాడు. భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం అందుకున్న వేళ. అజింక్య రహానె తోడుగా.. అజేయంగా నిలిచాడు. ఆరు వన్డేల సిరీస్ 5-1తో భారత్ వశమైంది.

నవతెలంగాణ-సెంచూరియన్

ఆఖరు వన్డేలోనూ కోహ్లి సేనలో అదే నిలకడ. బౌలర్లలో అదే ఉత్సాహం. పర్యాటక జట్టుదే పైచేయి. ఆరు వన్డేల సిరీస్‌ను ఇది వరకే 4-1తో నెగ్గిన భారత్ తుది పోరులోనూ ఆధిపత్యం చలాయించింది. సెంచూరియన్ వేదకగా ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపొంది 5-1తో సిరీస్ గెల్చుకున్నది. దాటిగా బౌలింగ్ చేసిన భారత బౌలర్లు తొలుత సఫారీలను 46.5 ఓవర్లకే ఆలౌట్ చేసి, 204 పరుగులకే పరిమితం చేశారు. ఛేదనలో ఓపెనర్లు విఫలమైనా.. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, విరాట్ కోహ్లి (129 నాటౌట్) నిప్పులు చెరగటంతో ఛేదనలో భారత్ ఇరగదీసింది. అజింక్య రహానె (34 నాటౌట్) అజేయంగా సారథికి సహకారం అందించాడు. సిరీస్ ఆసాంతం మంచి నీళ్ల ప్రాయంలా పరుగులు పిండుకున్న పరుగుల యంత్రం విరాట్ కోహ్లి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు. భారత్ దక్షిణాఫ్రికాల మధ్య మూడు మ్యాచుల టీ20 సిరీస్ ఆదివారం జోహనెస్‌బర్గ్‌లో జరిగే తొలి మ్యాచ్‌తో మొదలవ్వనున్నది.

విరాట్ అజేయంగా : ఛేదించే గలిగే లక్ష్యాన్నే కోహ్లి సేనకు నిర్దేశించగలిగింది దక్షిణాఫ్రికా. ఆదిలోనే శిఖర్ ధావన్ (18), రోహిత్ శర్మ (15) స్వల్ప స్కోరుకే లుంగిసాని ఎంగిడికి వికెట్ సమర్పించుకున్నారు. అయితే ఓపెనర్లు విఫలమైనా.. రన్ మెషీన్ విరాట్ కోహ్లి తనదైన ధనాధన్ ఆటతో చెలరేగాడు. పొట్టి పోరును తలపించేలా పరుగుల వరద పారించిన కోహ్లి దూకుడుకు సఫారీల బౌలర్లు చేష్టలుడిగి చూస్తుండిపోయారు. స్పిన్నర్, పేసర్ అనే తేడా లేకుండా దొరికిన బంతిని దొరికినట్టు బాదిన టీమ్ ఇండియా సారథి 19 ఫోర్లు సహా రెండు భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. 82 బంతుల్లోనే సిరీస్‌లో మూడోది ఓవరాల్‌గా 35వ శతకం అందుకున్నాడు. 129 పరుగులతో అజేయంగా నిలిచి ఆఖరు వన్డేలో భారత్‌కు విజయాన్ని ఒంటి చేత్తో విజయాన్ని అందించిన సారథికి.. రహానె 34 పరుగులతో చక్కటి సహకారం అందించాడు.

బౌలింగ్ అదిరే : సఫారీతో నామమాత్రపు ఆఖరు వన్డేలో టీమ్ ఇండియా బౌలర్లు ఆకట్టుకున్నారు. 4-1తో సిరీస్ సొంతమైనా ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించలేదు. సిరీస్‌లో తొలి సారి తుది జట్టులో చోటు దక్కిన శార్దూల్ ఠాకూర్ మెరిశాడు. భారత బెంచ్ బలం సైతం తక్కువ కాదని నిరూపించాడు. సఫారీ ఓపెనర్లను పది ఓవర్లలోపే వెనక్కు పంపేశాడు. కీలక వికెట్లు తీసిన మణికట్టు స్పిన్నర్ చాహల్ పొదుపుగా బంతులేశాడు.

టాస్ నెగ్గిన భారత్ తొలుత ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఏడెన్ మార్క్‌రం, హషీమ్ ఆమ్లాలు బ్యాటింగ్‌కు దిగగా భారత బౌలింగ్‌ను శార్దూల్ ఆరంభించాడు. తొలి ఓవర్లోనే మార్క్‌రం రెండు ఫోర్లు బాదాడు. శార్దూల్ వేసిన మూడో ఓవర్లో హషీమ్ ఆమ్లా అదును చూసి ఓ బౌండరీ బాదాడు. అయితే వీరి ఓపెనింగ్ జోడీని శార్దూల్ ఎంతో సేపు నిలువనీయలేదు. ఏడో ఓవర్ మూడో బంతికే ఆమ్లా (10) ను పెవిలియన్ బాట పట్టించాడు. శార్దూల్ వేసిన బంతి ఆమ్లా బ్యాటుకు తగిలి నేరుగా వెళ్లి కీపర్ ధోని చేతిలో పడింది. సఫారీ గడ్డపై అతనికిది తొలి వికెట్. అంతటితో శాంతించని శార్దూల్.. మరో ఓపెనర్ మార్క్‌రం (24)నూ బలిగొన్నాడు. శార్దూల్ వేసిన స్లో బంతిని ఎక్స్‌ట్రా కవర్ మీదుగా తరలించిన మార్క్‌రం.. శ్రేయాస్ అయ్యర్ చేతికి చిక్కాడు. ఈ దశలో ఏబీ డివిలియర్స్, ఖాయా జోండోలు సఫారీ ఇన్నింగ్స్‌ను నడిపించారు. నాల్గు ఫోర్లతో విరుచుకుపడి ప్రమాదకరంగా ఆడుతున్న డివిలియర్స్‌ను యుజ్వేంద్ర చాహల్ బౌల్డ్ చేశాడు. అయితే నాల్గో స్థానంలో బరిలో దిగిన జోండో (54) మాత్రం ఒంటరిపోరాటం చేశాడు. 30 ఓవర్ల తర్వాత వరుస ఓవర్లలో దక్షిణాఫ్రికా క్లాసెన్ (22), ఫర్హాన్ (1), క్రిస్ మోరిస్ (4) వికెట్లు కోల్పోయింది. జట్టు స్కోరు 187 ఉన్న వేళ జోండో చాహల్ బంతికి పాండ్యకు క్యాచ్ ఇచ్చి మైదానాన్ని వీడాడు. ఆఖర్లో ఆండిలె (34), మోర్నీ మోర్కెల్ (20) కాసేపు మెరవటంతో సఫారీల జట్టు స్కోరు రెండొందల మార్కు దాటినా.. భారత బౌలర్ల దెబ్బకు 46.5 ఓవర్లకే కుప్పకూలారు. శార్దూల్ నాల్గు వికెట్లతో మెరవగా.. బుమ్రా, చాహల్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. పాండ్య, కుల్దీప్‌లకు ఒక్కో వికెట్ దక్కింది.



శార్దూల్ ఠాకూర్
(4/52)

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : ఏడెన్ మార్క్‌రం (సి) శ్రేయాస్ అయ్యర్ (బి) శార్దూల్ ఠాకూర్ 24, హషీమ్ ఆమ్లా (సి) ఎమ్ఎస్ ధోని (బి) శార్దూల్ ఠాకూర్ 10, ఏబీ డివిలియర్స్ (బి) యుజ్వేంద్ర చాహల్ 30, ఖాయా జోండో (సి) హార్దిక్ పాండ్య (బి) యుజ్వేంద్ర చాహల్ 54, హెన్రిచ్ క్లాసెన్ (సి) కోహ్లి (బి) బుమ్రా 22, ఫర్హాన్ బెహర్దీన్ (సి) జస్‌ప్రీత్ బుమ్రా (బి) శార్దూల్ ఠాకూర్ 1, క్రిస్ మోరిస్ (సి) శిఖర్ ధావన్ (బి) కుల్దీప్ యాదవ్ 4, అండిలె ఫెహ్లుక్వాయో (సి,బి) శార్దూల్ ఠాకూర్ 34, మోర్నీ మోర్కెల్ (సి) శ్రేయాస్ అయ్యర్ (బి) హార్దిక్ పాండ్య 20, ఇమ్రాన్ తాహిర్ (సి) విరాట్ కోహ్లి (బి) జస్‌ప్రీత్ బుమ్రా 2, లుంగిసాని ఎంగిడి నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 3, **మొత్తం : (46.5 ఓవర్లలో 10 వికెట్లకు) 204.**

వికెట్ల పతనం : 1-23, 2-43, 3-105, 4-135, 5-136, 6-142, 7-151, 8-187, 9-192, 10-204.

బౌలింగ్: శార్దూల్ ఠాకూర్ 8.5-0-52-4, జస్‌ప్రీత్ బుమ్రా 8-1-24-2, హార్దిక్ పాండ్య 10-0-39-1, కుల్దీప్ యాదవ్ 10-0-51-1, యుజ్వేంద్ర చాహల్ 10-0-38-2.

భారత్ ఇన్నింగ్స్ : శిఖర్ ధావన్ (సి) జోండో (బి) ఎంగిడి 18, రోహిత్ శర్మ (సి) క్లాసెన్ (బి) ఎంగిడి 15, విరాట్ కోహ్లి 129 నాటౌట్, అజింక్య రహానె 34 నాటౌట్, ఎక్స్‌ట్రాలు 10, **మొత్తం : (32.1 ఓవర్లలో 2 వికెట్లకు) 206.**

వికెట్ల పతనం : 1-19, 2-80.

బౌలింగ్ : మోర్నీ మోర్కెల్ 7-0-42-0, లుంగిసాని ఎంగిడి 8-1-54-2, క్రిస్ మోరిస్ 6-0-36-0, ఆండిలె ఫెహ్లుక్వాయో 4-0-27-0, ఇమ్రాన్ తాహిర్ 7.1-0-42-0.

చెన్నై ఓపెన్ ఫైనల్లో యుకీ

చెన్నై : భారత అగ్ర శ్రేణి టెన్నిస్ ఆటగాడు యుకీ బాంబ్రీ ఏటీపీ చెన్నై చాలెంజర్ టైటిల్ పోరులో నిలిచాడు. రెండో సీడ్ యుకీ గురువారం నాటి సెమీ సమరంలో లీ డక్‌హీ (దక్షిణ కొరియా)ను 7-5, 6-2తో ఓడించి టాప్ సీడ్ జోర్డాన్ థాంప్సన్ (ఆస్ట్రేలియా)తో టైటిల్ ఫైట్‌కు సిద్ధమయ్యాడు. నేడు జరుగనున్న ఫైనల్లో యుకీ నెగ్గితే 2014 తర్వాత రెండోసారి చెన్నై చాలెంజర్ టైటిల్ అతని సొంతమవుతుంది. ఇక డబుల్స్ టైటిల్ భారత రెండో సీడ్ విష్ణువర్ధన్, ఎన్ బాలాజీల జోడీలను వరించింది. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో అన్‌సీడెడ్ పెట్రోవిక్ జంటపై 7(7)-6(5), 5-7, 10-5తో గెలుపొందింది. చెరో సెట్ నెగ్గటంతో ఫలితం కోసం సూపర్ టైబ్రేకర్‌కు వెళ్లగా భారత జోడీ పూర్తి ఆధిపత్యం చలాయించి టైటిల్ గెల్చుకున్నది.

స్టోక్స్ వచ్చేశాడు

వన్డే సిరీస్‌లో ఆడనున్న ఆల్‌రౌండర్

ఆక్లాండ్ : గల్లీ ఫైట్‌లో కోర్టు కేసు ఎదుర్కొంటున్న ఇంగ్లాండ్ క్రికెటర్, స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ తిరిగి జాతీయ జట్టు తరఫున బరిలోకి దిగేందుకు రంగం సిద్ధం చేసుకున్నాడు. ఈ సోమవారం బ్రిస్టోల్ మెజిస్ట్రేట్ కోర్టుకు హాజరైన స్టోక్స్.. తనపైనొచ్చిన ఆరోపణలను కొట్టివేయాల్సిందిగా విన్నవించాడు. తదుపరి విచారణ మార్చి 12కు వాయిదా వేశారు. ఆ సమయంలో వ్యక్తిగత విచారణ నుంచి మినహాయింపుతో విదేశాలకు వెళ్లవచ్చని కోర్టు అనుమతిచ్చింది. దీంతో న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న ఇంగ్లాండ్ జట్టుతో బెన్ స్టోక్స్ చేరుకున్నాడు. ఆక్లాండ్ విమానాశ్రయంలో ప్లంకెట్, డెవిడ్ విల్లేలు స్టోక్స్‌కు స్వాగతం పలికారు. ఓ నైట్ క్లబ్ నుంచి బయటకొస్తూ ఇద్దరితో తగవు పడిన స్టోక్స్.. పోలీసు కేసులో ఇరుక్కున్న సంగతి తెలిసిందే. ముక్కోణపు టీ20 సిరీస్‌లో భాగంగా ఈ ఆదివారం న్యూజిలాండ్‌తో ఇంగ్లాండ్ తలపడనున్నది. ఈ మ్యాచ్‌కు స్టోక్స్ అందుబాటులో ఉన్నా లేకపోయినా వన్డే సిరీస్‌కు అతడి సేవలు వినియోగించుకునేందుకు ఇంగ్లీష్ జట్టు ఎదురుచూస్తోంది. ముక్కోణపు సిరీస్‌లో ఆడిన మూడు మ్యాచుల్లోనూ ఇంగ్లాండ్ ఓటమిపాలైనా.. ఆదివారం నాటి మ్యాచ్‌లో కివీస్‌పై నెగ్గితే ఆస్ట్రేలియాతో ఫైనల్లో తలపడే అవకాశం ఉంది.



ఆక్లాండ్ విమానాశ్రయానికి చేరుకున్న బెన్ స్టోక్స్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.

టెక్‌ప్లస్
నవతెలంగాణ



అరచేతిలో విజ్ఞానం

స్మార్ట్ ఫోన్‌ల వినియోగం రోజురోజుకూ విర ుతున్న ప్రస్తుత ట్రెండ్‌లో విద్యార్థులకిప్పుడు పరీక్షలకు సంబంధించిన సబ్జెక్ట్‌ను అందించడానికి ఎన్నో మొబైల్ ఆప్స్ అందుబాటులోకి వస్తున్నాయి. ఈ లెర్నింగ్, మొబైల్ లెర్నింగ్ అంటే మొబైల్‌ను అరచేతిలో ఉంచుకుని అధ్యయన సాధనంగా మార్చుకోవచ్చు. తరగతి గదిలో నోట్స్ రాయడానికీ, టైం టేబుల్ ప్రిపేర్ చేయడానికీ, హోం వర్క్ షెడ్యుల్ పెట్టడానికీ.. అంతేనా డ్రాయింగ్ వేసుకోవడానికీ, డయగ్రామ్స్ గీయడానికి ఎన్నో అప్లికేషన్లు ఇంటర్నెట్‌లో ఉన్నాయి. పరీక్షల ప్రిపరేషన్ గైడెన్స్, సక్సెస్ టిప్స్, సక్సెస్ స్టోరీస్, పాత ప్రశ్నపత్రాల విశ్లేషణ వంటివి అందుబాటులో ఉన్నాయి. ఏ సబ్జెక్ట్‌లో వీక్ ఉంటే అందులో పట్టు సాధించడానికి ఈ ఆప్స్ మంచి గైడ్స్‌లా ఉపయోగపడుతున్నాయి. ఒక్కసారి డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు నిరంతరం సమాచారాన్ని అధ్యయనం చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ట్యూటర్స్‌తో పోల్చితే మొబైల్ ఆప్స్ ద్వారా కలిగే అదనపు ప్రయోజనం ఇదే. అలాంటి ఆప్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం...

MarginNote Reader Free

పరీక్షల టైంలో ఎక్కువ డాక్యుమెంట్లను రీడ్ చేయడానికి ఇష్టపడే వారప ఈ ఆప్‌ను వాడొచ్చు. ఈ బుక్ రీడింగ్, వెబ్ బ్రౌజింగ్ అలవాటున్న వారికి ఇది మేలు చేస్తుంది. క్లాస్ రూం మెటీరియల్స్‌ని, నోట్స్‌ని మీరు పీడీఎఫ్ లలో డౌన్‌లోడ్ చేసుకున్నప్పుడు అన్నీ వేర్వేరుగా డౌన్‌లోడ్ అవుతాయి. కానీ ఆ ఫైల్స్ అని ఒకే దగ్గర హ్యాండిల్ చేయడానికి ఈ ఆప్ మంచి ఫ్లాట్ ఫాం. సులభంగా పీడీఎఫ్ డాక్యుమెంట్లను ఓపెన్ చేసుకుని రీడ్ చేసుకోవచ్చు. దీంతో పాటు ఇందులో ఓపెన్ క్యాన్వస్ అందుబాటులో ఉంది. అవసరమైనప్పుడు డ్రాయింగ్ వేసుకోవచ్చు, డయగ్రామ్స్ వేసుకోవచ్చు. ఎక్జామ్స్ టైంలో దీన్ని వాడుకుంటే ఉపయోగంగా ఉంటుంది.

Formulas : స్కూల్స్‌లో కానీ, కాలేజీల్లో కానీ ఎన్నో మాథ్స్ ఫార్ములాను మనం తెలుసుకుంటూ ఉంటాం. వాటిని గుర్తుంచుకోవటం కోసం చేయని ప్రయత్నం ఉండదు. నోట్స్‌లో రాసుకోవడమో, పదే పదే వల్లె వేసుకోవడమో చేస్తుంటాం. అయినా ఒక్కోసారి సరైన టైంకే ఫార్ములాస్ గుర్తుకు రావు. అలాంటపుడు ఏం చేయాలి. మాథ్స్ ఫార్ములను గుర్తు పెట్టుకునే ట్రిక్స్ నేర్పించే ఱటశీతీఎబశ్రీఓం ఆప్స్ డౌన్‌లోడ్ చేయండి. స్కూల్లో, కాలేజీలో నేర్చుకునే జామెట్రీ, ఆల్‌జీబ్రా, త్రికోణమితి, ఇక్వేషన్స్, మాట్రిక్స్, మాథ్స్ ట్రిక్స్, వంటి ఎన్నో ఫార్ములాలు ఈ ఆప్‌ద్వారా నేర్చుకునే వీలుంది. ఇది కేవలం స్మార్ట్ ఫోన్‌లోనే కాదు. ట్యాబ్లెట్స్‌లో కూడా ఉపయోగించే వీలుంది. ఈ ఆప్ వాడుతున్న యూజర్లు ఒకరికొకరు ఫార్ములాలను షేర్ చేసుకోవచ్చు. తెలిసిన ఫార్ములాలను త్వరగా వెతకడానికి సర్చ్ బాక్స్ కూడా ఉంది. మెజర్‌మెంట్స్ కన్వర్ట్ చేయడానికి టూల్స్ ఉన్నాయి. ఎత్తు, బరువు, వాల్యూమ్, వేగం, ఉష్ణోగ్రత వంటి ప్రమాణ విలువలను కన్వర్ట్ చేసుకోవచ్చు. అలాంటివే మరి కొన్ని ఆప్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిలో Photomath, Mathway, Math Tricks, MalMath, వంటి ఆప్స్ పరీక్షల సమయంలో తక్కువ టైంలో ఎక్కువ నేర్చుకోవడానికి, గతంలో చదివిన అంశాలను మరోసారి గుర్తుకు తెచ్చుకోవడానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి.

Studious: ఇది క్లాస్‌రూం ఆప్. మీ స్టడీ షెడ్యూల్‌ని ఆర్గనైజ్ చేసుకోవడానికి, ల్యాబ్ రికార్డులను డిజిటల్ స్టోర్ చేసుకోవడానికి, హోంవర్క్ షెడ్యుల్, టైం టైబుల్‌ను ఆకర్షణీయమైన డిజైనింగ్‌లో తయారుచేసుకోవచ్చు. ఈ ఆప్‌లోకి వెళ్లగానే ఒక్కో సబ్జెక్ట్ పేరుతో మెనూ క్రియేట్ చేసుకోవాలి. తర్వాత ఆ సబ్జెక్ట్‌కు సంబంధించిన టాపిక్స్‌ని అందులో పొందుపరుచుకోవచ్చు. ఇందులో రాసుకున్న నోట్స్ అన్నీ పీఎన్‌జీలో, పీడీఎఫ్‌లో సేవ్ చేసుకోవడానికి వీలుంది. ఈ ఆప్‌తో పాటు మరిన్ని ఆప్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. School Planner, Todait, Study Tips వంటి ఆప్స్ ఈ కేటగిరీలోకే వస్తాయి.



Sparknotes

అర్జెంట్‌గా రోమియో జూలియెట్ కథలను మీరు చదవాలన్నా, షేక్స్ పియర్ నోట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నా 'స్పార్క్స్‌నోట్స్' ఆప్ ఎంతో ఉపయోగపడుతుంది. ఇది ఒక ఇంగ్లీష్ లిటరేచర్ గైడ్‌లా పని చేస్తుంది. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ఎక్కువ ఉపయోగ పడుతుంది. షేక్స్‌పియర్ స్టోరీలు, పోయెట్రీ, ఫిలాసఫీ, డ్రామా, షార్ట్ స్టోరీస్ మొదలగు టైటిల్స్ ఉన్నాయి. ఇందులో సుమారు 2500 టాపిక్స్ పొందుపరిచారు. ఇటీవలే కొత్తగా 200 టైటిళ్లను యాడ్ చేశారు. చదువుతున్న స్టోరీ టెక్స్ట్‌ని, రీడింగ్ మోడ్‌ను కస్టమైజ్ చేసుకోవచ్చు. మధ్యమధ్యలో వచ్చి విసిగించే యాడ్స్ సమస్య ఇందులో ఉండదు. అయితే ఈ ఆప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న మొదటి నెల రోజుల వరకే ఉచితం. ఆ తర్వాత కొంత మొత్తం చెల్లించాల్సిందే! ఈ ఆప్ కేవలం ఆండ్రాయిడ్‌లో మాత్రమే పనిచేస్తుంది.

Science Quiz

ఈ ఆప్ ఎసెస్సీ విద్యార్థుల కోసం తయారు చేసింది. మల్టిపుల్ చాయిస్ క్వెశ్చన్లపై సాధన చేయడానికి సులభంగా ఉంటుంది. సైన్స్ ఓరియెంటెడ్ ప్రశ్నలపై అంటే కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయోలజీ వంటి సబ్జెక్టుల ప్రశ్నలపై పట్టు సాధించడానికి ఉపయోగకరంగా ఉటుంది. ఇందులో 20 లెవెల్స్ ఉన్నాయి. ఒక్కో లెవెల్లో ఒక్కో సబ్జెక్ట్‌కు 10 ప్రశ్నలుంటాయి. నిర్ణీత సమయంలో వాటికి సరైన సమాధానం చేస్తూ వెళ్లడమే. 15 సెకండ్లకో సారి ప్రశ్న మారుతూ ఉంటుంది. 10 ప్రశ్నల్లో కనీసం 7ప్రశ్నలకు సరైన సమాధానం ఇస్తే లెవెల్ మారుతుంది. పది ప్రశ్నల్లో మూడింటికి ఫిఫ్టీ ఫిఫ్టీ ఆప్షన్ కూడా ఉంది. తప్పు సమాధానం ఇస్తే ఎర్రర్ మార్కు వచ్చి జవాబు డిస్‌ప్లే అవుతుంది. దాన్ని గుర్తు పెట్టుకుని నెక్స్ట్ టైం ఆన్సర్ చేసే అవకాశం ఉంది. ఈ ఆప్ విద్యార్థుల్లో ఆత్మావిశ్వాసాన్ని పెంచుతుంది. నాల్జెడి పవర్‌ను, స్కిల్స్‌ను డెవలప్ చేస్తుంది.

- వినోద్

నయామాల్

మోటోరోలా నుంచి ...

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ మోటోరోలా మరో సరికొత్త స్మార్ట్‌ఫోన్‌ను రూపొందించింది. ఈ ఫోన్ 'మోటో జెడ్2 ఫోర్స్' భారత మార్కెట్లో మోటో హబ్ స్టోర్ల ద్వారా అందుబాటులోకి వచ్చింది. షట్టర్ ప్రూఫ్ స్క్రీన్, సూపర్ స్లీక్ బాడీ, క్వాల్కం స్నాప్‌డ్రాగన్ 835 ప్రాసెసర్, టర్బో పవర్‌తో 6220 ఎంఏహెచ్ పవర్ మొదలైనవి ఈ ఫోన్‌లోని ప్రత్యేకతలు. దీని ధరను 34,999గా నిర్ణయించారు.



మోటో జెడ్2 ఫోర్స్ లోని మరిన్ని ఫీచర్స్..

- 5.5 అంగుళాల క్వాడ్ హెచ్‌డీ డిస్‌ప్లే
- ఆండ్రాయిడ్ 8.0 ఓరియో క్వాల్కం స్నాప్‌డ్రాగన్ 835 ప్రాసెసర్
- 1440x2560 పిక్సెల్ రిజల్యూషన్
- 6జీబీ ర్యామ్ 64జీబీ స్టోరేజ్ 2టీబీ వరకు పెంచుకోవచ్చు.
- 12+12ఎంపీ డ్యుయల్ రియర్ కెమెరా విత్ ఎల్ఈడీ ఫ్లాష్
- 5ఎంపీ ఫ్రంట్ కెమెరా విత్ ఎల్ఈడీ ఫ్లాష్
- 2730 ఎంఏహెచ్ బ్యాటరీ (టర్బో పవర్ ప్యాక్)

మోటో జీ4 ప్లస్ ఫీచర్లు



- 5.5 ఇంచ్ ఫుల్ హెచ్‌డీ డిస్‌ప్లే,
- 1920 ఇ 1080 పిక్సల్స్ స్క్రీన్ రిజల్యూషన్ గొరిల్లా గ్లాస్ 3 ప్రొటెక్షన్, అడ్రినో 405 గ్రాఫిక్స్
- 2, 3 జీబీ ర్యామ్, 16, 32 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ (128 జీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్)
- ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 617 ప్రాసెసర్ డ్యుయల్ సిమ్, ఆండ్రాయిడ్ 6.0
- 16 మెగాపిక్సల్ రియర్ కెమెరా విత్ డ్యుయల్ టోన్ ఎల్ఈడీ ఫ్లాష్
- 5 మెగాపిక్సల్ సెల్ఫీకెమెరా
- ఫింగర్‌ప్రింట్ సెన్సార్
- 4జీ ఎల్‌టీఈ, బ్లూటూత్
- 4.1 3000 ఎంఏహెచ్ బ్యాటరీ, టర్బో చార్జింగ్

– ధర రూ. 14,637

మోటో ఎక్స్4



- 5.2 ఇంచ్ ఫుల్ హెచ్‌డీ ఎల్‌టీపీఎస్ ఐపీఎస్ డిస్‌ప్లే,
- గొరిల్లా గ్లాస్ ప్రొటెక్షన్, 1920 ఇ 1080 పిక్సల్స్ స్క్రీన్ రిజల్యూషన్,
- 2.2 గిగాహెడ్జ్ ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 630 ప్రాసెసర్
- 3,4,6 జీబీ ర్యామ్, 32/64 జీబీ స్టోరేజ్, 2టీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్, –ఆండ్రాయిడ్ 8.0 ఓరియో, హైబ్రిడ్ డ్యుయల్ సిమ్,
- 12, 8 మెగాపిక్సల్ డ్యుయల్ బ్యాక్ కెమెరాలు
- 16 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా,
- ఐపీ 68 వాటర్, డస్ట్ రెసిస్టెన్స్, ఫింగర్‌ప్రింట్ సెన్సార్,
- 4జీ వీవోఎల్‌టీఈ, డ్యుయల్ బ్యాండ్ వైఫై, బ్లూటూత్ 5.0 ఎల్ఈ, ఎన్ఎఫ్‌సీ, యూఎస్‌బీ టైప్ సి,
- 3000 ఎంఏహెచ్ బ్యాటరీ, టర్బో చార్జింగ్.

ఛాందస గ్రహణాన్ని ఒదిలించాలి

నమ్మకాలు నిజాలు

ప్రశ్న : గ్రహణాల వల్ల కలిగే ఫలితాలేమిటి?

- ఎం.జగన్, హన్మకొండ

జవాబు : గతవారంలో మీకు చంద్ర గ్రహణావిర్భావం గురించి, సూర్యగ్రహణం ఏర్పడ్డం గురించి, సూపర్‌మూన్, బ్లూ మూన్, బ్లడ్‌మూన్ గురించీ సంక్షిప్తంగా తెలియజేశాను. మొన్నామధ్య ఓ ప్రముఖ టీవీ చానెల్‌లో 31 జనవరి నాడు సంభవించిన చంద్రగ్రహణం (బ్లూ, బ్లడ్, సూపర్ మూన్ గ్రహణం) సందర్భంగా జరిగిన చర్చల్లో ఒక మేధావి అశాస్త్రీయ వాదనలెలా చేశాడో చూద్దాం. సదరు మేధావి ఓ భౌతికశాస్త్ర అధ్యాపకుడు. కానీ ఆయనకు జీతభత్యాలు, సమాజంలో పలుకుబడి, జీవనాధారాన్నిస్తున్న భౌతికవాదపుట భ్యాసానికి మునుపే లేదా సమాంతరంగా మతఛాందస భావజాలాలు పటిష్టంగా మస్తిష్కంలో పేరుకు పోవడం వల్ల శాస్త్ర పదజాలాన్ని వాడుతూ అశాస్త్రీయతకు పెద్దపీట వేశాడు. ప్రస్తుతం బలీయంగా విస్తరిస్తున్న కాషాయీకరణ భావజాలాన్ని పరిపుష్టి చేసేందుకు ఆయన సైన్సు పదజాలాన్ని తలాతోక లేకుండా వాడుకోవడం ప్రారం భించాడు. అదే టీవీ చర్చల్లో ఫోన్‌యిన్ ద్వారా నేను చేసిన వివరణను అడ్డు కోవడానికి పడికట్టు పదాల్ని వాడబోయాడు. ఇదెందుకు చెబుతున్నానంటే... ఈ వ్యాసం ద్వారా సదరు మేధావిని వ్యక్తిగతంగా ఢీకొనడానికి కాదు. నేటి సమాజంలో సైన్సు తెలిసినవారే సైన్సు పదజాలాన్ని ఇబ్బడి ముబ్బడిగా, అసందర్భంగా, కుట్రపూరితంగా, కపట బుద్ధితో వాడుకొంటూ, వారికున్న ఛాందసభావజాలానికి, రాజకీయ వర్గ ప్రయోజనాలకు బలాన్నివ్వడానికి విఫలప్రయత్నాలు చేస్తున్నారు. గ్రహణం గురించి, గ్రహణాల ప్రభావం గురించి, జ్యోతిష్యశాస్త్రం గురించి సదరు భౌతికశాస్త్ర అధ్యాపకుడు వెలిబుచ్చిన కొన్ని అసందర్భ అననుసరణీయ (irrelevant) సైన్సు పదజాలాలు ఈ విధంగా వున్నాయి.

1. భూమి సూర్యుని చుట్టూ తిరిగే క్రమంలో సాదశ్యంగా మనకు సూర్యుడే భూమి చుట్టూ తిరుగుతున్నట్టు కనిపిస్తుంది. ఆ క్రమంలో అంతరిక్షంలో సూర్యుడు ఏ నక్షత్ర మండలాలు నేపథ్యంగా ప్రయాణిస్తున్నాడో 360 డిగ్రీలు పట్టే ఆ నేపథ్యాన్ని 12 భాగాలుగా (సెక్టార్లు) చేశారు. ఒక్కో సెక్టారుకు ఒక్కో రాశి (Zodiac Constellation)గా నామకరణం చేశారు. అంటే ప్రతి రోజు లేదా ప్రతి ఘడియలో నిర్దిష్ట రాశి, నిర్దిష్ట గ్రహోపగ్రహాల స్థావరాల భంగిమ వుంటుంది. ఆ సమయంలో జన్మించిన శిశువు మీద ఆయా నిర్దిష్ట నక్షత్ర, గ్రహ, ఉపగ్రహ భంగిమల ఫలిత ప్రభావం వుంటుంది. వివిధ ఘడియల్లో పై ఖగోళ భంగిమలు ఈ విధంగా వుండడం వల్ల శిశువుల జన్మ సమయాన్ని బట్టి ప్రభావం కూడా వైవిధ్యంగా వుంటుంది.

అశాస్త్రీయత, అననుసరణీయత

విశాల విశ్వంలో ఏదీ స్థిరంగా లేదు. నక్షత్రాల గ్రహాల, ఉపగ్రహాల కదలి కలన్నీ ఒకే వేగంతో ఒకే దిశలో లేవు. అనుక్షణమూ అవి మారుతూ వున్నాయి. గత సంవత్సరం, ఫిబ్రవరి 14న ఉన్న సదరు మేధావి పేర్కొన్న ఖగోళ భంగిమ ఈ సంవత్సరపు ఫిబ్రవరి 14న ఉన్న భంగిమ ఒకే విధంగా లేదు. దూరాన ఉన్న రెండు వేర్వేరు వ్యవస్థల మీద పరస్పర ప్రభావం కేవలం 4 రకాల బలాల ద్వారానే వీలవుతుంది. ఇందులో మొదటి రెండింటి కేంద్రక బలాలు ప్రభావం కేవలం పరమాణువుల మధ్యలో ఉన్న కేంద్రకాల (nuclei) పరిధిని దాటి పని చేయదు. సదరు మేధావి లేదా అలాంటి జ్యోతిశ్శాస్త్ర కోవిదులు చెప్పే నక్షత్ర రాశి, జన్మనక్షత్ర బలాలు కేంద్రకాల పరిధిని దాటి ఉన్నాయి. ఇక మిగిలిన రెండింటిలో విద్యుదయస్కాంత బలాలు దూరాన్నించి వ్యవహరించాలంటే అది కేవలం కాంతి రూపంలోనే వుండాలి. రాత్రుళ్లయినా, పగలయినా ప్రసవగదిలోని కాంతితో పోలిస్తే నక్షత్ర రాశుల కాంతి కోటానుకోట్ల రెట్లు తక్కువ వుంటుంది. కాబట్టి పైన పేర్కొన్న ప్రభావిత బలాల్లో నక్షత్రాల ద్వారా వీలయ్యే విద్యుదయస్కాంత ప్రభావం పూర్తిగా ఉపేక్షణీయం (Negligible) కాగా మిగిలిందిక గురుత్వాకర్షణ బలం. రెండు పరస్పర ప్రభావీకరణ వ్యవస్థల ద్రవ్యరాశులు M, M2 కి.గ్రా అయినట్లయితే వాటి మధ్య దూరం R మీటర్లు అయినట్లయితే ఆ వ్యవస్థల మధ్య సమకూరే గురుత్వబలం, F విలువ 16వ శతాబ్దంలోనే నిరూపించబడి, నేటికీ అన్వయం (applicable) కాగలిగేలా క్రింది రూపంలో వుంటుంది.

F= G M1xM2/R2

ఇక్కడGని విశ్వ గురుత్వ స్థిరాంశం (Universal Gravitational Constant) అంటారు. దీని విలువ సుమారుగా 6.67I10``11 m3. kg-1.s-2 వుంటుంది. (ఈ దినపత్రిక సాధారణ పాఠకులు అంకెల తర్వాత ఉన్న అక్షరాలు, వాటి ఘాతాల గురించి తల బద్దలు కొట్టుకోనవసరంలేదు. అవి శాస్త్రానుగుణ అంశాలు. పట్టించుకోకండి). సూర్యుని తర్వాత మనకు అతి దగ్గరలో ఉన్న నక్షత్రం ఆల్ఫా సెంటూరి. అది 12 రాశుల్లో వుండదు. 12 రాశుల్లో ఉన్న ఏ నక్షత్రమైనా ఆల్ఫా సెంటూరి కన్నా ఎక్కువ దూరంలో వుంటుంది. ఆల్ఫా సెంటూరి మనకు సుమారు 5 కాంతి సంవత్సరాల దూరంలో వుంది. నక్షత్రాల మధ్య సగటు దూరం ఇదే అనుకుందాం. రాశుల్లో ఉన్న నక్షత్రాల సంఖ్య సగటున 10 ఉన్నాయనుకొందాం. వాటి మధ్య కూడా సగటున 5 కాంతి సంవత్సరాల దూరం వున్నట్లయితే వాటి సంయుక్త గరిమనాభి మనకు సుమారు 15 కాంతి సంవత్సరాల దూరంలో వున్నట్లు భావిస్తే ఎవరూ అభ్యంతరం చెప్పరు. ఒక్కో కాంతి సంవత్సరం విలువ గతంలో ఇదే శీర్షికల్లో పలుమార్లు ప్రస్తావించినట్లుగా (3×105×60×60×24×365= 94,608000 లక్షల కి.మీ.) ఆ విధంగా భూమికి, సగటు నక్షత్ర రాశికి మధ్య ఉన్న సగటుదూరం సుమారుగా 1,41,91,20,000 లక్షల కి.మీ. నక్షత్ర రాశిలో సుమారు 10 నక్షత్రాలు ఉన్నాయనుకున్నా అవి ప్రతి ఒకటీ దాదాపు సూర్యుని కున్నంత ద్రవ్యరాశి (mass) ఉన్నట్లు భావించినా ఒక్కో నక్షత్రరాశి (constellation) ద్రవ్యరాశి సూర్యుని ద్రవ్యరాశి అయిన 2ఐ1030 కి.గ్రా కన్నా 10 రెట్లు ఎక్కువ వుంటుంది. అదే సమయంలో ఆరోగ్యంగా ప్రసవించిన బిడ్డ ద్రవ్యరాశి సుమారు 4 కి.గ్రా ఉన్నట్లయితే ఆ విడ్డ మీద ఆ నక్షత్రరాశి వల్ల కలిగే గురుత్వాకర్షక బలపు విలువ పైన పేర్కొన్న సమీకరణం (Equation) ప్రకారంF= 6.67x10-11x 4x10x2x1030/ (141912x141912)x1024 న్యూటన్లు వుంటుంది. దీని విలువను కాలిక్యులేటరుతో సాధిస్తే అది 2.65×10-21 న్యూటన్లు వుంటుంది.

అదే ప్రసవగదిలో ఒక ఈగ లేదా దోమ (సుమారు 3 గ్రాముల ద్రవ్యరాశి) ఆ శిశువు ప్రసవిస్తున్న సమయంలో 1 మీటరు దూరంలో విహరిస్తున్నట్లయితే ఆ ఈగకు, శిశువుకు మధ్య సమకూరే గురుత్వాకర్షక బలం పైన పేర్కొన్న సమీకరణం ప్రకారం F= 6.67x10-11x 4x0.003/1x1 నూటన్లు వుంటుంది. క్యాలిక్యులేటరులో దీన్ని లెక్కిస్తే... దాని విలువ 8×10-13 న్యూటన్లు వుంటుంది. ఇది నక్షత్ర రాశుల బలం కన్నా 3X1010 అంటే ఆ శిశువు మీద ఆ ప్రసవ గదిలో వున్న ఈగల ప్రభావమే నక్షత్ర రాశి ప్రభావం కన్నా 3వేల కోట్ల రెట్లు ఎక్కువ. మరో మాటలో చెప్పాలంటే ప్రసవగదిలో వున్న నర్సులు, డాక్టర్లు, ఫ్యాన్లు గురుత్వాకర్షక బలం నక్షత్ర రాశి బలం కన్నా కొన్ని వేల రెట్లు ఎక్కువ వుంటుంది. భూమివల్ల కలిగే బలమే కొన్ని కోట్ల రెట్లు ఎక్కువ వుంటుంది. మరో మాటలో చెప్పాలంటే నక్షత్రరాశుల ప్రభావం శిశువుపై ఉపేక్షణీయం. ఇక జ్యోతిష్యశాస్త్రానికి వైజ్ఞానిక ప్రాతిపదిక మగ్యం.



2 గ్రహణ ప్రభావం భూమ్మీద ఉన్న మనుషుల మీద (ఆ మేధావి ప్రకారం):

క్వాంటం సిద్ధాంతం ప్రకారం ప్రతి వస్తువుకు పాదార్థిక కణ స్వభావం (Particulate property) తో పాటు తరంగ స్వభావం (wave character) కూడా వుంటుంది. సూర్యుని కదలికల వల్ల కలిగే సౌర తరంగం, చంద్రుని కదలికల వల్ల కలిగే చంద్రతరంగం, భూమి కదలికల వల్ల వచ్చే భూ తరంగం (రామునితోక పివరిండిట్లనియెన్ అన్నట్లుగా గాక రామునితో కపివరుండిట్ల నియెన్ అన్నట్లుగానే భూ తరంగాన్ని భూత రంగంగా చదవవలదని మనవి) పరస్పరం కలబోసు కొంటాయి. ఈ దృగ్విషయాన్ని క్వాంటం సిద్ధాంతంలో తరంగాల అధ్యాచ్ఛాదన మిశ్రమణం (Superposition of waves) అంటారు. అదేవిధంగా భూమ్మీద ఉన్న మన మీద సౌర, చంద్రతరంగాల అధ్యాచ్ఛాదన మిశ్రమం ప్రభావం వుంటుంది. అంటే గ్రహణాల సమయంలో అన్నీ ఒకే రేఖ మీద రావడం వల్ల తరంగాచ్ఛాదిత సమ్మిశ్రణ ప్రభావం మిగిలిన కాలాలకు భిన్నంగా వుంటుంది.

ఇందులోని అననుసరణీయత, అశాస్త్రీయత : పదార్థాల తరంగ ప్రభావపు తరంగ దైర్ఘ్యాన్ని దీబ్రోయి (De Broglie) సమీరణంతో చూపుతారు. అది క్రింది విధంగా వుంటుంది.

l = h/pమీటర్లు ఇక్కడ lఅంటే తరంగ దైర్ఘ్యం, h అనగా ప్లాంక్ విశ్వ స్థిరాంకం (దీని విలువ 6.63×10-34 js) కాగా pని ద్రవ్యవేగం అనగా ద్రవ్యరాశి వేగాల లబ్ధం (Mathematical product of mass and velocity). భూమి కదిలేవేగం (సెకనుకు) సుమారు 30000 మీ. భూమి ద్రవ్యరాశి సుమారు 6X1024 కి.గ్రా. కాబట్టి భూమికున్న ద్రవ్యవేగం సుమారు 18I1028 kgms-1. ఈ విలువను పైన పేర్కొన్న డిబ్రోయి సూత్రంలో ప్రతిక్షేపిస్తే (Substitution) ఆ భూ తరంగపు తరంగ దైర్ఘ్యం విలువ lE = 6.63x10-34/18x1028 = 3.68x10-62 మీ.అంటే పరమాణు వ్యాసం ఒక ఆంగ్‌స్ట్రాం కన్నా కొన్నికోట్ల, కోట్ల, కోట్ల, కోట్ల, కోట్ల, కోట్ల, కోట్ల రెట్లు తక్కువన్నమాట. ఇక తరంగ స్వభావం ఎక్కడీ తరంగ స్వభావం గణితం ప్రకారం శూన్యరహితం (Finite)గా ఉన్నా దాని ప్రభావం పూర్తిగా అననుసరణీయం. ఇదే విధంగా చంద్రతరంగం విలువ (చంద్రుని ద్రవ్యరాశి 7.3X1022 కి.గ్రా చంద్రుని పరిభ్రమణ వేగం 1000 మీ. (సెకనుకు) లెక్కిస్తే అది lM = 6.63x10-34/7.3x1025 = 9.08x10-59 మీ.అంటే దీని తరంగ దైర్ఘ్యం కూడా పరమాణువు సైజుకన్నా కొన్ని కోట్ల, కోట్ల, కోట్ల, కోట్ల, కోట్ల, కోట్ల, రెట్లు తక్కువన్నమాట. ఇక సౌర తరంగం గురించి (సూర్యుని ద్రవ్యరాశి పైన పేర్కొన్నట్లుగా 2X1030 కి.గ్రా సూర్యుడు పాలపుంత గెలాక్సీలో తిరిగే వేగం సుమారు 350 కి.మీ. (సెకనుకు)) లెక్కిస్తే సౌరతరంగ దైర్ఘ్యం (దీబ్రోయి సమీకరణం ప్రకారం) lS = 6.63x10-34/700x1033 = 9.47x10-70 మీ.ఇది కూడా భూ తరంగం కన్నా శశితరంగం కన్నా కోట్లాది రెట్లు తక్కువ. కాబట్టి శాస్త్ర పదాలతో జిమ్మిక్కులు చేస్తూ శాస్త్రోద్యోగాల ద్వారా పొట్టనింపుకుంటూ పిల్లాపాపలకు చదువులు జీవితాన్నిస్తూ తల్లి లాంటి శాస్త్రానికి, శాస్త్ర నియమాలకూ తూట్లు పొడిచే ద్రోహపూరిత మేధావులు భూ తరంగాలకు, శశి తరంగాలకు భాస్వర తరంగాలకు ముడి పెట్టి భూతకాలపు భూత రంగపు మత ఛాందస నిశిరాత్రుల్ని పసలేని శశితరంగాలతో భాస్వర తరంగపు భాస్వరంతో మండిస్తే మిగిలేది వారి అజ్ఞానపు భస్మం తప్ప మరొకటి కాదు.

అర్థంపర్థం లేని మత ఛాందస విడ్డూరాల్ని, మూఢ విశ్వాసాల్ని ప్రజల్లో నిత్యం వుంచేలా ప్రయత్నించే కపట బుద్ధుల బండారాల్ని బట్టబయలు చేయాలి. విజ్ఞాన శాస్త్రాన్ని పరిహాసం చేసే సంకుచిత భావాల రంకును రాజకీయాల్లోకి మళ్ళించే మతతత్వ పోకడల్ని అడ్డుకోవాలి. దశావతారాలు పరిణామవాదానికి చిహ్నాలని ఒకసారి, పరిణామవాదమే తప్పని మరోసారి సమయానుకూలముగా మాట మార్చే మతఛాందస భావాల్ని ప్రజల్నించి దూరం చేయాలి. మానవ సమాజానికి పట్టిన ఛాందస గ్రహణాన్ని విజ్ఞాన ప్రచారాల వెలుగులో మటుమాయం చేయాలి.



ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు, చెకుముకి,
జన విజ్ఞాన వేదిక

